

ఆంధ్ర
ప్రభ
సచిత్ర వారపత్రిక
సమవర్తి
ఆర్. పార్వతీదేవి
ఫుల్అవుట్ నవల

అప్పుడే స్నానం ముగించుకున్న సంయుక్త తడిఆరడం కోసం కురుల్ని వీపునిండా పరుచుకుని బుద్ధిగా దేవుడిగది లోనికి చేరింది. రోజులా కాఫీ జోలికి పోకుండా భక్తిగా పూజ కానిచ్చింది.

ఆరోజు శనివారం, అందువల్ల తలంటుకొని పూజకానివ్వనిదే బామ్మ కాఫీ ఇవ్వదని బాగా తెలుసు సంయుక్తకు.

"కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడూ....

శోభారాజ్ గొంతు మృదుమధురంగా వినబడుతోంది పక్కింటి రేడియోనుండి. అది విని తనుకూడా రేడియో పెట్టింది. ఆ తర్వాత బామ్మ కోసం ఇల్లంతా వెదికింది. ఎక్కడా కనబడలేదు. వీథిలోనికి వచ్చి చూసింది.

అరుగుపైన కూర్చుని వుంది బామ్మ. ఏదో కీర్తన సన్నగా పాడుతూ వత్తులు చేస్తోంది. అలవాటైన చేతులు తమపని తాము చేస్తున్నాయి. బామ్మ కళ్లు మాత్రం ఎదురింటి రామనాథంపై ఉన్నాయి.

తాను కూడా అటు చూసింది. వింతగాని, విశేషంగాని ఏమీ లేదక్కడ. మామూలుగానే రామనాథంగారు పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు.

సంయుక్త బామ్మకు దగ్గరగా నడిచింది. బామ్మ రామనాథాన్ని దారుణంగా తిడుతోంది. మెల్లిగా తిడుతున్నందువల్ల పైకి వినబడటంలేదు. కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న ఆ మానవుడు తిట్లు తినేంత తప్పు ఏం చేశాడో అర్థంకాలేదు సంయుక్తకు.

"ఎందుకే బామ్మ! పాపం ఆయన్ని అలా తిడతావు?"అడిగింది సంయుక్త.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది బామ్మ.

'చూడు మరి....ఆ పేపరు ఇలా ఇస్తాడేమో! నీ ఉద్యోగాల సంగతి చూసుకుంటావు అనుకుంటే, ఆ పేపరు పట్టుకుని తలక్రిందులు పక్షిలా వేలాడుతున్నాడు'' రామనాథంకేసి మెటికలు విరిచింది బామ్మ.

"పోనీలే బామ్మా! చదువుతున్నారుగా!''

సర్ది చెప్పబోయింది సంయుక్త.

"ఏం పేపరు తనదేగా! సాయంత్రం చదువుకోవచ్చు కదా? ఒక పక్క ఆఫీస్ సమయం అవుతుంటే ఇప్పుడే చదువుకోవాలా?''

సంయుక్తకు రామనాధంగారిపై చాలా జాలి కలిగింది. పొద్దుటే లేచి ఎవరి ముఖం చూశాడో... బామ్మ నోట్లో పడిపోయాడు.

"బామ్మా! కాఫీ కావాలి'' గారంగా అడిగింది సంయుక్త. "బంగారుతల్లీ! పాలపాకెట్ తెచ్చాను. పంచదార కూడా వుంది. కాఫీపొడి మాత్రం...'' అర్థోక్తిలో ఆపింది బామ్మ.

"మరేం చేద్దాం?''

"ఏముంది? అ.తె.వా'' చెప్పింది బామ్మ.

"నేను వెళ్లను.''

"నేను వెళ్తాను'' యుద్ధానికి వెళ్లే సైనికుడిలా పక్కింటికి బయలుదేరింది బామ్మ.

ఆ బామ్మ మనవరాళ్ల జీవితాల్లో అతి ముఖ్యమైన కార్యక్రమం అ.తె.వా. అంటే అరువు తెచ్చుకొని వాడుకోవడం. ఇరుగు పొరుగువాళ్లు కూడా ఏమి అనుకోరు.

ఆ వీథిలో ప్రజల ఉమ్మడిసొత్తు బామ్మ. ఎవరింట్లో ఏం జరిగినా బామ్మ ఉండాల్సిందే. బామ్మ సలహాలేకుండా ఎవరి ఇంట్లోను ఏమీ జరగదు.

అయితే ఇలా అడగడానికి సంయుక్త అప్పుడప్పుడు అభ్యంతరం చెబుతుంది. బామ్మ మాత్రం ఏం పట్టించుకోదు. మన దగ్గర ఉన్నది నలుగురితో పంచుకోవాలి. లేనిది తెచ్చుకోవాలి. ఇదీ బామ్మ పద్ధతి.

ఒక చేత్తో పేపరు పట్టుకొని దూసుకొచ్చాడు భరత్. వాడు పదవతరగతి పరీక్షలు రాశాడు. పక్కింటి వాణిగారి ఏకైక పుత్రరత్నం. వాడిని చూస్తూనే అడిగింది సంయుక్త.

"ఏరా! ఏం జరిగింది?''

"నా రిజల్ట్స్ వచ్చాయక్కా'' చెప్పాడు భరత్.

"పాసయ్యావా?"

"అదే తెలీడం లేదు. నా నంబరు మర్చిపోయాను. హాల్‌టికెట్ ఎక్కడో పడిపోయింది. ఎవరిని అడిగినా చెప్పలేకపోతున్నారు."

"పరీక్షల్లో నీ ముందు ఎవరో గుర్తుందా?"

"లేదక్కా."

"పోనీ వెనుక....?"

"అదీ గుర్తులేదక్కా" అన్నాడు వాడు బిక్కమొఖంతో లాగిపెట్టి నెత్తిమీద ఒక్కటిచ్చింది సంయుక్త. దాంతో ఏడుపు ముఖం పెట్టేశాడు భరత్"

"పాసవ్వకపోతే ఏదైనా కొట్లో చేర్పించేస్తానన్నాడు మా నాన్న. ఎలాగే అక్కా?"

"ఏట్లో దూకు వెధవ. లేకపోతే వెళ్లి చిలకజోస్యం చెప్పించుకో" కసిరింది సంయుక్త.

"అది కాదక్కా! అప్పుడెప్పుడో నీకు నెంబరు చెప్పాను. గుర్తుందేమోనని..." నసిగాడు భరత్.

ఒక్కక్షణం ఆలోచించింది సంయుక్త. ఇటువంటివి తను కాలెండర్ వెనుక వేస్తుంది. గబగబా గోడకు తగిలించిన కేలండర్ దగ్గరకు నడిచింది. అంతకు ముందు నెలలో వేసివుందా నెంబర్.

భరత్ చేతిలోని పేపరు లాక్కుని నెంబరు చూసింది. వాడికి ఎలానూ ఫస్ట్‌క్లాస్‌గాని, సెకండ్‌క్లాసుగాని వస్తాయని ఆశలేదు. ఆర్డినరీలో వెదికింది. పాసయ్యాడు.

అది వినగానే పంజరంనుండి ఎగిరే చిలకలా కేరింతలు కొడుతూ బయటకు దూసుకుపోయాడు భరత్.

అది పాతకాలపు ఇల్లు. లంకంతకొంప అంటుంటుంది బామ్మ. దానిని కొద్దిగా మార్పుచేర్పులతో అద్దెలకిచ్చేసింది. ఒక వాటాలో బామ్మ, మనవరాళ్లు ఉంటున్నారు.

డీసిల్‌ఇంజన్‌లా శబ్దం చేసుకుంటూ వచ్చేసింది బామ్మ.

"వాణి కొడుకు పరీక్ష పాసయ్యాడట కదూ?"

వంట గదిలోనికి వెళ్తూ అడిగింది.

"ఔను" చెప్పింది సంయుక్త.

"వాణి చెప్పిందిలే. కొంచెం కాఫీపొడి అడిగితే ఇదిగో ఈ గ్లాసునిండా ఇచ్చేసింది. తనకు కందిపప్పు కావాలట. నేను ఇస్తానన్నాను" దీర్ఘం తీస్తూ చెప్పింది. సంయుక్త ఏమీ మాట్లాడక పోవడంతో తిరిగి తనే చెప్పింది.

"మనకు అవసరమైనది వాళ్ల దగ్గర తెచ్చుకోవాలి వాళ్లకు అవసరమైనది మనం ఇవ్వాలి" ఒళ్లు మండిపోయింది సంయుక్తకు.

"నాపెళ్లి మాటేమిటి? నా మొగుడు కూడా ఇలా అ.తె.వా. స్కీమ్ కిందే వస్తాడా?" ముక్కు ఎగబీలుస్తూ అడిగింది.

సమాధానంగా వంటింట్లో నుండి ముందు ఒక గ్లాసు గాల్లో తేలుతూ వచ్చింది. ఆ తర్వాత ఒక పళ్లెం విష్ణుచక్రంలా దూసుకొచ్చింది. అప్పుడు అర్థమైంది సంయుక్తకు తన మాటల్లో పొరబాటు. పళ్లెం వెనుకే వస్తున్న బామ్మను ... పెరడువైపు పరుగెత్తింది.

* * *

భయంకరంగా మర్రిఊడల్లా ఉన్న తన చేతులను చాచి వికృతంగా నోరు తెరిచి, కోరల్లా ఉన్న తన దంతాలను చూపుతూ మీదికు వస్తుందా వికృతాకారం.

ఆ చేతులకు అందకూడదని వెనుకకు జరుగుతున్నాడు. అయినా ఆ వికృతాకారం వదలడం లేదు. తన చేతులను మరింత పొడుగ్గా యమపాశాల్లా ముందుకు చాపుతూనే వుంది. ప్రాణభీతితో గిర్రున వెనక్కు తిరిగి ముందుకు పరిగెత్తాడు. భయంతో గుండెలు దడదడలాడుతుండగా చెమట ముఖం మీదకు ధారగా వర్షంలా జారుతుండగా పరిగెట్టసాగాడు.

ప్రాణాలను అరికాళ్లలోనికి తెచ్చుకొని అలాగే ముందుకు పరుగెడుతున్నాడు. అయినా వదలడం లేదా ఆకారం. వెన్నంటి తరుముసాగింది. హఠాత్తుగా కొద్దిదూరంలో పెద్దభవంతి కనబడింది. లోపల మనుష్యుల అలికిడి వినబడింది.

అంతే! సుడిగాలిలా, ప్రళయకాల ప్రభంజనంలా అటు పరుగెట్టాడు. ఆ భవనం తలుపులు గెంటుకొని లోపలకు దూసుపోయాడు.

ప్రార్థన జరుగుతుందక్కడ. అందరూ మౌనంగా తలలు వంచుకొని కూర్చున్నారు. డయాస్‌పై నుండి ప్రార్థన మంద్రస్థాయిలో వినబడసాగింది. తను కూడా ఒక బెంచిపై కూర్చుని అరచేతులలో ముఖం దాచుకున్నాడతను.

గుండె విపరీతమైన వేగంతో కొట్టుకుంటోంది. ఊపిరి పీల్చుకోవడం చాలా కష్టంగావుంది. ఊపిరితిత్తులు పగిలిపోతాయేమో అనిపిస్తోంది. కళ్లుమూసుకొని కదలకుండా కూర్చున్నాడతను.

ఎవరో పరిహాసంగా నవ్వడం వినిపించింది. ఠక్కున తలయెత్తి చూసి ఉలిక్కి పడ్డాడతను. అక్కడ ఉన్న మనుషులందరూ క్రమంగా తోడేళ్లుగా మారిపోతున్నారు.

ఒక వ్యక్తి తలలోనుండి బయటకువచ్చిన తోడేలు తల అతని ముఖందాకా వచ్చింది. నాలుక చాపి అతని చెంపలను నాకింది. అతని కడుపు కండరాలను బిగదీస్తూ కంఠనాళాలను చీలుస్తూ వెలువడింది భయానకమైన కేక.

తుళ్లిపాటుతో లేచి కూర్చున్నాడు సింధూర్. ఒళ్లంతా చెమటపోసి స్నానం చేసినట్లు ఉంది. తన గుండె చప్పుడు తనకే స్పష్టంగా వినబడుతోంది. చుట్టూ చూశాడు. తన గదిలోనే ఉన్నాడు. అంటే ఇంతవరకు జరిగింది కలన్నమాట.

ఒక ప్రక్కన ఉన్న టెలిఫోన్ పెద్దగా మోగుతోంది. అయినా దాని జోలికి వెళ్లలేదు సింధూర్.

నడుం వరకు కప్పుకున్న దుప్పటి తొలగించి బెడ్‌పైనుంచి కిందకు దిగాడు. ఒక మూలగా ఉన్న ఫ్రిజ్ దగ్గరకు నడిచి, దానిలోనుండి ఐస్‌వాటర్ తీసి తాగాడు.


ఆ తర్వాత ఫోన్ దగ్గరకు వెళ్లాడు. ఎడమచేత్తో రిసీవర్ తీశాడు.

"హలో! సింధూర్ స్పీకింగ్".

"సింధూ! నువ్వు ఒకసారి ఇక్కడకు రావాలి".

అవతలనుండి ఒక కంఠస్వరం మృదువుగా వినబడింది.

"ఇప్పుడే రమ్మంటారా మాస్టారూ?" అడిగాడు సింధూర్. అది అతని బాక్సింగ్ గురువైన నంబియార్ కంఠస్వరం. నిద్రలోవున్నా ఆ గొంతును



గుర్తుపడతాడు.

"కాసేపు ప్రాక్టీస్ చెయ్యి. ఆ తర్వాత మన మీటింగ్ప్లేస్‌కి వచ్చేయ్. ఇద్దరం కలిసి వెడదాం. ఈరోజు ఫైట్‌లో నువ్వుతప్పక గెలవాలి. బెస్టాఫ్ లక్ మై బాయ్."

"థాంక్స్ మాస్టర్. ఐ నీడిట్" చెప్పి రిసీవర్ హుక్‌పైనుంచాడు సింధూర్.

గోడకున్న వాల్‌క్లాక్ మూడుగంటలు చూపిస్తోంది. బాల్కనీలోనుండి బయటకు చూశాడు. ఇంకా చీకటితెరలు వదలలేదు. నగరం మొత్తం సుషుప్తావస్థలోవుంది. అతడు బసచేసిన హోటల్‌కూడా నిద్రలోనే వుంది. అతడికి తన కల గుర్తుకు వచ్చింది. ఆ వికృతాకారం, తోడేళ్ల జ్ఞాపకం రాగానే అతని శరీరం జలదరించింది.

కలలు భవిష్యత్తును తెలుపుతాయంటారు. తను ప్రమాదంలోకి అడుగుపెట్టబోతున్నాడా? నవ్వుకున్నాడు సింధూర్. తను బాక్సర్. బాక్సింగ్ రింగ్‌లో దిగిన ప్రతీసారీ దాదాపు మృత్యువునోటిలోనికి వెళ్లినట్లే. ఇంక వేరే ప్రమాదాలేమిటి?

ముందు గదిలోనికి నడిచాడు సింధూర్. అక్కడ రకరకాల ఎక్సర్‌సైజ్ పరికరాలున్నాయి. చేతులకు గ్లౌజెస్ తొడుక్కున్నాడు సింధూర్. బాక్సింగ్ కిట్‌పై పంచస్ రిలీజ్ చెయ్యసాగాడు. ఈ రోజు జంషేర్‌ఖాన్‌తో పోటీ వుంది. ఇండియాలో బాక్సింగ్‌లో తిరుగులేని వీరుడిగా చెప్పబడేది విల్లీఫోర్డ్. ఆ తర్వాత వస్తాడు ఖాన్.

ఖాన్‌ని గెలవడం మాటలు కాదు. అందుకే నిరంతరం శ్రమ చేస్తున్నాడు సింధూర్. అతని ఆశయం ఒక్కటే. బాక్సింగ్ ప్రపంచంలో మేటివీరుడిగా కీర్తించబడాలి.

* * *

నిశీధి తిరుగులేని నియంతలా ప్రపంచాన్ని ఆక్రమించుకుంది. ఆ చీకట్లోనే తడుముకుంటూ ఆ పాతదేవాలయాన్ని సమీపించారు కోటిలింగం, సదాశివం. ఎప్పటిదో పురాతన దేవాలయమది. ప్రధానద్వారం వైపు వెళ్లలేదు వాళ్లు. ఆ తలుపులు తాళాలు వేసి ఉంటాయని, ఆ పెద్ద పెద్ద తాళాలు బద్దలు గొట్టాలంటే డైనమేట్లు కావాలని బాగా తెలుసు. అందుకే వెనుక వైపు వెళ్లారు. ప్రహరీగోడ దగ్గరకు నడిచి చుట్టూ చూశారు. చిమ్మచీకటిగా వుంది.

ఆ ఇద్దరిలో సదాశివం భారీ మనిషి. కోటిలింగం పిట్టమనిషి. అందువల్ల సదాశివానికి ఇటువంటి గోడలు ఎక్కడం చాలా కష్టం. కోటిలింగం తేలికగా ఎక్కగలడు. గోడకు ఆనుకొని రెండుచేతులు కలిపి పట్టుకున్నాడు కోటిలింగం. ఒక కాలు ఆ చేతులలో వేసి పైకెగిరి ప్రహరీగోడ అంచు పట్టుకున్నాడు సదాశివం. చేతులపై బరువుమోపి మిగిలిన శరీరాన్ని పైకి లాక్కున్నాడు.

కోటిలింగం గోడనెర్రల్లో వేళ్లుంచి చాలా తేలికగా పైకి చేరిపోయాడు. కాస్సేపు ఆ గోడపైనే చీకట్లో భూతాల్లా కూర్చున్నారు. సరిగ్గా అదేసమయంలో ఆకాశంలో ఒక మెరుపు తళుక్కున మెరిసింది. ఆ వెనుకే భూనభోంతరాళాలు దద్దరిల్లేలా శబ్దం చేస్తూ ఎక్కడో పిడుగుపడింది. అంతే! అక్కడితో సహనం కోల్పోయినట్లు ఆకాశం వర్షించడం మొదలుపెట్టింది. తల నరకబడ్డ మొండెం నుండి ధారగా పడుతున్న రక్తంలా కురుస్తోంది వర్షం.

ఆ వర్షంలో తడుస్తూ జాగ్రత్తగా అవతలివైపు దూకేశారు. సదాశివం కుడివైపు కదిలాడు. కోటిలింగం ఎడమవైపు వెళ్లాడు. ఆ గుడికి ప్రత్యేకంగా ఒక కాపలాదారు ఉన్నాడు. వర్షం పడుతున్నందువల్ల ప్రధాన దేవాలయం అరుగుమీద కూర్చున్నాడు. సరిగ్గా వాడి తలపైన ఒక ఎలక్ట్రిక్‌దీపం ఉంది. అది తప్ప మిగిలిన దేవాలయమంతా చీకటిలోనే ఉంది. ఆ కాపలాదారు కూడా సగం నిద్ర సగం మెలకువలో ఉన్నాడు. సంవత్సరాలుగా చేస్తున్న వృత్తి అతనిలో యాంత్రికత్వాన్ని పెంచింది.

తన జేబులో నుండి చిన్న స్ప్రేబాటిల్ తీశాడు సదాశివం. దాన్ని జేబురుమాలుపై నొక్కాడు. నొక్కేముందే ఊపిరి బిగబట్టాడు. చీకటిలో వేగంగా కదిలాడు. ఆ కాపలాదారు అలికిడికి వెనుదిరిగే లోపలే అతని ముఖంపై జేబురుమాలు గట్టిగా నొక్కాడు. సరిగ్గా రెండు నిముషాలు గింజు కున్నాడు. ఆ తర్వాత శవంగా మారిపోయాడు. వెంటనే జేబురుమాలు వదిలి వేసి ఆ శవానికి దూరంగా వచ్చేశాడు సదాశివం.

రెండు నిముషాలాగి ఆ శవం దగ్గరకి వెళ్లాడు సదాశివం. అతని దుస్తుల్లోని తాళాలగుత్తిని బయటకు లాగాడు. అది తీసుకుని రెండోవైపుకు వెళ్లాడు.

ఆ దేవాలయంలో ప్రధానమైన గుడి శివుడిది. ఆ గుడికాక దాని పక్కనే ఒక చిన్నగుడి వుంది. ఆ గుడి ముందు నిలబడి వున్నాడు కోటిలింగం. తన దగ్గర వున్న తాళాలతో ఆ గుడితలుపులు తెరిచి లోపలకు ప్రవేశించాడు సదాశివం. అతన్ని అనుసరించాడు కోటిలింగం.

లోపలకు అడుగుపెట్టగానే ఏదో గమ్మత్తైన వాసన వారి ముక్కుపుటాలకు సోకింది.


లోపల ఎనిమిది విగ్రహాలు వరుసగా ఉన్నాయి. అవి రాతివిగ్రహాలు. దేశంలో ఎక్కడా లేని విచిత్రమైన విగ్రహాలు అష్టదిక్పాలకుల విగ్రహాలు ఆ విగ్రహాలలో ఒక మూలగా తన విశిష్టత చాటుతూవుందో విగ్రహం.

ఒక ఆజానుబాహుడు దున్నపోతుపై కూర్చుని వున్నాడు. ఒక చేతిలో పాశం, మరొక చేతిలో దండం పట్టుకొని వున్నాడు. అతడే యముడు.

సకల చరాచర ప్రపంచంలోనూ జరామరణాలు ఎవరి ఇష్టప్రకారం జరుగుతాయో, ఎవరికి భయపడి మనిషి పాపం చేయడానికి జడుస్తాడో, ఎవరి నీడ సైతం తనపై పడకూడదని ముక్కోటి దేవతలను ప్రార్థిస్తాడో ఆ యముడి విగ్రహమది.

ఏ దేవునికైనా సాంబ్రాణిపొగ వేస్తారు. అగరొత్తులు వెలిగిస్తారు. కాని ఈ కాలయముడికి గంజాయి పొగవేస్తారు. అంతేకాదు. ఆ గుడి వెనుకే స్మశానం వుంది. అక్కడ శవాలను కాలిస్తే ఆ పొగసరిగ్గా ఇక్కడికే వస్తుంది. ఏ రోజైనా శవం కాలకపోతే పూజారి తన తలవెంట్రుకలు తీసి కాలుస్తాడు. ఆ విగ్రహాన్ని ఒక్కసారి తృప్తిగా చూసాడు సదాశివం. కోటిలింగం దగ్గర వున్న లెదర్‌బ్యాగ్ తీసుకున్నాడు. దానిలో నుండి ఒక రింగ్‌వంటి సాధనాన్ని తీసి ఆ విగ్రహం పాదాల కిందగా అమర్చాడు.

తన దగ్గరవున్న నలుచదరపు పెట్టె పైని మీటలు గబగబా నొక్కసాగాడు. అది ఒక ఎలక్ట్రిక్ కట్టర్. యముడి విగ్రహం పాదాలక్రింద ఉన్న పీఠం నిముషాల మీద కత్తిరించేశాడు. వెంటనే ఆ విగ్రహాన్ని చేతుల లోనికి తీసుకొని లెదర్‌బ్యాగ్‌లో




ఉల్లి చేసిన మేలు తల్లికూడా చేయదని సామెత. వెల్లుల్లిని వైద్యవిషయాల్లో శతాబ్దాల తరబడి మనం తల్లిలాగే ఆరాధిస్తున్నాం. అయితే వెల్లుల్లి పొడి ఏవిధంగానూ రక్తంలో 'కొలెస్టరాల్'ను తగ్గించజాలదని పరిశోధనల్లో తేలిపోయిందంటున్నారు! రక్తపోటులో స్థాయి భేదాలపైన కూడా దీనిప్రభావం ఏమీ లేదట!!

పెట్టేశాడు సదాశివం.

ఆ తర్వాత ఆ దేవాలయంనుండి నిముషాలపైన బయటకు వచ్చేశారు. బయట ప్రకృతి చాలా భీభత్సంగా వుంది.

ఆ దేవాలయానికి కాస్త దూరంలో ఆపివున్న కారు వైపు నడిచారు. వాళ్లిద్దరికి చాలా ఆనందంగా వుంది. మామూలుగా ప్రాచీన శిల్పసంపదకు విలువ ఎక్కువ. అందులోనూ చాలా అరుదైన ఇటువంటి విగ్రహాలు కోట్ల ఖరీదు చేస్తాయి.

ఈ విగ్రహాల స్మగ్లింగ్‌లో కోటిలింగానిది అందెవేసినచెయ్యి. దాదాపు నెలరోజుల క్రితం ఒక అమెరికన్‌నుండి ఈ విగ్రహం కొరకు కబురు వచ్చింది.

ఆ దేవాలయానికి వున్న ప్రొటెక్షన్, ఫాలోయింగ్ (ఫాలోయింగ్ అంటే ఆ దేవాలయంపై ప్రజల గురి. తండోపతండాలుగా ప్రజలు వచ్చే తిరుపతి, శ్రీశైలం, శబరిమలై వంటి చోట్ల ఈ దొంగతనాలు జరగవు. అటువంటి చోట్ల ఈ దొంగతనాలు చేసినా అతిత్వరగా పట్టుబడటం ఖాయం) ఆ దేవాలయానికి ఏ మంత్రివర్యుడైనా నిరంతరం వస్తున్నాడా? మొదలైనవి చూసుకొని ఆ బేరం సెటిల్ చేశాడు కోటిలింగం.

తనకు సహాయంగా సదాశివాన్ని తీసుకున్నాడు. సదాశివం డబ్బుకోసం ఏ పనైనా చేస్తాడు. ఇక విగ్రహం చేతులు మారడమే తరువాయి.

ముందు నడుస్తున్న సదాశివం హఠాత్తుగా ఆగిపోయాడు. అతడివి పాము చెవులు. నేలపై పడుకుండిపోయి కోటిలింగానికి సైగ చేశాడు. అప్పటికే కోటిలింగంకూడా నేలపైన పడిపోయాడు. చీకట్లో కళ్లు చికిలించుకుని ముందుకు చూశారు.

కాస్త దూరంలో చెట్లచాటున వున్నారు కొంతమంది ధృఢకాయులు. వాళ్లలో మర్రిచెట్టులా గుండ్రంగా, పొట్టిగా ఉన్న వ్యక్తి దీక్షగా గుడివైపు చూస్తున్నాడు.

విక్రమ్! మైగాడ్ విక్రమ్" గొణిగాడు కోటిలింగం వాడి కన్ను కూడా ఈ విగ్రహంపై పడిందన్నమాట. వీడి చేతుల్లో ఈ విగ్రహం పడకూడదు. ఈ బ్యాగ్ తీసుకొని నీవు పారిపో. నేను వేరే వైపు వెళ్తాను. తర్వాత కలుద్దాం." గబగబా చెప్పాడు సదాశివం. తలవూపాడు కోటిలింగం. మోచేతులపై వెనుదిరిగి ముందుకు వెళ్లబోయాడు. ఆఖరిక్షణంలో కాలర్ పట్టుకున్నాడు సదాశివం. ప్రపంచంలోని కిరాతకత్వాన్నంతా మొహంలోనికి తెచ్చుకొని చెప్పాడు. జాగ్రత్త కోటిలింగం! నన్ను మోసం చెయ్యాలని చూడకు. నా సంగతి తెల్సుగా వెళ్లు.'

కోటిలింగం కనుమరుగు కాగానే లేచి నిలబడ్డాడు సదాశివం. తన చొక్కా లోపలి జేబు నుండి ఒక హేండ్‌గ్రెనేడ్ తీశాడు. కొద్దిదూరంలో నిలబడ్డ విక్రమ్‌దాదా అనుచరులు రాబందుల్లా ముందుకు రాబోయారు. తన చేతిలో గ్రెనేడ్‌ప్యూజ్ నోటితో లాగి ముందుకు విసిరాడు సదాశివం.

విక్రమ్ తన తల రెండు చేతులలో దాచుకుంటూ పక్కకు దూకాడు. అతని అనుచరులు నలుగురూ ముక్కలుముక్కలుగా మారి గాల్లో కెగిరారు.

నిముషాలపైన తన కారు డ్రైవింగ్‌సీట్ లోనికి చేరిపోయి కారు రివర్స్ చేసి ముందుకు పోనిచ్చాడు సదాశివం.

నేలపై పడిపోయిన విక్రమ్ లేచి వచ్చేసరికి కారు వెనకలైట్లు కూడా కనబడలేదు.

పళ్లు కొరుకుతూ కసిగా నేలను కాలితో తన్నాడు విక్రమ్‌దాదా.

* * *

"అతడు గొప్ప బాక్సర్ అన్న విషయాన్ని నీ మనసుల్లోంచి తుడిచేయ్. అతడు ఎంత గొప్పవాడైనా నీ ముందు నిలువలేడు. యు విల్ డెఫినెట్లీ విన్" చెప్పాడు నంబియార్.

తలవూపాడు సింధూర్. అతని పిడికిలిచుట్టూ పొడవాటి తెల్లటి బట్టను చుడుతున్నాడు నంబియార్.

బాక్సర్లు చేతికి అలా బట్టచుట్టుకొని దానిమీద రబ్బరు తొడుగును వేసుకుంటారు. ఈ రబ్బరు తొడుగును గ్లౌస్ అంటారు. గ్లౌస్ చేతి మణికట్టువరకే వుంటుంది. గ్లౌస్ తొడుక్కున్న చేతులతో బాక్సర్లు ప్రత్యర్థులపై ముష్టిఘాతాలు చేస్తారు.


గ్లౌస్ తొడుక్కున్న తర్వాత తన చేతుల్ని గాల్లో విసిరి చూసుకున్నాడు సింధూర్. ఆ తర్వాత డ్రెస్సింగ్‌రూం నుండి పోటీ జరిగే వైపు నడిచాడు. అతన్ని వెన్నంటే నంబియార్ ఉన్నాడు. బయటకు వచ్చి ఒక్కక్షణం నిలబడి చుట్టూ చూశాడు సింధూర్. చుట్టూ వరుసలుగా కొన్ని వేలమంది కూర్చుని ఉన్నారు.

మధ్యలో కాస్త ఎత్తైన ప్రదేశంలో వుంది ఎరీనా. అది సుమారు ఇరవై అడుగుల వెడల్పుతో చతురస్రాకారంగా వుంది. దాని చుట్టూ నాలుగువైపులా తాళ్లు కట్టి వున్నాయి. బరిమీద మెత్తటి రబ్బరును పరిచారు. బరికి రెండుమూలల్లో రంగు జెండాలున్నాయి. ఒకవైపు మూల ఎరుపురంగు మరో మూల నీలంరంగు జెండాలు వున్నాయి. ఎరుపురంగు జెండా వున్న వైపు నడిచాడు సింధూర్. అది అక్కడ నియమం.

ఎరుపురంగు నిక్కరు వేసుకున్న బాక్సర్ అదే రంగు వున్న కొననుండి బరిలోనికి రావాలి. అదే విధంగా రెండో బాక్సర్ కూడా. సింధూర్ ఎప్పుడు ఎరుపురంగును లైక్ చేస్తాడు. రెడ్ ఫర్ డేంజర్. అవతలికొననుండి ఖాన్ లోపలకు వచ్చాడు. ఇద్దరూ ఎదురు బదురుగా నిల్చున్నారు.

రిఫరీ ఇద్దరి గ్లౌస్ తడిమి చూశాడు. ఆ తర్వాత మామూలుగానే కొన్ని నిబంధనలను చెప్పసాగాడు. బాక్సర్లు ప్రత్యర్థుల ముఖాలమీద, దవడల మీద, నడుంపైగాని పంచస్ విసరాలి. వెనుకభాగంలోనూ, మూత్రపిండాలుండే నడుము భాగంలోనూ కొట్టరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటిని ఉల్లంఘించకూడదు. రిఫరీ చెప్పడం పూర్తి కాగానే బాక్సర్లిద్దరూ పొజిషన్ లోనికి వచ్చి నిలబడ్డారు. రిఫరీ సిగ్నల్ ఇచ్చాడు. మెరుపులా కదిలాడు సింధూర్. కదులుతూనే అతని కుడి చెయ్యి ఖాన్ ఎడమదవడను తాకింది. ఫస్ట్ హిట్.

బాక్సింగ్‌లో దీనికి చాలా ఇంపార్టెన్స్ వుంది. పోటీ ప్రారంభంలోనే ప్రత్యర్థిని దెబ్బతీయ డం అతని మానోస్థైర్యాన్ని దెబ్బ తీస్తుంది. దవడ ఎముక విరిగినట్లయ్యింది ఖాన్‌కు. ఒక్కడుగు వెనక్కు వేశాడు. మరుక్షణం తేరుకొని మీదకు వస్తున్న సింధూర్ నడుంపై భాగం వైపు పిడికిలి విసిరాడు. ఆ దెబ్బ తగులుతూనే గమనించాడు సింధూర్. ఖాన్ కుడిచెయ్యి కంటే ఎడమచెయ్యి ఎటాకింగ్‌లో పెట్టుకొని, కుడిచెయ్యి డిఫెన్స్‌కు వాడుకుంటున్నాడు.



జాగ్రత్తగా ఉండకపోతే గట్టిదెబ్బ తగిలే అవకాశం ఉంది. "ఫట్" మని ఒక అప్పర్‌పంచ్ కట్ చేశాడు ఖాన్. చాలా సింపుల్‌గా ఒక్కడుగు వెనక్కు జరిగి భుజం అడ్డుపెట్టాడు సింధూర్. ఖాన్ చెయ్యి మరోసారి కదిలేలోగానే సింధూర్ అటాక్ చేసాడు. మొత్తం బలమంతా ఉపయోగించి ఖాన్ ముఖంపైన కొట్టాడు. హేమర్‌షాట్.

అంతే! రివ్వున వెళ్లి ఎరీనా చుట్టూ కట్టిన రోప్స్‌కు తగిలి మళ్లీ ముందుకువచ్చాడు ఖాన్. వస్తుండగానే అతనికి ఎదురువచ్చింది ఒక మిడిల్‌పంచ్. ఆ దెబ్బకు విరుచుకుపడిపోయాడు ఖాన్. రిఫరీ అంకెలు లెక్కించడం మొదలుపెట్టాడు. ఎనిమిది పూర్తయ్యేలోగా ఖాన్ లేచి పోరాడాలి లేదా ఓడిపోయినట్లే. చుట్టూ జనం హాహాకారాలు మొదలుపెట్టారు. కొందరు విజిల్స్ వేశారు. ఆ గోల నుండే వినబడుతుంది "సింధూర్! కీపిటప్!" ఎవరో అరుస్తున్నారు.

తల విదిలించాడు సింధూర్. కాలి మునివేళ్లమీద ముందుకు వెనక్కు కదులుతున్నాడు. ఆకలిగొన్న చిరుతపులి తన ఆహారంవైపు తీక్షణంగా చూస్తున్నట్లు చూడసాగాడు. మెల్లిగా లేచాడు ఖాన్. అతడు పొజిషన్ కొచ్చే లోగానే గంట మోగింది.

మొదటి రౌండు ముగిసింది. ప్రతీ రౌండుకి మధ్య నిముషంసేపు విశ్రాంతి వుంటుంది. తన ప్లేస్‌కి వచ్చి కూర్చున్నాడు సింధూర్. నంబియార్ అతని నోట్లోని పరికరాన్ని బయటకు తీశాడు. దాన్ని 'మౌత్‌పీస్' అంటారు. పళ్లు కదిలిపోకుండా పెట్టుకుంటారది.

గ్లూకోజ్ వాటర్ నోట్లో వేసుకుని పుక్కిలించి ఊశాడు. "సింధూ! ఫాస్టర్. ఇంకా స్పీడ్‌గా పంచ్ చెయ్యి. ఏ మాత్రం అవకాశం ఇవ్వొద్దు" నంబియార్ చెబుతున్నాడు. తల ఊపాడు సింధూర్.

"హుక్‌షాట్స్ అప్లయ్‌చెయ్యి. నువ్వు కొట్టే రైట్ హుక్‌షాట్ ఖచ్చితంగా అతన్ని ఇబ్బంది పెడుతుంది. ఎక్కువగా రైట్‌సైడ్ ఎటాక్ చెయ్యి. ఖాన్ ఎడమచేతికి పని దొరికిందా? ఇంక అతన్ని ఆపడం కష్టం. అఫ్‌కోర్స్. నీ ముందు తట్టుకోలేడులే."

ఉత్తమ కోచ్‌లక్షణమది. తన శిష్యుడి ఆత్మస్థైర్యాన్ని పెంచుతూ ప్రత్యర్థి లోపాలు చెప్పడం. నంబియార్ ఒకప్పుడు మంచి బాక్సర్. ఆ రోజుల్లో అతనికి ఒక కోరిక ఉండేది. అది వరల్డ్ హెవీవెయిట్ బాక్సింగ్ ఛాంపియన్ కావడం. అది తీరలేదు.

తన శిష్యుడైన సింధూర్‌ను ఆ స్థానానికి చేర్చడం ద్వారా ఆ కోరిక తీర్చుకుందామని ప్రయత్నిస్తున్నాడు. ఖాన్‌ను జయిస్తే నేషనల్ ఛాంపియన్‌షిప్ దరిదాపుల్లోకి వచ్చినట్లే. ఆ తర్వాత విల్లీఫోర్డ్‌తో పోటీ.

అతన్ని కూడా ఓడిస్తే అంతర్జాతీయ బాక్సింగ్ ప్రపంచంలోనికి అడుగు పెట్టినట్లే. నంబియార్ ఆలోచనలు భగ్నంచేస్తూ గంట మోగింది. సింధూర్ భుజం తట్టి బరి బయటకు వెళ్లాడు. రెండోరౌండుకు సిద్ధమయ్యారు బాక్సర్లిద్దరూ.

ఈసారి ముందు ఖాన్ కదిలాడు. సింధూర్ కడుపులో వరుసగా రెండు మిడిల్ పంచస్ అప్లయ్ చేశాడు. వెనక్కు జరిగాడు సింధూర్. వదల్లేదు ఖాన్. సింధూర్ ఊపిరిపీల్చుకోలేనంతగా ముష్టిఘాతాలు విసురుతున్నాడు.

సడన్‌గా సింధూర్ మెడపై చెయ్యివేసి నొక్కాడు ఖాన్. అతని పట్టునుండి విడిపించుకోవడానికి గింజుకుంటున్నాడు సింధూర్. ప్రత్యర్థిని అలా కదలకుండా గట్టిగా పట్టుకోకూడదు. తలతో ఢీ కొనడంగాని, భుజాలతో తొయ్యడం కాళ్లతో తన్నడం ఇవన్నీ ఫాల్ట్ కింద వస్తాయి. అటువంటి సమయంలో రిఫరీ మూడుసార్లు హెచ్చరిస్తాడు. వినకపోతే పోటీనుండి బహిష్కరిస్తాడు.

రిఫరీ ఖాన్ పట్టునుండి సింధూర్‌ను విడిపించాడు. తిరిగి రిఫరీ సిగ్నల్ ఇవ్వగానే ఫైట్ మొదలైంది. సింధూర్‌లో క్రోధం పడగవిప్పి బుసకొట్టింది. అతనిలోని రియల్‌బాక్సర్ పిడికిళ్లు బిగించి లేచాడు. ఈసారి ఖాన్‌కు అవకాశం దొరకలేదు.

రివ్వున దూసుకువస్తున్న ఖాన్ పిడికిలి నుండి ఇన్‌స్టింక్టివ్‌గా తలపక్కకు వంచి తప్పుకున్నాడు సింధూర్. ఎడమచేతితో ఖాన్ కుడిబుగ్గపై హుక్ చేశాడు. వెనక్కు తూలాడు ఖాన్. అంతటితో ఆగలేదు సింధూర్. ఫిరంగిగుండులా ముందుకు దూకాడు.

లెఫ్ట్ వెంట రైట్, రైట్ వెంబడి లెఫ్ట్ హుక్స్‌తో ఖాన్ ముఖం పచ్చడి అయిపోయింది. క్షణాలలో నల్లగా కమిలిపోయింది. ముక్కుదూలం విరిగిపోయి రక్తం ధారగా కారుతోంది. అయినా నిలదొక్కుకుందామని చూస్తూన్నాడు. తిరిగి ఎటాక్ చేద్దామని ప్రయత్నిస్తున్నాడు.

అయితే ఆ అవకాశం అతనికి లభించడం లేదు. క్షణక్షణానికి అతనిలో శక్తి తగ్గిపోతున్నట్లు అతనికే తెలుస్తోంది. చుట్టూ ఉన్న జనంలో ఆవేశం పెరిగిపోతోంది.

"కొట్టు.....తిరిగి లేవకుండా కొట్టు" అంటూ పిచ్చిగా అరుస్తున్నారు. వాళ్ల నరాల్లో రక్తం వేగంగా ప్రవహిస్తుంది. బాక్సింగ్‌క్రీడలో ఉన్న ప్రత్యేకత అది. పోరాడే వాళ్లకంటే చుట్టూ వుండి చూసే వాళ్లలో రక్తపోటు అధికమవుతుంది. నరాలు చిట్లిపోతాయా అన్నంత ఉత్కంఠ ఏర్పడుతుంది.

నిస్సత్తువగా నేలకు జారిపోయాడు ఖాన్. రిఫరీ కంగారుగా ముందుకు వచ్చాడు. ఎడంచేత్తో సింధూర్‌ను వెనక్కు గెంటి ఖాన్ ముందు మోకాళ్లపై కూర్చుని అంకెలు లెక్కపెట్టసాగాడు.

"ఒకటి...... రెండు......మూడు...... నాలుగు...."

మూసుకుపోతున్న కనురెప్పలను బలవంతాన తెరిచాడు ఖాన్.

"ఐదు....ఆరు....."


మెల్లిగా లేచాడు ఖాన్. అతని కుడికన్ను నల్లగా కమిలిపోయి నిమ్మకాయ సైజుకు వాచి పోయింది. ముక్కునుండి చెంపలనుండి రక్తం కారుతోంది.

ఆఖరి ప్రయత్నంగా పిడికిలి లోనికి శక్తినంతా తెచ్చుకొని సింధూర్‌పై దాడి చేశాడు. వెనక్కు జరగలేదు సింధూర్. కనీసం అతడు కొట్టే దెబ్బ నుండి తప్పించుకుందామనైనా ప్రయత్నించలేదు. పెద్దపులి ఎరపైకి దూకే ఆఖరి క్షణంలో అరచినట్లు భీతావహంగా అరిచాడు. విపరీతమైన వేగంతో కింద నుండి పైకి ఒక అప్పర్‌పంచ్ డెలివర్ చేశాడు.

దెబ్బ వెంబడే గాలిలోనికి లేచింది ఖాన్ శరీరం. పదడుగుల తర్వాత నేలపై డక్ అయ్యింది. రిఫరీ అంకెలు లెక్కపెట్టసాగాడు. అచేతనంగా పడి వున్న ఖాన్ శరీరాన్ని చూస్తూ అలాగే నిలబడ్డాడు సింధూర్. కదలిక లేకుండా ఖాన్ పడి వున్న తీరు బట్టే తెలుస్తుంది అతను ఇప్పట్లో లేవడని.

ఏ బాక్సరన్నా నిర్ణీత రౌండు ముగిసేలోగా స్పృహతప్పి పడిపోయినా, తీవ్రంగా గాయపడ్డా అతని ప్రత్యర్థి గెలిచినట్లు రిఫరీ ప్రకటిస్తాడు.

బాక్సర్ పోటీనుండి తప్పుకుంటే రిటైర్డ్ అంటారు. స్పృహ తప్పిపడిపోతే నాక్డ్




## సీతాఫలాలు

అడవులలో పండే సీతాఫలాలు ఎంతో తియ్యగా, రుచిగా ఉంటాయి. ఎవరూ విత్తనం, నీరు, ఎరువు వేయకుండా సహజమైన ప్రకృతి వాతావరణంలో సీతాఫలాలు పెరుగుతాయి. వీటిలో 'సి' విటమిన్ ఉండటంవలన రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇప్పుడు పట్టణాలలో సీతాఫలాల ధరకూడా ఆపిల్‌తో సమానంగా పలుకుతుంది. **'Custard a day keeps the doctor away'** అనేదానికి బహుశా ఇదే కారణమేమో!

**- కృష్ణాజీ**

అవుట్ అంటారు. రెండు నిముషాల తర్వాత రిఫరీ వచ్చి సింధూర్ చెయ్యి పైకెత్తాడు.

దూకే జలపాతపు హోరులా జనం చప్పట్లమోత వినిపించింది. సింధూర్ దగ్గరకు పరుగున వచ్చిన నంబియార్ అతన్ని పట్టుకుని జనాన్ని తప్పుకుంటూ డ్రస్సింగ్‌రూం వైపు తీసుకు వెళ్లాడు.

"యూ ఆర్ గ్రేట్  సింధూర్! యు ఆర్ గ్రేట్"

అతని చెంపలపై రక్తాన్ని టవల్‌తో అద్దుతూ మెచ్చుకున్నాడు నంబియార్.

"కంగ్రాట్యులేషన్స్" వెనుక నుండి వినబడింది.

గిర్రున వెను తిరిగి చూశాడు సింధూర్. అక్కడ ద్వారానికి అడ్డంగా ఒక దృఢకాయుడు నిలబడి ఉన్నాడు.

తెల్లటి దేహచ్ఛాయ, కండలు తిరిగిన శరీరం, రింగులు తిరిగిన ఎరుపురంగు జుట్టు, తేనెరంగు కళ్లు అతను ఆంగ్లోఇండియన్ అని చెప్పక చెబుతున్నాయి.

"విల్లీఫోర్డ్" గొణిగాడు నంబియార్.

ద్వారంలోఉన్న విల్లీఫోర్డ్ గిర్రున వెనుతిరిగి వెళ్లిపోయాడు.

కొద్దిరోజుల్లో విల్లీఫోర్డ్‌తో ఫైట్ చెయ్యవలసి వస్తుందని సింధూర్‌కు తెలుసు. అతనింకా విల్లీఫోర్డ్ నిల్చున్న ద్వారం వైపే చూస్తున్నాడు. ఎందుకో అక్కడ మృత్యుదేవత నిల్చున్న భావన కలగసాగింది.

ఎరీనాలో గొరిల్లాలా మీదకు దూకే విల్లీఫోర్డ్‌తో తలపడటం మృత్యువుని ఎదిరించడమే.

* * *

"నువ్వు కావాలని కోరుకున్నది నీచేతికి అందకపోవచ్చు. అందదేమోనని ఆశవదలుకున్నది నిన్ను వెతుక్కుంటూ రావచ్చు. జయం అయినా అపజయం అయినా నీ జీవితంలోకి తొంగి చూసినపుడు నిబ్బరంగా ధాన్ని ఆహ్వానిం చడమే మంచిది."

ఊపిరి పీల్చుకోవడానికన్నట్లు ఒక్కక్షణం ఆగింది బామ్మ. తలపట్టుకుని కూర్చుంది సంయుక్త. అప్పటికి గంట నుంచి వాయించేస్తోంది బామ్మ.

ఆరోజు ఒక ప్రైవేట్‌కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఉంది. పొద్దుటే లేచి తయారయ్యింది సంయుక్త. కాస్సేపు ఏదైనా చదువుకుందామని కూర్చుంది. ఉద్యోగం దొరకనందుకు తన మనవరాలు అలా దిగులుగా కూర్చుందేమోనని బామ్మ భ్రమపడటంతో సంయుక్తకు కష్టాలు మొదలయ్యాయి.

"బామ్మా! ఇంటర్వ్యూకు టైం అయిపోతుందే!"

ఏడుపు గొంతుతో చెప్పింది సంయుక్త.

"కాబట్టి ఉద్యోగం వచ్చినా రాకపోయినా బెంగపడకు. నీకు ఎప్పటికైనా మంచి ఉద్యోగం వస్తుంది." తన సుదీర్ఘోపన్యాసాన్ని అంతటితో ఆపింది బామ్మ.

బుద్ధిగా తల ఊపింది సంయుక్త.  చేతిలో ఫైలు ఒకసారి సరిచూసుకుని తుర్రున బయటకు పారిపోయింది.

సంయుక్తకు నిజంగానే ఆ ఉద్యోగం వస్తుందని నమ్మకం లేదు. డిగ్రీ అయిన తర్వాత ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్లకపోయినా, ఇంటర్వ్యూ పద్ధతి బాగా తెలిసింది. కనుక ఆ ఉద్యోగంపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు.

సంయుక్త తల్లి చనిపోయిన తర్వాత ఆమె తండ్రి విరక్తితో దేశాలు పట్టిపోయాడు. ఆ పసికందును తల్లీ తండ్రీ తానే అయ్యి పెంచింది బామ్మ.

సంయుక్త కూడా తన జీవితంలో అమ్మానాన్నలను అడిగిన క్షణాలు చాలా తక్కువ. ఆమె సర్వస్వం బామ్మే. బామ్మ దగ్గర చిన్నపిల్లలా గారం చేస్తుంది. తల్లికి చెప్పినట్లు తన కష్టసుఖాలు చెప్తుంది. తండ్రి దగ్గరలా భక్తిగా, భయంగా ఉంటుంది. ఒక స్నేహితురాలిలా వేళాకోళం చేస్తుంది.

ఉన్న ఇల్లు అమ్మి సంయుక్త పెళ్లి చేసేయాలని బామ్మ ఆశ. ఎలాగైనా ఉద్యోగం సంపాదించి తన కాళ్లపై తాను నిలబడాలని సంయుక్త ఆకాంక్ష. సిటీ బస్సుల సంగతి బాగా తెల్సు కాబట్టి గంట ముందు బయల్దేరి బస్టాప్ చేరుకుంది.

అక్కడ ఉన్న చిన్న సిమ్మెంటు బెంచి పైన కూర్చుంది. కూర్చున్న తర్వాత ఏం చెయ్యాలో తోచలేదు.  కాస్సేపు సర్టిఫికెట్స్ చూసుకుంది.  కాస్సేపు గోడలకు అంటించిన సినిమా పోస్టర్లు చూసింది. ఇంకాస్సేపు దిక్కులు చూస్తూ కూర్చుంది.

అదే రోడ్డుపై కొంచెం దూరంగా చెత్తకుండీ వెనుక దాక్కున్న కోటిలింగం కళ్లు ఈ అమ్మాయిపై పడ్డాయి. అతడు ఆ ప్రదేశంనుండి బయటకు వచ్చిన మరుక్షణం శత్రువులు పిచ్చికుక్కను చంపినట్లు చంపుతారు.

అయితే అటువంటి పరిస్థితులు అతని జీవితంలో కోకొల్లలు. అందుకే అతడు తన ప్రాణాలకు భయపడటంలేదు.

తన దగ్గర ఉన్న రహస్యం చేజారిపోతుందేమోనని భయపడుతున్నాడు. చివరకు తెగించి నిల్చున్నాడు కోటిలింగం. గబగబా సంయుక్త వైపు నడిచాడు.

సూటిగా తనవైపు వస్తున్న ఆ రఫ్‌క్యారెక్టర్‌ని భయంగా చూసింది సంయుక్త.

"ఏం పాపా? బావున్నావా?" అడిగాడు కోటిలింగం.

తలవూపింది సంయుక్త. భయంతో పిడచగట్టుకుపోయిన ఆమె పెదవులు మాట్లాడటానికి సహకరించడంలేదు.

"నేను మీ నాన్న స్నేహితుడిని"


"మా నాన్నగారి స్నేహితులా? మా అమ్మ పోయాక ఆయన ఏమయ్యారో మాకెవ్వరికీ తెలీదు."

ఆ మాత్రం తీగ చాలు కోటిలింగానికి. డొంకంతా లాగగలడు.

"ఔనమ్మా! భార్యపోయిన వైరాగ్యంతో ఆయన సన్యాసుల్లో కల్సిపోయాడు. ప్రస్తుతం బెనారస్‌లో ఉన్నాడు. నేను ఇటు వస్తున్నానని తెలిసి నీ కోసం ఇక గొలుసు పంపాడు. కాశీలో ఆయనను అందరూ మహత్తుగల స్వామిగా చెప్పుకుంటారు. ఇది మెడలో వేసుకుంటే అంతా మంచి జరుగుతుందని చెప్పమన్నారు."

కోటిలింగం ఇచ్చిన గొలుసు చేతిలోనికి తీసుకుంది సంయుక్త.  ఆ గొలుసు చివర ఒక లాకెట్ ఉంది. దానిపైన ఒక డ్రాగెన్ బొమ్మ ఉంది.

ఒక్క క్షణం తటపటాయించి ఆ గొలుసు మెడలో వేసుకుంది. తృప్తిగా నిట్టూర్చాడు కోటిలింగం. చాలు! ఇక శత్రువుల నుండి తాను తేలికగా తప్పుకోగలడు. ఆ తర్వాత ఈ అమ్మాయిని తేలికగా పట్టుకోగలడు.






రివ్వున దూసుకువచ్చిన సిటీబస్సు సరిగ్గా సంయుక్త ముందు ఆగింది. తలత్రిప్పి కోటిలింగంవైపు చూసింది సంయుక్త.

"వెళ్లిరా తల్లీ! నా పేరు కోటిలింగం. మీ ఇంటికి వచ్చి కలుస్తాను." చెప్పాడు.

వెంటనే బస్సు ఎక్కేసింది సంయుక్త. ఆ కొత్తవ్యక్తి తన తండ్రి స్నేహితుడేనని నమ్మిందామె.

సిటీబస్సు ముందుకు కదిలిన తర్వాత రోడ్డు దాటబోయాడు కోటిలింగం. కల్లోలిత కడలి తరంగంలా దూసుకు వచ్చిందొక జీపు. వెనుక సీటులో నుండి మెరుపులా ముందుకు దూకారు ఇద్దరు వ్యక్తులు. వాళ్లను గమనించి వెనుకకు తప్పుకోబోయాడు కోటిలింగం. ఆ వ్యక్తుల చేతుల్లో తటాలున మెరిశాయి పటకా కత్తులు.

పగబట్టి మీదకు దూకే కరినాగుల్లా కోటిలింగం కంఠంవైపు దూసుకువచ్చాయవి.

* * *

తన ఆఫీసు అద్దాల కిటికీలోనుండి బయటకు చూస్తున్నాడు రతన్‌లాల్. నిజానికి ఆఫీసులో రతన్‌లాల్‌కు పనేమీ ఉండదు. అంతా కింద ఉద్యోగులే చూసుకుంటారు. అయినా బయట పనులేం లేనప్పుడు ఇలా ఆఫీసుకు వచ్చి కూర్చుంటాడు. ఆఫీసులో ప్రత్యేకంగా తన కోసం ఒక గది కట్టించుకున్నాడు రతన్‌లాల్. అక్కడనుండి చూస్తే కింద రోడ్లపై వెళ్లే ఆడవాళ్లు కనబడతారు.

ఇంకా క్లియర్‌గా చూడాలనుకున్నప్పుడు బైనాక్యులర్స్ ఉపయోగిస్తాడు. రతన్‌లాల్‌కు వయస్సయిపోతున్నా కోరికల వేడి తగ్గలేదు. పెదవులపై చెరగని చిరునవ్వుతో అలాగే చూస్తూ కూర్చున్నాడు. ఏదో కొంపలు మునిగిపోతున్నట్లు పరుగులు పెట్టే జనాన్ని చూస్తుంటే చాలా నవ్వుగా ఉంటుందతనికి.

రతన్‌లాల్ పిట్టమనిషి. సన్నగా, పొట్టిగా ఉంటాడు. ఎప్పుడు రిమ్‌లెస్ కళ్లద్దాలు ధరిస్తాడు. కీచుగొంతుతో మాట్లాడుతుంటాడు. సడన్‌గా టేబుల్‌పైన టెలిఫోన్ మోగుతూ రతన్‌లాల్ ఆనందానికి భంగం కలిగించింది. విసుక్కున్నాడు.

ఆ టెలిఫోన్ అతని జీవితాన్ని నిర్దేశిస్తుంది. అతడు ఆనందంగా ఉన్న వేళ ఒక్కసారిగా ఆందోళనలో పడేస్తుంది. కొన్నిసార్లు విపరీతమైన టెన్షన్ సృష్టిస్తుంది.

అతని వృత్తిపరంగా ఆ ఫోన్ చాలా ముఖ్యపాత్ర వహిస్తుంది. అందువల్ల ఫోన్‌మోగినప్పుడల్లా విసుక్కుంటూనే తీస్తాడు.

"నమస్తే సార్! నేను రాజుని మాట్లాడుతున్నాను" అవతలి నుండి వినబడింది.

"ఏమిటి రాజూ?" అడిగాడు రతన్‌లాల్.

రాజు అతను నమ్మినబంటుల్లో ఒకడు.

"సిటీకి కాస్త దూరంగా ఒక శివాలయం ఉంది కదా?"

"అవును"

"ఆ శివాలయంనుండి ఒక విగ్రహాన్ని దొంగతనం చేశారు సార్. కోటిలింగం అనే వాడు సదాశివం అనే మరో క్రిమినల్ సహాయంతో ఈ దొంగతనం చేశాడు."

"ఆ విగ్రహాన్ని ఏం చేశారు?" ఆత్రుతగా అడిగాడు లాల్.

"ఇంకా తెలీదు సార్. వాళ్లు రాత్రి దొంగతనం చేశారు. ఇంకా అవతల పార్టీకి అందించి ఉండరు"

"అర్జంటుగా వాళ్లు ఎక్కడ ఉన్నారో ఆరాతియ్యి. ఆ విగ్రహాన్ని మనమే బేరం చేద్దాం" చెప్పి ఫోన్ పెట్టేశాడు రతన్‌లాల్.

కోటిలింగం దొంగతనం చేశాడంటే అది ఖచ్చితంగా మంచి బేరమే అయివుంటుంది. వెంటనే చెప్పవలసిన వాళ్లకు దానిని గురించి చెప్పాలి. టెలిఫోన్‌లో ఒక నంబరు వేగంగా రింగ్ చేశాడు రతన్‌లాల్.

"హల్లో!" అవతలి నుండి ఒక గంభీరమైన కంఠస్వరం వినబడింది.

ఆ కంఠం వింటూనే రతన్‌లాల్ మోకాళ్లలో వణుకు మొదలయ్యింది. కొన్ని వందలసార్లు విన్నా ఆ కంఠస్వరం విన్నప్పుడల్లా అలాగే పీలపుతాడు. వణుకుతున్న గొంతుతో తను విన్నది, ఊహించింది మొత్తం చెప్పాడు. అవతలినుండి సమాధానం రావడానికి కాస్త సమయం పట్టింది. మరీ ఇంత సోమరి వెధవలను అనుచరులుగా పెట్టుకుంటే మసయిపోతావు లాల్. ఒక అమెరికన్ మిలియనీర్ తన షోరూంలో పెట్టుకోవడానికి ఆ విగ్రహం అడిగాడు.

"బేరం ఎంతో తెలుసా లాల్?"

"రెండు కోట్లు పైగా ఇండియన్ కరన్సీ వస్తుంది. అందుకే విక్రమ్‌ను పంపాను. బేడ్‌లక్! విక్రమ్ చేతినుండి ఆ ఇద్దరూ తప్పించుకున్నారు. అఫ్‌కోర్సు! విక్రమ్ ఖచ్చితంగా వాళ్లను పట్టుకుంటాడు. నాకు ఆ నమ్మకం ఉంది."

రతన్‌లాల్ తలపంకించాడు. ప్రపంచంలో పరమకిరాతకులకు ఇచ్చే అవార్డు ఏదైనా ఉంటే అది విక్రమ్‌కు మాత్రమే వస్తుంది.

"సదాశివాన్ని, కోటిలింగాన్ని పట్టుకోవాలి ఎలాగైనా లాల్! నీ డేగకళ్లను వాళ్ల పైకి తోలు" అవతలి వైపునుండి వినబడింది.

రిసీవర్ హుక్‌పై పెట్టేశాడు రతన్‌లాల్. అయితే నిముషం కూడా గడవకముందే మళ్లీ ఫోన్ మోగింది. ఈసారి ఫోన్ చేసింది రాజు.

"సార్! కోటిలింగాన్ని ఎవరో చంపేశారు. పటకాకత్తులతో నరికివేశారు"

ఉలిక్కిపడ్డాడు రతన్‌లాల్. అయితే విక్రమ్ యాక్షన్‌లోకి దిగాడన్నమాట. ఇక శవాలు గుట్టలుగా కనబడతాయి.

అయితే ఎక్కడో విన్న ఇంకో విషయం గుర్తుకువచ్చింది. మృత్యుదేవత అయిన ఆ యముడి విగ్రహం గుళ్లో నుండి కదిపితే మృత్యువు విలయ తాండవం చేస్తుందట.

"సార్! కోటిలింగం ఆఖరిసారి ఒక అమ్మాయితో మాట్లాడాడు. బహుశా విగ్రహం గూర్చే అయివుంటుంది" చెప్పాడు రాజు.

"ఆ అమ్మాయి ఎవరో తెలుసా?"

"తెలీదు సార్. నెమలిపింఛంరంగు చీర కట్టింది. ఇరవై ఏళ్లు ఉండొచ్చు. చేతిలో ఏదో ఫైల్ కూడా ఉంది. చాలా బావుంది సార్" పళ్లికిలించినట్లున్నాడు

రాజు. రతన్‌లాల్ బలహీనత అతని అనుచరులందరికి తెలుసు.

"ఏడిశావులే. ముందు ఆ అమ్మాయి ఎవరో తెలుసుకో. ఆ తర్వాత బోను సిద్ధం చెయ్యి" ఫోను పెట్టేశాడు.

* * *

"జాక్సన్ అండ్ కో"అన్న బోర్డు చూసి అధునాతనంగా కనబడుతున్న భవంతిలోనికి అడుగు పెట్టింది సంయుక్త. యూనిఫాంలో ఉన్న ప్యూన్ గ్లాస్ డోర్ తెరిచి లోపలకు పంపాడు. ఎండలో వచ్చిందేమో ప్రాణం లేచివచ్చి నట్లయ్యింది. ఎయిర్‌కండీషనింగ్ చేసిన పెద్ద హాలు అది.

ఒక చివరగా కొంతమంది ఆడపిల్లలు కుర్చీలలో కూర్చుని ఉన్నారు. ఒక పక్కన తను కూడా కూర్చుంది. మొత్తం ఏడుగురు ఆడపిల్లలు అక్కడ కూర్చుని ఉన్నారు. తనతో కలిపి ఎనిమిదిమంది. ఇంటర్వ్యూ మొదలయ్యింది. ప్యూన్ ఒకరి వెనుక ఒకరిని పిలుస్తున్నాడు. లోపలకు వెళ్తున్నారు. ముఖం నిండా చెమటలతో అదురుతున్న వదనాలతో బయటకు వస్తున్నారు. చివరగా సంయుక్త వంతు వచ్చింది. తలుపు తెరుచుకొని లోపలకు ప్రవేశించింది. లోపల పెద్ద టేబుల్ వెనుక ఒక నడివయస్సు వ్యక్తి కుర్చీలో కూర్చుని ఉన్నారు.

"మీ పేరు?"

"సంయుక్త."

"క్వాలిఫికేషన్?"

"బి.ఏ. టైపు హయ్యరు, షార్ట్‌హాండ్ కూడా పాసయ్యాను" చెప్పింది సంయుక్త.

"బి.ఏ.లో మెయిన్ ఏమిటి?" టేబుల్‌పైని మంచినీళ్లగ్లాసు అందుకుంటూ అడిగాడాయన.

"ఏన్షియంట్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ".

ఆ జవాబు వింటూనే ఆయన ముఖంలో కుతూహలం కనిపించింది.

"ఆర్కియాలజీ అంటే పురాతన వస్తువులు తవ్వి తీయడమేనా?"

"కాదుసార్! పురాతన చరిత్రకు సంబంధించిన అవశేషాలను ఆనాటి చరిత్రను, నాగరికతను తెలిపే వస్తువుల సేకరణ కూడా ఆర్కియాలజీలోకే వస్తుంది. ఈ తవ్వకాలను ఉద్ఘతనాలు అంటారు. ఈ ఉద్ఘతనాలు లేకుండానే పాతదేవాలయాలు, గుహలు ఆధారంగా ప్రాచీననాగరికతలను బయటకు తీస్తుంటారు. ఆ సమయంలోనే కొన్ని అపురూపవస్తువులు కూడా బయల్పతాయి."

"అపురూపవస్తువులంటే వెండి, బంగారు నగలా?"

"కాదు సర్...ఆనాటి చరిత్రను మన కళ్లముందు ఉంచే వస్తువులు ఉదాహరణకు గుప్తులకాలం నాటి కత్తి గాని, డాలు గాని దొరికితే అది మనకు అపురూపవస్తువవుతుంది.

"అంతెందుకు మీ ఇంట్లో తాటియాకులపైన మీకు అర్థం కాని లిపిలో రాసివున్న గ్రంథం దొరికితే దానిని మీరు పనికిరానిచెత్త అనుకుంటారు. కాని అది బయటకు వస్తే చరిత్రలో అనుకోని మార్పులు సంభవించవచ్చు.

అఫ్‌కోర్స్! ప్రైవేట్‌వ్యక్తులు అటువంటి వాటిని ఎక్కువ ధరకు కొంటారనుకోండి......" ఒక్క క్షణం ఊపిరిపీల్చుకుని మళ్లీ చెప్పింది.

"పట్టించుకోరుగానీ వెండి, బంగారు వస్తువుల లాగానే ఈ పురాతన వస్తువులను కూడా దొంగిలిస్తారు"

"విగ్రహాల చోరీనా?" అంతవరకు కామ్‌గా వింటున్న అతడు ఉలిక్కి పడినట్లు అడిగాడు.

"ఎస్. విగ్రహాలను దొంగిలించి, చట్టం కళ్లు కప్పి రవాణా చేస్తుంటారు."

"ఈ దేశంలో ప్రతిరోజు కొన్నివందల విగ్రహాలు తయారవుతున్నాయి. ఒకటి, రెండు విగ్రహాలు పోతేమాత్రం నష్టమేముంది?"

"ఈరోజులలో తయారైన విగ్రహాలు ఎవరికీ అవసరం లేదు సార్. వాళ్లకు కావలసింది ఒక శతాబ్దానికి ముందు తయారైన విగ్రహాలు. విగ్రహం ఎంత పాతదైతే అంత రేటు పలుకుతుంది. ఇక నష్టమంటారా? మన దేశానికి, మన చరిత్రకు సంబంధించిన అపురూపమైన వస్తుసంపద దేశం వదిలి పోతుంటే........"

ఆమె మాటలకు అడ్డువస్తూ టేబుల్ మీద టెలిఫోన్ "బొయ్" మంటూ మోగింది.

ఉలిక్కిపడి చూసింది సంయుక్త. ఆ విధంగా విచిత్రంగా శబ్దం చేసే ఫోన్‌ను అంతవరకు ఆమె చూడలేదు.

రిసీవర్ చేతిలోనికి తీసుకుంటూనే "జాక్సన్ హియర్!" అన్నాడాయన, ఆ తర్వాత ఏమి మాట్లాడలేదు. జాగ్రత్తగా అవతలిమాటలు వింటున్న ఆయన ముఖంలో రంగులు మారసాగాయి. కాస్సేపటికి రిసీవర్ హుక్ పైన వుంచాడు. సంయుక్త మొహంలోకి దీక్షగా ఒక్కక్షణం చూసి ఆ తర్వాత చెప్పాడు.

"మిస్ సంయుక్త! నిజానికి ఈ ఉద్యోగం ఒక మంత్రి గారి కాండిడేట్‌కు రిజర్వు చేయబడింది. అయితే ఆ అమ్మాయి రావడంలేదని ఇప్పుడే ఫోన్ వచ్చింది. ఇక ఇంటర్వ్యూకి వచ్చినవాళ్లలో నాకు నచ్చిన అభ్యర్థివి నీవే! సో! యుఆర్ అప్పాయింటెడ్!"

ఆశ్చర్యంగా ఆయన మొహంలోనికి చూస్తూ వుండిపోయింది సంయుక్త.

బజర్ నొక్కాడు ఆయన. తలుపు తోసుకుని ఒక సన్నటివ్యక్తి లోపలకు వచ్చాడు.

"మూర్తీ! వీరి దగ్గర జాయినింగ్ రిపోర్టు తీసుకో. కైవల్యగారున్న రూమ్‌లో వీరికి సీటు ఏర్పాటు చెయ్యి."

"యస్ సర్. పదండి" అన్నాడు మూర్తి.

చివరగా వున్న ఒక గదిలోనికి తీసుకువెళ్లాడు మూర్తి. ఎత్తుగా వున్న రెండు బీరువాలు, ఆ బీరువాల నిండా ఫైల్స్, రెండు కుర్చీలు, రెండు బల్లలు వున్నాయి. ఒక కుర్చీలో కూర్చున్న అమ్మాయిని చూస్తూనే అరిచింది సంయుక్త.


"హాయ్ ! కైవల్యా!"

ఆ అమ్మాయి కూడా సంయుక్తని చూసి హాపీగా నవ్వింది.

"కంగ్రాచ్యులేషన్స్" చెప్పింది కైవల్య.

"థాంక్స్"

మూర్తి ఏరకమైన భావం ప్రదర్శించకుండా నిర్లిప్తంగా ఆ గదిలో నుండి వెళ్లిపోయాడు.



"అయితే మంత్రి గారి అభ్యర్థివి నీవేనన్నమాట !"

"కాదు, ఆవిడ రాలేదట. ఈ వుద్యోగం నాకిచ్చారు. నాకంతా కలగా వుంది. ఇంత తేలిగ్గా నాకు ఉద్యోగం రావడం, కాలేజీలో ఫ్రెండువైన నీవు కూడా ఇక్కడే పనిచేయడం, ఈ వేళ పొద్దుట లేచి ఎవరి మొహం చూశానో...గొప్ప విచిత్రాలు జరిగాయి. ఈ ఆఫీస్‌వర్క్ ఎలా వుంటుంది?"అడిగింది సంయుక్త.

"పెద్దగా భయపడనక్కరలేదు. ఇది చాలా మంచి ఆఫీసు. ఇక్కడ పనేమి కష్టంగా వుండదు. ఆడవాళ్లంటే ఇక్కడవాళ్లందరూ గౌరవం చూపిస్తారు. జాక్సన్ కూడా చాలా మంచివారు" చెప్పింది కైవల్య.

సంయుక్త మెళ్లోని గొలుసు విచిత్రంగా కన్పించింది కైవల్యకు. దాని చివర నున్న డ్రాగన్ బొమ్మను చేతితో పట్టుకుంది.

"ఈ గొలుసు కథ విచిత్రమైందిలే! ఖాళీ వున్నప్పుడు చెబుతాను. కాని, ఈ గొలుసే నా అదృష్టదేవత" అంది సంయుక్త.

అది ఆమెకు తన తండ్రి పంపిన గొలుసని, దానితోనే తన అదృష్టం మారిందని నమ్మకం ఏర్పడింది సంయుక్తకి.

* * *

రివ్వున దూసుకొచ్చిన మోటార్‌బైక్ ఆ భవనం పోర్టికోలోనికి రాగానే సడన్‌గా ఆగింది. దానిపైనుండి దిగిన సింధూర్ ఠీవిగా ఆ భవంతిలోనికి నడిచాడు. ముందు హాలు లోనికి వచ్చేసరికి ఇద్దరు నౌకర్లు ఎదురువచ్చారు.

"అయ్యగారున్నారా?" అడిగాడు సింధూర్.

"ఉన్నారు సార్. మీ కోసమే ఎదురు చూస్తున్నారు రండి."

వాళ్ల వెనకే లోపలి గదిలోనికి నడిచాడు సింధూర్. ఆ గదిలో ఒక మూల గా వున్న సోఫాలో కూర్చుని వున్నాడొక వృద్ధుడు. వయస్సు పై బడినా అతని శరీరం దృఢంగానే వుంది. అతని కళ్లు ఎర్రగా నిప్పుల్లా ఉన్నాయి.

అతనిలో జరుగుతున్న మానసికసంఘర్షణకు ప్రతీకలా అతని నుదిటిపై నరాలు ఉబ్బికనబడుతున్నాయి. అతన్ని ఆ పరిస్థితిలో చూస్తూనే సింధూర్ కనుబొమ్మలు ముడిబడ్డాయి.

"ఏం జరిగింది సార్!" లోపలకు వస్తూనే అడిగాడు.

"కమాన్ సింధూ! కూర్చో" తన పక్కన సీటు చూపించి చెప్పాడా వృద్ధుడు. కూర్చున్నాడు సింధూర్.

నౌకరు రెండుగ్లాసులతో లెమన్‌జ్యూస్ ఇచ్చాడు. ఆ నౌకరు వెళ్లేదాకా ఏమి మాట్లాడలేదాయన. తర్వాత వెళ్లి తలుపు వేసొచ్చాడా వృద్ధుడు.

"చాలాకాలంగా మౌనంగా వున్న మృత్యువు తన ఆకలి తీర్చుకోవడానికి ప్రపంచం పైకి వచ్చింది సింధూ! మనం జాగ్రత్త పడకపోతే చాలా అనర్థాలు జరుగుతాయి" చెప్పాడా వృద్ధుడు.

కామ్‌గా తన చేతిలో వున్న డ్రింక్ సిప్ చేస్తూ కూర్చున్నాడు సింధూర్. విషయం చాలా సీరియస్ అని తెలుస్తుంది. తను మాట్లాడటం అనవసరం. ఆ వృద్ధుడే తిరిగి చెప్పసాగాడు.

"ఇదంతా చెప్పే ముందు మా కుటుంబం గూర్చి కొంత చెప్పాలి. నీకు తెలుసు కదూ! మా తాతలు జమీందారులు. ఆ తర్వాత కాలక్రమంలో ఆ దివాణాలు, భోగాలు పోయాయి.

అయితే ఆ వారసత్వంగా నాకు కొన్ని పొలాలు, ఈ భవనం, ఒక దేవాలయం వచ్చాయి. తరతరాలుగా మేము ధర్మకర్తలుగా ఉంటున్నాము. ఆ దేవాలయానికి ఒక విశిష్టత వుంది. అందులో అష్టదిక్పాలకుల విగ్రహాలు ఉన్నాయి. ఆ విగ్రహాలు దేశంలో ఇంకెక్కడా లేవు.

సింధూర్ ఆశ్చర్యంగా ఆ వృద్ధుడి మొహంలోనికి చూసి, "అష్టదిక్పాలకులా? " అన్నాడు.

"అవును సింధూర్! హిందూధర్మశాస్త్ర ప్రకారం ఎనిమిది దిక్కులకు ఎనిమిది మంది దిక్పాలకులు వున్నారు.

ఒక్క క్షణం ఆగి సింధూర్ మొహంలోకి చూశాడా వృద్ధుడు. అతనిలో కనబడుతున్న ఆత్రతను తృప్తిగా చూసి తిరిగి చెప్పసాగాడు.

"అయితే వీరందరిలోనూ దక్షిణానికి అధిపతి అయిన యముడు, మృత్యుదేవుడు. ప్రపంచంలో సకల జీవరాశులను కాలం తీరగానే క్రమం తప్పకుండా తీసుకుపోయే కాలయముడు, కూడా వున్నాడు. ఆ గుడిలో యముడికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రతిదినం గంజాయిధూపంతో అష్టోత్తర, సహస్రనామ పూజలు జరుగుతాయి. ఇప్పుడు ఆ విగ్రహాన్ని ఎవరో దొంగిలించారు. యముడిని దొంగతనంగా పట్టుకుపోయారు"

"అది బంగారు విగ్రహమా?"

"కాదు. కాని అంతర్జాతీయ మార్కెట్‌లో ఆ విగ్రహం విలువ బంగారు విగ్రహం విలువకు పదిరెట్లు వుంటుంది. అది ఆంధ్రశాతవాహనుల కాలంలో తయారు చేయబడ్డ విగ్రహం, అందులోనూ ఇంకెక్కడా లేని అపూర్వమైన ప్రాచీన విగ్రహం."

"అయితే వాళ్లు ఆ యముడి విగ్రహం ఒక్కటే ఎందుకు తీసుకున్నారు? అదే గుడిలో ఇంకా ఏడు విగ్రహాలున్నాయి కదా!"

"ఎవరో విదేశీయుడు ఆ విగ్రహం కావాలని అడిగి వుంటాడు. అందువల్ల అదొక్కటే తీసుకుపోయారు. మిగిలిన విగ్రహాలు కూడా కావాలంటే అవి కూడా తీసుకుపోదురు. ఈ విగ్రహాల స్మగ్లర్స్ విషయం నీకు తెలీదు సింధూర్. డబ్బులిస్తే కన్నతల్లి రొమ్ములు కూడా తెగనరికే కసాయివాళ్లు."

ఒక్క క్షణం తనచేతిలో వున్న గ్లాసులోకి పరీక్షగా చూశాడు. ఆ తర్వాత కాస్సేపు మౌనంగా వున్నాడు. ఆ తర్వాత తిరిగి చెప్పసాగాడు ఆ వృద్ధుడు.

"ఆ విగ్రహానికి సంబంధించి ఒక నమ్మకం ప్రచారంలో వుంది. అది ఉన్న ప్రదేశంలోంచి దానిని తరలించి రోజూ పూజలు చేయకపోతే రక్తపుటేర్లు ప్రవహిస్తాయట. దానిని నేను కూడా నమ్ముతున్నాను."


"ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అడిగాడు సింధూర్.

"నాకు ఆ విగ్రహం కావాలి, సింధూర్! నువ్వు ఏం చేస్తావో, ఎలా తెస్తావో నాకు తెలీదు!"

* * *

ఆ రోజు ఆదివారం. ఆఫీసుకు సెలవు కావడంతో ఆటవిడుపుగా ఉంది సంయుక్తకు. బామ్మ కూడా తిరిగి వంటిల్లు సర్దింది కాసేపు. అయితే బామ్మ రావద్దని ముందు గదిలోకి గెంటడంతో బయటకు వెడదామని తయారవసాగింది.

ఆ సమయంలో వచ్చింది కైవల్య. ఆమె ఒంటిపైన చీర బురదకొట్టి ఉంది. ఒంటిపైన కూడా అక్కడక్కడా బురదనీళ్లు కొట్టినట్లుంది.




మనిషికి ప్రాథమిక అవసరాలేమిటి? తిండి, సెక్సు ప్రధానం కదా! ఇంకా లెక్కిస్తే పౌరసత్వం, సామాజిక అనుబంధాలు, వరసగా తయారవుతాయి. మొత్తం ప్రాథమిక మానవ అవసరాలన్నింటినీ ఒక అంకెలోకి కుదించవలసే వస్తే అన్నీ కలిపి 15 దాటవంటున్నారు పరిశోధకులు!

"అదేమిటేవ్? ఎక్కడైనా జారి పడ్డావా?" అడిగింది సంయుక్త.

"లేదే, బాబూ! గాంధీచౌక్‌లో డ్రైనేజ్ బాగుచేస్తున్నారట. రోడ్డుపైన బురద వేసి ఉంచారు. వాడెవడో కారులో వెడుతూ నా మీద బురదకొట్టి పోయాడు, రాస్కెల్!" ఏడుపు మొహంతో చెప్పింది కైవల్య.

అంతవరకు కైవల్య తిడుతుందని నవ్వు బలవంతాన ఆపుకుంది సంయుక్త. ఇక ఆమెవల్ల కాలేదు. పగలబడి నవ్వుతున్న స్నేహితురాలిని చూడగానే ఉక్రోషంతో కూడాపడి తరమబోయింది కైవల్య.

"చూడు, బామ్మా! వాడెవడో నా మీద బురదనీళ్లు చల్లాడు. నన్ను చూసి సంయుక్త ఎలా నవ్వుతోందో?" ఎదురువచ్చిన బామ్మతో కంప్లయింట్ చేసింది.

వెంటనే బామ్మ ఆ కారు ఓనర్‌ని తిట్లతో అష్టోత్తరపూజ చేసింది.

"అబ్బా, బామ్మా! వినలేకపోతున్నామే! ఆపేయ్!" సంయుక్త బతిమాలింది.

"లేకపోతే ఆడపిల్ల అని కూడా చూడకుండా అలా బట్టలు ఖరాబుచేస్తాడా? వాడు మనిషా, పశువా?"

"లోపలకు వెళ్లి స్నానంచేసి రావే, కైవల్యా! నా చీర కట్టుకుందువుగాని. సినిమాకు వెడదాం!"

"ఊహుం, నన్నింత అవమానము చేసిన నీ గృహమునందు స్నానపానాదులు నిషిద్ధము, బాలికా!"

"అదేమిటేవ్, జానపద చిత్రాల్లో రాజకుమారిలాగా!"

"అదంతే.మేము నీ ఇంట విశ్రమించము, స్నానామాచరింపము!" అదే స్టయిల్‌లో చెప్పింది కైవల్య.

"చక్కగా నీవు బట్టల్లేకుండా స్నానం చేస్తున్న ఫొటోలు తీసి నీ పెళ్లయ్యాక మీ ఆయనకిద్దామనుకున్నానే! ఎంత చక్కటి అవకాశమో, పాడుచేసుకుంటున్నావు."

ఆ మాటలకు మళ్లీ ఉడుక్కుంది కైవల్య. బామ్మ కలగజేసుకుంది. "అది ఉట్టి మగరాయుడులేమ్మా! అలాగే మాట్లాడుతుంది. నువ్వెళ్లి స్నానం చెయ్యి!"

"ఊహుం, చెయ్యను!' మొండికేసింది కైవల్య. ఒక్క క్షణం ఆగి తనే చెప్పింది మళ్లీ-"నాకు నీ నెమలిఫించం రంగు చీర ఇవ్వాలి. అలాగైతేనే నువ్వు చెప్పినట్లు వింటాను!"

"ఓసీ రాక్షసీ! ఎంత ఆశే నీకు! నేనే ఒక్కసారి మాత్రమే కట్టాను ఆ చీర. నేను ఇవ్వను."

"పోనీ, ఒక్కసారి ఇవ్వవే! ఆ అమ్మాయి అంత సరదాపడుతూంటేనూ!" బామ్మ చెప్పింది.

సంయుక్త ఒప్పుకోవడంతో చిలకలా ఎగురుకుంటూ బాత్‌రూమ్‌లో వాలింది కైవల్య. సంయుక్త చీరను గబగబా కట్టింది. ఆ చీరకోసం మొత్తం ఊరంతా తిరిగింది కైవల్య.

దొరకలేదు. అసలు సంయుక్తే ఒక షాపులో ప్రచారంకోసం తెచ్చి బొమ్మకు చుట్టిన చీరను విప్పించి పాక్ చేయించింది. ఊళ్లోకి ఆ చీరలు ఇంకా రాలేదు. ఇప్పుడు ఎలాగూ సంయుక్త చీర కట్టి ఆ ముచ్చట తీర్చుకుంది.

సంయుక్త, కైవల్య కలిసి సినిమాకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బామ్మ తను కూడా వస్తానని



## గిన్నీస్ బుక్‌లో రామానాయుడు

'రాముడు-భీముడు' నిర్మాతగా సినిమారంగానికి 1963లో వచ్చిన శ్రీ రామానాయుడు నూరు చిత్రాలు నిర్మించి గిన్నిస్ బుక్ నలంకరిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఒరియావంటి అన్ని భాషలలో చిత్రాలు నిర్మించాలనుకున్న తదేక లక్ష్యంతో అది సాధించగలిగారు. సినిమారంగంలో సంపాదించినదంతా ఆ రంగానికే వెచ్చించాలని, దానికి గౌరవం, విలువ తీసుకురావాలని నాయుడు తపనచెందేవారు. "అదిగో - నా స్టూడియో, నా లాబ్, నా రికార్డింగ్ థియేటర్, మాదాపూర్‌లో పర్మెనెంట్ సెట్స్...అవే నా ఆస్తులు. స్క్రిప్ట్‌తో నా స్టూడియోలోకి అడుగుపెట్టే నిర్మాత, చిత్రాన్ని పూర్తిచేసుకుని(ఒక్క పాటలకు ఔట్‌డోర్ లొకేషన్స్‌కు వెళ్లాలేగానీ), ఫస్ట్‌కాపీతో బయటకు వెళ్లేందుకు అనువైన అన్ని సదుపాయాలూ ఇక్కడ అమర్చిపెట్టాను. దేనికీ తడుముకునే పని ఉండదు!" అన్నారు రామానాయుడు ఇటీవల జరిపిన పత్రికాగోష్ఠిలో.

"ఆ రోజుల్లో 'రాముడు-భీముడు'కి ఆరున్నర లక్షలు ఖర్చు చేశాను. అదే ఈ రోజుల్లో మూడున్నర కోట్లు దాటిపోతోంది. సురేష్‌బాబు పేరుతో 'సురేష్ ప్రొడక్షన్స్' స్థాపించాం. 'రాముడు-భీముడు' చిత్రంలో ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయనం చేశారు. చీఫ్ మినిస్టరయ్యారు. అలాగే ఎం.జి.ఆర్. మా చిత్రంలో నటించారు. తమిళనాడు చీఫ్ మినిస్టరయ్యారు. ఎంతోమంది యువకళాకారులకు అవకాశం కల్పించాను. డైరెక్టర్స్, హీరోయిన్స్, టెక్నీషియన్స్...ఎందరినో తొలిసారిగా నా బానర్‌పైనే ఛాన్సులు ఇచ్చి ప్రోత్సహించాను!" అన్నారు. "హిట్టయినా, ఆ చిత్రం ఫట్ అయినా నేనొక్కలాగే ఫీలవుతాను. 'భగవత్కృప' అనుకుని, దాన్ని ఆనందంగా స్వీకరించడం మానవుల కనీస ధర్మం!" అన్నా రాయన.

"తొలిదశలో వరసగా పిక్చర్స్ ఫెయిలై, ఇంటికి వెళ్లిపోదామా అనిపించింది. 24.9.1971లో రిలీజైన 'ప్రేమనగర్' హిట్టయింది. బండి దారిలో పడింది. మరే బాధా లేకుండా చిత్ర నిర్మాణం చకచక సాగించేశాను. దానితో 'జీవనతరంగాలు, సెక్రటరీ, చక్రవాకం, గురుబ్రహ్మ'వంటి చిత్రాలు నిర్మించడం, ఒక్కొక్క చిత్రంతో ఒక్కొక్క అడుగు ముందుకువేస్తూ, వందచిత్రాల నిర్మాతగా గమ్యం చేరుకుంటున్నాను ఇప్పుడు" అంటూ తన సంతృప్తి ప్రకటించారు రామానాయుడు.

తన టెక్నిషియన్లకు రెసిడెన్షియల్ ఫ్లాట్స్ నిర్మించి ఇచ్చారు. కారంచేడులో కళ్యాణమండపం, హైదరాబాదులో కళామండపం, నర్సపూర్‌వద్ద ఓల్డ్‌ఏజ్ హోమ్స్, ఆర్ఫనేజ్ నిర్మించారు. చెన్నై ఆంధ్రా కల్చరల్ అసోషియేషన్‌కు పది లక్షల రూపాయలు, జూబిలీ హిల్స్‌లో ఏ.పి. ఫిలిమ్ ఛాంబర్స్ నిర్మాణానికి మరో పది లక్షల రూపాయలు డొనేట్ చేశారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీతో సహా ఎన్నో సంస్థలు సన్మానించాయి. ఎన్నో అవార్డులు పొందారు. సెంచరీ కొట్టినా నాట్ అవుట్ అంటూ అదే చిరునవ్వుగల వ్యక్తి 'ఉదారుడు రామానాయుడు'గా పేరుపొందారు.

\- గౌతమ్

బయలుదేరింది. అయితే ఆఖరినిముషంలో ఆ వీధిలో ఎవరి కోడలో నొప్పులు పడుతోందని తెలియడంతో సినిమాప్రోగ్రాం కాన్సిల్ చేసుకుని అటు పరుగెత్తింది.

ఒళ్లు మండింది సంయుక్తకు. చాలాసార్లు బామ్మ అలానే చేసింది. బామ్మను తిట్టుకుంటూ థియేటర్‌కు వెళ్లారు ఆడపిల్లలిద్దరూ. అనుకున్నట్లే సినిమా టిక్కెట్లు దొరకలేదు.

థియేటర్‌నుండి బయటకు వస్తుంటే సంయుక్త చెప్పింది- "ఈరోజు నీవు ఇంటికి వెళ్లి దిష్టి తీయించుకోవాలే! అందరి కళ్లూ నీ మీదే ఉన్నాయి!"

ఆ మాట నిజమే కానీ, అందులో కొన్ని పాపిష్టికళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా విక్రమ్ అనుచరుల కళ్లు. అండర్‌వరల్డ్‌లో ఏ విషయమైనా అతి తేలికగా పాకిపోతుంది. కోటిలింగంతో మాట్లాడిన అమ్మాయి విషయం అలాగే పాకింది.

నిరాశగా థియేటర్ ఎదురుగా ఉన్న రెస్టారెంట్‌లోకి నడిచారు.

వచ్చి నిలబడిన సర్వర్‌కి "రెండు చికెన్ బిర్యానీ తీసుకురా!" కైవల్య చెప్పింది. అంతవరకు వాష్‌బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంటున్న యువకుడు సరిగ్గా వీళ్ల పక్క టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

"భలే ఉన్నాడు కదే! మెకనాస్‌గోల్డ్‌లో హీరోలాగా!" అంది కైవల్య.

"పాపం ఏమీ అనకే! మరీ ముద్దపప్పులా ఉన్నాడు. భయపడి పారిపోతాడు!" తలవంచుకుని కూర్చున్న ఆ యువకుడిని చూస్తూ చెప్పింది సంయుక్త.

"ఇద్దరు ఆడపిల్లలు పక్కనే కూర్చుని ఉండగా అలా తలవంచుకుని కూర్చున్నాడేమే!"

"మనకెందుకే! అయినా మగవాళ్లతో మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాను, తెలుసా?"

"నిజంగా? ఎప్పటినుండి?"

"మా బామ్మ ఇలాగే ఒక మగవాడితో మాట్లాడి మోసపోయిందట."

"నిజంగా?" వెన్నును నిటారుగా చేస్తూ అడిగింది కైవల్య.

"ఎప్పుడు? ఎవరివల్ల?"

"శోభనంరోజట! మా తాతయ్యవల్ల!"

వాళ్ల మాటలు వింటున్న ఆ యువకుడి పెదవులపై సన్నని చిరునవ్వు మెదిలింది. ఇంతలో సర్వర్ చికెన్‌బిర్యానీ తెచ్చి వాళ్ల టేబుల్‌పై పెట్టాడు. అది చూస్తూనే ఆ యువకుడు ముఖం చిట్లించాడు.

"నిజంగా పప్పుసుద్దలానే ఉన్నాడే? వెజిటేరియన్ అనుకుంటా. కాసేపు ఏడిపిద్దామా?" సంయుక్త చెవిలో గుసగుసలాడింది కైవల్య.

"ఎలా?"

"ఏముంది? ప్రపంచంలోని రకరకాల నాన్‌వెజ్‌ల గురించి మాట్లాడటమే."

"నీకు తెలుసా? చైనాలో చెదపురుగులు పట్టుకుని వేపుకు తింటారట!" పెద్దగా చెప్పడం మొదలుపెట్టింది సంయుక్త.

"అంతే కాదు, చీకటిరాత్రులలో పెద్ద నెగడు వేసి చలి కాచుకుంటారట. ఆ మంటకు ఆకర్షింపబడ్డ రకరకాల పురుగులు వచ్చి ఆ మంటల్లో పడిపోతాయి. బాగా రోస్ట్ అయిన వాటిని లొట్టలు వేసుకుంటూ తింటారట. అఫ్‌కోర్స్! కుక్కలను, పిల్లులను ఎలానూ తింటారనుకో!"

సంయుక్త మాటలకు ఆ యువకుడు ఇబ్బందిగా ముఖం పెట్టాడు. అది చూసి కైవల్య చెప్పడం మొదలుపెట్టింది.

"సరే నువ్వు కుక్కలు, పిల్లులు అంటున్నావ్. నార్త్ అమెరికాలో మనుషులను తింటారట తెలుసా?"

సరిగ్గా అదే సమయంలో వెయిటర్ రెండు పరోటాలు ఖైమా కూరతో తెచ్చి ఆ యువకుడిముందు పెట్టాడు.

అది చూడగానే సంయుక్త, కైవల్య ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఆ యువకుడు తమని ఆటపట్టించాడని వాళ్లకు అర్థమైంది.

"మిస్! మీకు ఒక విషయం తెలుసా? మనుషులను తినడాన్ని కానిబాలిజం అంటారు."

ఆ యువకుడు సంయుక్తతో చెప్పసాగాడు. "ఈ కేనిబాల్స్ ప్రపంచంలో చాలాచోట్ల ఉన్నారు. నార్త్ అమెరికాలో హమిటజాన్ అనే తెగకు నాయకత్వం వహించేవాడు మూడురోజుల పసికందును దేవతాప్రసాదంగా తినాలి. బిజియన్ తెగవాళ్లు పరాయి తెగవాళ్లను మహానందంగా తినేస్తారు. నార్త్ అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికాలోనూ ఈ కానిబాల్స్ ఉన్నారని అంచనా!"

సంయుక్త రుసరుసలాడుతూ ముఖం పక్కకు పెట్టుకుంది.

"మహానుభావా! ఏదో తింటున్నాం చూశారుగా? ఇటువంటి కబుర్లు చెప్పి మధ్యలో ఆపించేద్దాం అనుకుంటున్నారా?" కైవల్య అంది.

"కాస్తయినా లావు తగ్గుతారని ...!" తనలో తాను అనుకున్నట్లు అన్నాడు.

"వ్వాట్...?" ఇద్దరూ ఒకేసారి అరిచారు.

"ఏం లేదు. 1976లో డాక్టర్ గజుడోసెక్ అనే ఆయన కానిబాల్స్ పైన రిసెర్చి చేసి నోబుల్ బహుమతి పొందాడు. ఆ డాక్టర్ వాళ్లపై ఒక పుస్తకాన్ని రాశాడు. మీకు ఎక్కువ వివరాలు కావాలంటే అది చదవండి!" చెప్పాడా యువకుడు.

"అక్కరలేదులెండి! ప్రపంచంలో ఎవరెవరు ఏమేం తింటారో తెలుసుకోవడం మా హాబీ కాదు!" చెప్పింది సంయుక్త.

అప్పుడు చూశాడా యువకుడు సంయుక్త మెడలో వేలాడుతున్న గొలుసును. విచిత్రంగా తోచిందది. దానిగురించి అడుగుదామనుకున్నాడు. కానీ సంయుక్త మూడ్ చూసి విరమించుకున్నాడు. "మీ పేర్లేమిటి మిస్‌లు?" బయటకు వెళ్లేముందు అడిగాడా యువకుడు.

"రంభ, ఊర్వశి!" వ్యంగ్యంగా చెప్పింది కైవల్య.


"అలాగా! నాపేరు ఇంద్రుడు, దేవేంద్రుడు!" అన్నాడా యువకుడు బాండ్ ...జేమ్స్‌బాండ్ స్టయిల్‌లో.

ఆ యువకుడు బయటకు వెళ్లాక అతనెవరని సర్వర్‌ని అడిగింది సంయుక్త.

"అరే! ఆయన తెలీదా మేమ్‌సాబ్! హెవీ వెయిట్ బాక్సర్! పేరు సింధూర్! మన తెలుగువాళ్లకే గర్వకారణమైన ఫైటర్!" భుజాలు ఎగరవేస్తూ చెప్పాడు సర్వర్.

* * *

**సిం**ధూర్ తన మోటార్ బైక్ తాళంతీసి స్టార్ట్ చెయ్యబోయాడు. ముందు టైరు పంక్చరయినట్లుంది. "షిట్!" విసుక్కున్నాడు సింధూర్. నడిపించుకుంటూ ముందుకు సాగాడు. కొద్దిదూరంలో రాజు మెకానిక్ షెడ్ ఉంది. రాజు అతని చిన్ననాటి స్నేహితుడు. ఇద్దరూ అనాథలే. అయితే సింధూర్‌కు సరైన గైడెన్స్ దొరకడంతో మంచి బాక్సర్ అయ్యాడు. ఇప్పుడిప్పుడే పేరు




## నాలుగు కోట్ల వాహనాలు

**భా**రతదేశంలో నాలుగు చక్రాల వాహనాలు ప్రస్తుతం నాలుగు కోట్లు ఉన్నాయి. 2050వ సంవత్సరం నాటికి వీటి సంఖ్య 20 కోట్లు దాటవచ్చు! హృద్రోగాల తర్వాత రోడ్డు ప్రమాదాల కారణంగా మనదేశంలో ఎక్కువ మంది దుర్మరణం చెందుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, సేవాసంస్థలు, వాహనాల ఉత్పత్తిదారులు అందరూ సంయుక్తంగా కృషిచేయాలని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ వ్యాఖ్యానించింది.

\- కృష్ణాజీ

ప్రఖ్యాతులు గడిస్తున్నాడు.

ఆ గైడెన్స్ దొరకని రాజు కొంతకాలంకిందటిదాకా నేరస్థుడిగానే మసిలాడు. ఈమధ్య సింధూర్ ప్రోద్బలంతో ఆ జీవితం నుండి బయటకు వచ్చి గౌరవంగా మెకానిక్ షెడ్ పెట్టుకున్నాడు.

సింధూర్‌ను అంతదూరం నుండి చూస్తూనే పరుగున వచ్చాడు రాజు. అతని చేతిలో బండి అందుకున్నాడు.




"నువ్విలా కూర్చో గురూ! అయిదు నిముషాలలో సెట్‌రైట్ చేసి ఇస్తాను!" నవ్వుతూ చెప్పాడు రాజు.

"ఒరే, చిన్నా! అన్నకి ఒక స్ట్రాంగ్ టీ తెచ్చిపెట్టు!" కొట్లో కుర్రాడి వైపు తిరిగి చెప్పాడు రాజు.

"ఇప్పుడు హోటల్ నుండి వస్తున్నా, రాజా! ఇంక ఏమీ తీసుకోలేను!" చెప్పాడు సింధూర్.

"ఏం గురూ! మొన్న పోటీలో ఎదుటి పార్టీగాడిని తుక్కుకింద కొట్టావంట కదా? పేపర్లనిండా నీ ఊసే! ఇప్పుడీ దేశంలో పెద్ద బాక్సర్‌వి నువ్వేనట కదా?"

"అదేం కాదులే. అసలు మనిషి వేరే ఉన్నాడు. అతన్ని ఓడిస్తేగానీ నేషనల్ ఛాంపియన్‌ని కాను!" పెదవి విరుస్తూ చెప్పాడు సింధూర్.

"వాడిని కూడా తుక్కుకింద కొడతావులే, గురూ! నీ పట్టుదల నాకు తెలీదా?'

"అతను పెద్ద ఫైటర్. అతడిని ఎదిరించాలంటే చాలా ప్రాక్టీస్ ఉండాలి."

"మరి ప్రాక్టీస్‌చెయ్యి, గురూ! ఏదైనా సాయం కావాలంటే నేనున్నా కదా?"

"ఇప్పుడు దానికంటే పెద్ద పని తగిలింది. జైలర్‌సాబ్ తనకోసం చేసిపెట్టమన్నాడు."

చేస్తున్న పని ఆపి తక్కున లేచాడు రాజు. జైలర్‌సాబ్ సింధూర్ జీవితాన్ని మలుపు తిప్పిన మనిషి. ఆయన లేకుంటే తనూ, సింధూర్ కూడా పెద్ద క్రిమినల్స్‌గా మారేవారు.

"చెప్పు గురూ! నేను కూడా సాయం చెయ్యగలనేమో చూస్తాను!"

"లోపలకు వెళ్దాం పద!" లోపలకు నడుస్తూ చెప్పాడు సింధూర్.

చిన్నాకి పని అప్పగించి కూడా నడిచాడు రాజు.

"రాజా! కొద్దిరోజుల కిందట జైలర్‌సాబ్ ఆధ్వర్యంలో ఉన్న గుడిలో ఒక విగ్రహాన్ని దొంగిలించారు. అది పోయినప్పటినుండి ఆయనకు మనశ్శాంతి లేదు. చాలా బాధపడుతున్నారు. ఎలాగైనా అది వెనక్కు తెస్తానని చెప్పాను."

సింధూర్ మాటలు వింటూ శిలాప్రతిమలా బిగిసిపోయాడు రాజు. అతని ముఖంలో మార్పులు గమనించి ఆదుర్దాగా అడిగాడు సింధూర్ - "ఏం రాజా? అలా అయిపోయావేం?"

"ఆ విగ్రహం తిరిగి దొరకడం అసంభవం గురూ! చాలా పెద్ద పార్టీలు ఈ కేసులో ఉన్నాయి."

"అంటే అప్పుడే ఆ విగ్రహం దేశం దాటేసిందా?"

"దేశమా? కనీసం ఈ ఊరి పొలిమేర కూడా దాటలేదు. అయితే అది ఎక్కడ ఉందో ఒకే ఒక అమ్మాయికి తెలుసు. ఆ అమ్మాయి ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు."

"సరిగ్గా, అర్థమయ్యేటట్లు చెప్పు!" విపరీతమైన ఎగ్జయిట్‌మెంట్ సింధూర్ కంఠాన్ని వణికిస్తోంది.

"మొదట సదాశివం, కోటిలింగం అనే క్రిమినల్స్ ఆ విగ్రహాన్ని దొంగిలించారు. విక్రమ్ అనే ఇంకో క్రిమినల్ వీళ్ల పైన దాడి చేయడంతో చెరో దారినా పారిపోయారు. ఆ తర్వాత గాంధీచౌక్‌లో కోటిలింగాన్ని విక్రమ్ చంపించేశాడు. కోటిలింగం చనిపోయేముందు ఒక అమ్మాయితో మాట్లాడాడు. ఆ అమ్మాయిని చూసింది నేనే. కోటిలింగం హత్య చేయబడే సమయంలో నేను అక్కడే ఉన్నాను. ఆ అమ్మాయిని నేనుఒక్కడినే చూశాను" ఒక్క క్షణం ఆగాడు రాజు. ఎదురుగా గోడకు ఉన్న కాలెండర్‌వైపు చూశాడు.

అందులో శివలింగాన్ని కౌగలించుకున్న మార్కండేయుడు ఉన్నాడు. కొంచెం పక్కగా మహిషం పైనుండి మార్కండేయుని పైకి పాశం విసురుతున్నాడు యముడు. ఎందుకో తెలీదుగానీ ఆ యముడి కాలెండర్‌ని అక్కడ చూసి ఇబ్బందిగా ఫీలయ్యాడు రాజు.

"ఆ అమ్మాయికి ఇరవై, పాతిక మధ్య వయసు ఉంటుంది. చేతిలో కొన్ని ఫైల్స్ పట్టుకుంది. నెమలిపింఛం రంగు చీర కట్టింది. బహుశా కోటిలింగం ఆ విగ్రహం ఎక్కడ దాచిందీ ఆమెకు చెప్పి ఉండొచ్చు."

"కేవలం చీర రంగుబట్టి ఆడదాన్ని గుర్తించడం ఇంపాజిబుల్!"

"కానీ కొంతమేర అవకాశం ఉంది గురూ! ఆ చీరను ఒక బట్టలషాపు వాళ్లు తెప్పించారు. షోకేసులో బొమ్మకు దాన్ని చుడితే ఒక అమ్మాయి కావాలని పట్టుబట్టి కొనుక్కుందట. ఆ తర్వాత అటువంటి చీరలు ఊళ్లోకి రాకుండా మా బాస్ రతన్‌లాల్ జాగ్రత్త తీసుకున్నాడు. ఒకవేళ వచ్చినా ఆ అమ్మాయి ఆచూకీ తెలిసేదాకా ఆ చీరలన్నీ మా బాస్ కొనేస్తాడు."

"అంటే నువ్వింకా మారలేదు. రతన్‌లాల్ దగ్గర పనిచేస్తున్నావన్నమాట!" అడిగాడు సింధూర్.

"జస్ట్, ఇన్‌ఫార్మర్‌గా, గురూ! అంతకుమించి ఏమీ చెయ్యను!" క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా అన్నాడు రాజు.

విసుగ్గా తల విదిలించాడు సింధూర్. అప్పుడే కథ చాలా దూరం వచ్చేసింది. కేవలం ఒక్క చీర ఆధారంతో తాను ఆ అమ్మాయి ఆచూకీ ఎలా తెలుసుకోగలడు?

నెమలిపింఛం రంగు చీర ...

నెమలి పింఛం ...

తక్కున లేచి నుంచున్నాడు సింధూర్.

"రాజా! ఇప్పుడు నేను వచ్చిన రెస్టారెంట్‌లో ఒక అమ్మాయిని చూశాను. సరిగ్గా ఆ చీర కట్టింది. పద, వెడదాం!" తొందర చేశాడు.

"నువ్వు కూర్చోగురూ! మనదగ్గర చాకులాంటి కుర్రాళ్లు ఉన్నారు. నిముషాలపైన తెలుసుకుని వస్తారు!" చెప్పి కంగారుగా బయటకు పరుగెత్తాడు

రాజు.


కొంతసేపటికి తిరిగి వచ్చాడు. వస్తూనే చెప్పాడు -"ఆ అమ్మాయి పేరు కైవల్య గురూ! జాక్సన్ అండ్ జాక్సన్ కంపెనీలో పనిచేస్తోంది. ఇంకా పెళ్లి కాలేదు. తల్లి లేదు. కానీ తండ్రి ఉన్నాడు. ఇద్దరు చిన్న తమ్ముళ్లు ఉన్నారు!" కైవల్య ఇంటి అడ్రెస్ కూడా చెప్పాడు. తల పంకించి సింధూర్ బయటకు నడవబోయాడు.

"గురూ! విక్రమ్ మనుషులు ఆమెను ట్రేసవుట్ చేశారు. బహుశా ఈ రాత్రికే ఆమెపై దాడి జరగవచ్చు. ఆడవాళ్లని హింసించడంలో పిచ్చి ఆనందం పొందుతాడు విక్రమ్. ఈమెను వదిలే సమస్య లేదు!"

"ఎలాగైనా ఆమెను వాడి బారినుండి రక్షిస్తాను. ఆ విగ్రహం ఆచూకి తెలుసుకుంటాను!" స్థిరంగా అన్నాడు సింధూర్.

ఒక్క క్షణం తటపటాయించాడు రాజు. ఆ తర్వాత సింధూర్ భుజం తట్టి చెప్పాడు - "జాగ్రత్త గురూ! ఇది ఎరీనాలో ధర్మబద్ధంగా యుద్ధం చేయడం కాదు. భయంకరమైన రక్తపిపాసిని ఎదుర్కోవడం. నాకు తెలిసి విక్రమ్‌కంటే శాడిస్టు మరొకడుండడు!"

నవ్వుతూ రాజు చేతిపై చిన్నగా తట్టాడు సింధూర్. ఆ తర్వాత తన మోటారుబైక్‌పై రివ్వున దూసుకుపోయాడు.




రక్తపోటు స్థాయిని కొలిచే పద్ధతిలో పై స్థాయిని సిస్టాలిక్ అనీ, కిందిస్థాయిని డయాస్టాలిక్ అనీ అంటారు. రక్తపోటు తీరు, 'నిర్దేశించిన స్థాయి'ని మించుతుంటే దానిని తగ్గించుకునే ప్రయత్నం విధిగా మనం చేయాలి. సాధారణంగా 130 (పై స్థాయి) 90 (కిందిస్థాయి) ఉంటే ఇబ్బంది ఉండదని ఇంతవరకూ మనం అనుకుంటున్నాం. ఇటీవల వెల్లడైన ఒక పరిశీలన ప్రకారం, డయాస్టాలిక్ (కిందిస్థాయి) ప్రెషర్‌ను 83కి పరిమితం చేసుకుంటే చాలనీ, 90 వరకు కూడా అవసరం లేదనీ, ఇందుమూలంగా గుండెనొప్పి, గుండెజబ్బులు గణనీయంగా నిరోధించవచ్చుననీ, చెపుతున్నారు.

* * *

ఆకాశం ఉన్నట్టుండి మేఘావృతమైంది. చల్లని గాలులు వీస్తున్నాయి. సన్నని చిరుజల్లులు కూడా మొదలయ్యాయి.

ఆకాశంలో తళుక్కున మెరిసిన మెరుపు బయట చీకటిని ఒక్క క్షణం మాయం చేసింది. మెరిసిన మెరుపు వెలుగులో బయట తారురోడ్డు పెద్ద కొండచిలువలా కనబడింది.

ఆ తర్వాత కటికచీకటి. రోడ్డుపైన నడుస్తూనే తనను, తన ఉద్యోగాన్ని కసితీరా తిట్టుకున్నాడు పోలీస్ నరసింహం. తనకు ఈ రోజు డ్యూటీ వద్దంటున్నా వేసిన పై అధికారులందరినీ పేరుపేరునా తిట్టుకున్నాడు. వాళ్లలో పై మూడుతరాలు, కింది మూడుతరాలు ఎలాంటివాళ్లో ఘాటైన పోలీసుభాషలో తనకు తానే చెప్పుకున్నాడు.

ఆ తర్వాత చలికి ఒణికిపోతున్న చేతులను రాపాడించడం మొదలుపెట్టాడు. ఆ చివర ఉన్న టీ దుకాణంవైపు గబగబా నడిచాడు. టీ బంక్ ఖాళీగా ఉంది. ఆ మూల ఒక యువకుడు కూర్చుని టీ తాగుతున్నాడు. దుకాణం ఓనరు ఒక బెంచిపై కునికిపాట్లు పడుతున్నాడు. తన చేతిలో లాఠీ శబ్దం వచ్చేలా టేబుల్‌పై పడేశాడు నరసింహం. దుకాణం ఓనరు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ఒరేయ్! నిద్రముఖం నాయాలా! నిద్రపోతుంటే యాపారం ఎలా సాగుద్ది?"

"సలిగాలికి కళ్లు మూతలు పడుతున్నాయయ్యా! సెకండ్ షో వదలాలని చూస్తున్నా. లేకపోతే మూసేద్దును!"

"ఒక స్ట్రాంగ్ టీ ఇవ్వరా! తాగితే రెండురోజులదాకా నిద్ర రాకూడదు!"

టీ బంక్ ఓనరు టీ కలపడంలో మునిగిపోయాడు. ఒక టేబుల్‌ముందు కూర్చున్న నరసింహం యాథాలాపంగా ఎదురుగా ఉన్న మూడంతస్తుల భవనంవైపు చూశాడు.

సరిగ్గా అదే సమయంలో ఒక అంబాసిడర్ కారు విపరీతమైన వేగంతో వచ్చి ఆ భవనం ముందు సడెన్‌బ్రేక్‌తో ఆగింది. ఆ కారునుండి నలుగురు దృఢకాయులు కిందకు దిగారు. ముఖాలకు పలుచని రబ్బరు తొడుగులు తొడుక్కున్నారు. ఒకడు మాత్రం కారు దగ్గర నిలబడ్డాడు. మిగిలినవాళ్లు ఇంటిలోకి వెళ్లిపోయారు. వాళ్లు మెట్లు ఎక్కుతున్న గుర్తుగా శబ్దం వినబడసాగింది.

నరసింహానికి తను చూస్తున్నదేమిటో అర్థం కాలేదు. ఎవరువాళ్లు? ఆ ఇంటికి ఎందుకు వచ్చారు? ముఖాలకు ఆ రబ్బరు తొడుగులేమిటి? ఆశ్చర్యంగా టీ బంక్ ఓనర్ ముఖంలోకి చూశాడు. అయితే ఆ శాల్తీ అంతకు రెట్టింపు ఆశ్చర్యంలో ఉంది.

వెంటనే ఇంకో గమ్మత్తైన సంఘటన జరిగింది. అంతవరకు సమాధిలో తాపసిలా కూర్చున్న ఆ యువకుడు జూలు విదిల్చి లేచే సింహంలా లేచి కాటందుకోబోయే తాచులా కదిలాడు. ఆ కదలికలు చూస్తూనే నరసింహానికి ఆ యువకుడెవరో గుర్తుకు వచ్చింది. సింధూర్! జాతీయ హెవీ వెయిట్ బాక్సర్. కొద్దికాలం క్రితం ప్రతిపేపరులోనూ హెడ్‌లైన్స్ ఆక్రమించిన మొనగాడు.

పరుగున వెళ్లి కారు బోనెట్‌పైనుండి అవతలకు ఒక్క దూకు దూకాడు సింధూర్. అక్కడ నిల్చున్న వ్యక్తి కదిలేలోగా బిగుసుకున్న సింధూర్ పిడికిలి ఒక బలమైన పంచ్ డెలివర్ చేసింది. బుల్‌డోజర్ ఢీకొన్నట్లు నాలుగడుగుల దూరంలో పడ్డాడా వ్యక్తి. పడ్డవాడు మళ్లీ లేవలేదు. మేడమెట్ల వెంబడి పైకి పరుగెత్తాడు సింధూర్.

అక్కడే నిలబడి ఇదంతా చూస్తున్న నరసింహానికి విపరీతమైన ఆవేశం వచ్చేసింది. తనంత పెద్ద రక్షకభటుడు ఇక్కడ ఉన్నాడే? నిలబడి చూస్తున్నాడే? ఏమాత్రమైనా భయముందా వీళ్లకు? చేతిలో లాఠీ గట్టిగా పట్టుకుని లోపలకు పరుగెత్తాడు.

చాలా మాడ్రన్‌గా ఉందా బంగళా. ఒకవైపు మెట్లు ఉన్నాయి. మరోవైపు ఎలివేటర్ ఉంది. అంతకుముందు వెళ్లిన వాళ్లంతా మెట్లపైనుండే వెళ్లారు. అందువల్ల తను కూడా అటే వెళ్లాడు.

రెండో అంతస్తు కింద మెట్లపై పడుకుని ఉన్నాడు సింధూర్. అతనిచేతి లోని పిస్టల్ పైనున్న గదివైపు ఆకలిగా చూస్తోంది. నరసింహం అతన్ని సమీపిస్తుండగానే మెరుపులా వెనక్కు తిరిగాడు. అతిప్రయత్నంపైన ట్రిగ్గర్ నొక్కకుండా ఆగినట్లు అతని ముఖకవళికలు చెప్పకచెబుతున్నాయి.

అదే సమయంలో రెండు బుల్లెట్లు నరసింహం తలమీదుగా కందిరీగల్లా చప్పుడు చేసుకుంటూపోయాయి. "గెట్ డౌన్! గెట్ డౌన్!" ఆందోళనగా అరిచాడు సింధూర్.

వెంటనే మెట్లపై పడుకున్నాడు నరసింహం. అక్కడనుండి ఎదురుగా ఉన్న గది క్లియర్‌గా కనబడుతుంది.

"ఏం జరిగింది?" అడిగాడు నరసింహం.

"లోపల ఉన్నవాళ్లను చంపేసినట్లున్నారు. వాళ్ల పారిపోకుండా నేను అడ్డం కొట్టాను!"

"వాళ్ల దగ్గర ఆయుధాలున్నాయా?"

"ఒకడి దగ్గర మాత్రం రివాల్వర్ ఉంది. మిగిలినవాళ్ల దగ్గర కత్తులున్నాయి."

"రివాల్వర్ ఉన్నవాడిని పడగొట్టగలిగితే మిగిలినవాళ్లను ఆపవచ్చు!" చెప్పాడు

నరసింహం.

తల ఊపాడు సింధూర్. అతడు అదే ఆలోచిస్తున్నట్లున్నాడు.

"కదలకుండా అలాగే కూర్చో! నీ దగ్గర రివాల్వర్ ఉన్న భ్రమ కలగాలి. పది నిముషాలలో అటోఇటో తేల్చివేస్తాను!" చెప్పాడు సింధూర్.

కదలకుండా చేతిలో లాఠీ గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు నరసింహం. అతని గుండె భయంతోనో, లేక ఉద్వేగంతోనో విపరీతమైన వేగంతో కొట్టుకోసాగింది. లోపల ఉన్న దుండగులకు తన దగ్గర ఏ ఆయుధం లేదని తెలిస్తే మరుక్షణం బయటకు వచ్చి పడతారు. నిర్దాక్షిణ్యంగా తనను చంపే స్తారు.

ఒక్కొక్క నిముషం భారంగా, అతి నెమ్మదిగా నడుస్తున్నట్లు ఉంది.

సరిగ్గా అయిదు నిమిషాల తర్వాత కనిపించాడు సింధూర్. మెట్ల దగ్గర ఉన్న గదికి పైభాగాన రెయిలింగ్‌కు కాళ్లు చుట్టి తలకిందులుగా వేలాడుతున్నాడు. అతని చేతిలో పిస్టల్ ఎలర్ట్‌గా ఉంది. మూడో అంతస్తుపై రెయిలింగ్ సరిగ్గా ఆ గదిపైనే ఉంది. సింధూర్ ఎలివేటర్ గుండా అక్కడికి చేరి ఉండాలి. ఆ ఇనుపవూచలకు కాళ్లు మెలిపెట్టి తలకిందులుగా వేలాడుతున్నాడు.

మతిపోయినట్లయి పిచ్చిగా చూడసాగాడు నరసింహం. ఏమాత్రం పట్టు తప్పినా సింధూర్ బతికే అవకాశం లేదు. ఎందుకంటే ఆ పరిస్థితిలో తల ముందుగా భూమిని తాకుతుంది.

జాగ్రత్తగా వేలాడుతూనే పిస్టల్ పొజిషన్‌లోకి తెచ్చాడు సింధూర్. కానీ అతను ఎయిమ్ తీసుకునేలోగా లోపలి వాళ్లు అతన్ని చూస్తే చాలా తేలికగా షూట్ చేసేస్తారు.

ఒక్క క్షణం తటపటాయించాడు నరసింహం. మరుక్షణం అన్నింటికీ తెగించి లేచి నిలబడ్డాడు. వెంటనే ఆ గదిలో రివాల్వర్ పట్టుకున్న వ్యక్తి నరసింహానికి గురిపెట్టాడు.

* * *

అది ఒక స్లమ్ ఏరియా. చిన్న చిన్న రేకులషెడ్డులతోనూ, పూరి గుడిసెలతోనూ, మురికి కాలవలతోనూ నరకం అంటే అర్థం చెప్పేలా ఉంది. ఆ కాలనీ మొదట్లో తన జీపు అపాడు దత్తాత్రేయ. అక్కడనుండి నడక ప్రారంభించాడు.

యముడి విగ్రహాన్ని ఎవరో దొంగిలించడం అక్కడి ప్రజలను నిశ్చేష్టులను చేసింది. కొంతమంది పత్రికా విలేఖరులు కల్పించుకోవడంతో ఆ సమస్య రాష్ట్రమంతటా తెలిసింది. అయితే అది అక్కడితో ఆగిపోలేదు. దేవాలయంలోనుండి ఆ విగ్రహం మాయంకావడం అరిష్టమని, ఆ మృత్యుదేవతకు ప్రత్యేక పూజలు లేకపోతే ప్రజలపై పడతాడని, ఆ విగ్రహం బయట ప్రపంచంలో ఎక్కడ ఉంటే అక్కడ రక్తపుటేర్లు ప్రవహిస్తాయని వదంతులు వ్యాపించాయి. ఇంకా కొందరైతే తుఫానులు వస్తాయని, అగ్నిప్రమాదాలు సంభవిస్తాయని చెప్పుకోసాగారు. కాలాంతకుడు తన మృత్యుక్రీడ ప్రారంభిస్తాడని, ఆ రక్తపిపాసి ప్రజల రక్తం బలి కోరతాడని పుకార్లు రేగాయి. ఈ వివరాలన్నీ పేపర్లలో రావడంతో రాష్ట్రంలో ఏ మూల చూసినా ఈ విషయమే చర్చనీయాంశమైంది. దాంతో పోలీసుడిపార్ట్‌మెంట్ మెడపై కత్తి అయింది సమస్య.

ఈ కేసుపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయను ప్రత్యేకంగా నియమిం చారు. ఆరడగుల రెండంగుళాల ఎత్తు, ఆ ఎత్తుకు తగ్గ లావుతో హుందాగా ఉండే దత్తాత్రేయ డిపార్ట్‌మెంట్‌లో చాలా చురుకైనవాడని పేరు.

ఒళ్లంతా మట్టికొట్టుకుని, చింపిరి తలలతో అశుభ్రంగా ఉన్న కొంతమంది భావిభారత పౌరులు అక్కడ ఆడుకుంటున్నారు. వాళ్ల దగ్గరగా వెళ్లి ఆగాడు. ఆ పిల్లలు అతనివంక వింతగా చూశారు. దత్తాత్రేయ మఫ్టీలో వచ్చాడు. అదే యూనిఫాంలో వస్తే ఆ పిల్లలు అలా నిలబడేవారు కాదు.

యూనిఫాం కనబడగానే పారిపోవడం వాళ్లకు జన్మతః వచ్చిన విద్య. వాళ్ల తాతతండ్రులు చిన్నాచితకా దొంగలు కావడంతో పోలీసువాసన తగిలితే పిల్లిని చూసిన ఎలుకల్లా పరుగెత్తుతారు. దత్తాత్రేయ మామూలు డ్రెస్‌లో ఉండడంతో వాళ్ల కంటికి ఒక పాసింజర్‌లా కనబడ్డాడు.

"సోమూ ఇల్లెక్కడ?" ఖంగుమనే కంఠంతో అడిగడు దత్తాత్రేయ.

మామూలు పిల్లలయితే ఆ గొంతు వినగానే భయపడి ఏడుపు అందుకుంటారు. కానీ ఆ పిల్లలు అసలు జంకలేదు. తమను కానట్లు నిలబడ్డారు.

దత్తాత్రేయ జేబులోనుండి కొన్ని పైసలు తీసి వాళ్ల కళ్లముందు గలగలలాడించాడు. వెంటే వాళ్లలో చలనం వచ్చింది. "తూర్పు వైపు ఆ చివరగా ఉన్న ఇల్లు!" అందరూ కూడబలుక్కున్నట్లు అన్నారు.


తన చేతిలోని నాణాలను వాళ్లపైకి విసిరివేశాడు. ఎంగిలి ఆకులపైకి దూకే కాట్లకుక్కల్లా ఒకరిపైన ఒకరు పడ్డారు.

సోమూ ఒక విచిత్రమైన క్రిమినల్. రకరకాల నాణాలు, పురాతన వస్తువులు సేకరించి అమ్మేవాడు. శాతవాహనులకాలంనాటి నాణాలు, ఎలిజబెత్‌రాణి గౌను, న్యూటన్ జ్ఞానదంతం, మార్లిన్‌మన్రో బ్రా ... ఒక్కటేమిటి అన్నీ సేకరించి అమ్మేవాడు. అందులో చాలా భాగం ఫేక్ కలెక్షన్స్. అసలు వాటికి ఏమాత్రం తీసిపోయి నకిలీలు. వాటితో అతని ఆదాయం కూడా బాగానే ఉండేది. మనిషి మంచి మాటకారి కావడంతో ఫారినర్స్‌ని అతి తేలికగా ట్రాప్ చేయగలిగేవాడు.

అయితే వయసుతోపాటు ఆశ కూడా పెరగడంతో కృష్ణదేవరాయల పిడిబాకు అంటూ ఒక కత్తి మ్యూజియం వాళ్లకు అంటగట్టబోతూ దొరికిపోయాడు. ప్రస్తుతం సోమూ చిన్న చిన్న బొమ్మలు తయారుచేసి అమ్ముకుంటూ బతుకుతున్నాడు. క్రిమినల్స్‌కి కావలసిన సమాచారం కూడా అమ్ముతున్నాడంటారు.

అతను క్రిమినల్‌లైఫ్‌కు స్వస్తి చెప్పినట్లు భావించడంతో అతడు పోలీసు రికార్డులలో ప్రస్తుతం లేడు. ఉండాలని సోమూ కూడా కోరుకోవడంలేదు. అటువంటి సోమూకు ఆ రోజు పొద్దుటే హఠాత్తుగా పోలీసువాసన తగిలింది. అతను ఆశ్చర్యపోతూండగానే దత్తాత్రేయ తలుపు బలంగా గెంటుకుంటూ లోపలకు వచ్చేశాడు.

అతనిని చూడటం సోమూకు అదే మొదటిసారి. కానీ అతడు లోపలకు వచ్చిన పద్ధతిలోనే అతనెవరో సోమూకు తెలిసిపోయింది.



సోమూ వయసు దాదాపుగా డెబ్బై చేరుతోంది. నున్నగా మెరిసే బట్టతలతో, పొట్టిగా, బలంగా ఉంటాడు. అతని పిల్లికళ్లు వింతగా మెరుస్తుంటాయి.

"హలో, మిస్టర్ దత్తాత్రేయా! మీలాంటి మంచి పోలీస్ ఆఫీసరు నా ఇంటికి రావడం నిజంగా నా అదృష్టం. నా సహాయం ఏమైనా కావలసి వచ్చారా?" అడిగాడు సోమూ.

ఆ అతివినయం వెనుక దుర్మార్గం, ఆ చిరునవ్వు వెనుక క్రూరత్వం దాగి ఉన్నాయని దత్తాత్రేయకు తెలుసు.

"సూటిగా విషయంలోకి వస్తున్నాను, సోమూ! కోటిలింగం కొన్ని రోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. ఎందుకు?"

"మామూలుగా ఫ్రెండ్లీ విజిట్, సార్! ప్రత్యేకంగా ఏమీ లేదు. ఆ విషయం కనుక్కోవడానికి పనిగట్టుకుని వచ్చారా, సాబ్! కాకితో కబురు పంపితే నేనే వచ్చేవాడిని కదా?"

"వెధవ కబుర్లు చెప్పడం ఆపెయ్, సోమూ! నాకు పూర్తి నిజాలు కావాలి."

"నాకు ఏ విషయం గురించి నిజాలు తెలియవు, సాబ్!" అదే పద్ధతిలో చెప్పాడు సోమూ.

మాట్లాడలేదు దత్తాత్రేయ. రెండు నిమిషాలు తదేకంగా సోమూనైపే చూస్తూ నిలుచున్నాడు. ఆ తర్వాత సడెన్‌గా కదిలాడు. ఏం జరుగుతోందో సోమూకు తెలిసేలోగా అతని శరీరం బుల్‌డోజర్ కింద పడ్డట్లయింది.

"ఒక ముసలివాడిని పట్టుకుని మీరు ఇలా కొట్టడం న్యాయం కాదు, సాబ్!" వగరుస్తూ అన్నాడు సోమూ.

పిడికిలి బిగించి అతని ముఖంపై గుద్దాడు దత్తాత్రేయ. సోమూ ముక్కుదూలం విరిగినట్లయింది. రక్తం కారుతున్న ముక్కును రెండు చేతులతో కప్పుకుంటూ కూలబడ్డాడు.

"చెబుతాను...చెబుతాను ..." గొణిగాడు సోము.

అతని పక్కనే కూర్చున్నాడు దత్తాత్రేయ. మాట్లాడకుండా సిగరెట్ వెలిగించుకున్నాడు.

"కోటిలింగం ఒక విగ్రహం కావల్సివచ్చి నా సహాయం అడిగాడు. నన్ను ఒక దేవాలయంలోని యముడి విగ్రహానికి డూప్లికేట్ తయారుచేసి ఇవ్వమన్నాడు. నా వల్ల కాదన్నాను. అప్పుడు అసలు విగ్రహాన్ని దొంగతనం చెయ్యదలుచుకుని సదాశివంతో కలిసి ప్లాన్ చేశాడు."

"అది నాకు తెలుసు. ఇప్పుడు ఆ విగ్రహం ఎక్కడ ఉందో తెలుసా?"

"నాకు తెలియదు, సాబ్! కోటిలింగం చచ్చిపోయాడు. ఇక సదాశివం దగ్గరే ఉండాలి."

"ఆ సదాశివం ఎక్కడ దొరుకుతాడు?"

"వాడు ఒక క్రిమినల్, సాబ్! క్రిమినల్స్‌కు ఒక చోటంటూ ఉండదు."

"నిజం చెప్పు, సోమూ! నేను చాలా అర్జంటుగా సదాశివాన్ని కలవాలి."

మాట్లాడలేదు సోమూ. అసహనంగా కదిలాడు దత్తాత్రేయ. తన చేతిలో వెలుగుతున్న సిగరెట్‌ని సోము బట్టతలపై నొక్కి ఆర్పాడు. బడితె దెబ్బతిన్న పందిలా అరిచాడు సోమూ.

"చెప్పు! లేకపోతే నీ నాలుక తెగ్గోసి ఫ్రై చేసి నీ చేతే తినిపిస్తాను!" కటువుగా చెప్పాడు దత్తాత్రేయ.

"అతను ఎక్కడ ఉంటాడో నాకు తెలియదు, సాబ్! కానీ అతనికి ఒక అమ్మాయితో సంబంధం ఉంది. ఆమెకు అతని అడ్రస్ తెలియవచ్చు. ఎందుకంటే ఆమెకోసం సదాశివం ప్రాణలైనా ఇచ్చేస్తాడు" ఒక కాగితంపై అడ్రస్ రాసి ఇస్తూ చెప్పాడు సోమూ.

ఆ కాగితం తీసుకుంటూనే అక్కడి నుండి మాయమైపోయాడు దత్తాత్రేయ.

* * *

తన పని అయిపోయిట్లే భావించాడు నరసింహం. కళ్లు మూసుకుని దూసుకువచ్చే బుల్లెట్ కోసం ఎదురుచూడసాగాడు. అయితే అతను ఊహించినదానికంటే ముందే సింధూర్ చేతిలో పిస్తోలు గర్జించింది.

బుల్లెట్ వాడి గొంతులో దిగిపోయింది. అతని చేతిలో రివాల్వర్ నేలపై పడి ఖంగున శబ్దం చేసింది. ఆ వెనుక వాడి శరీరం దబ్బుమనే శబ్దంతో నేలపై పడిపోయింది. లోపల ఉన్న మిగిలిన ఇద్దరికీ మతిపోయింది. విపరీతమైన వేగంతో బయటకు వచ్చేశారు. నరసింహాన్ని గెంటుకుంటూ కిందకు వెళ్లిపోయారు.

ఒకడి భుజంపై వేలాడుతున్న అమ్మాయిని చూశాడు నరసింహం. కింద కారు స్టార్టయిన శబ్దం వినపడింది.

కాస్సేటికి సింధూర్ కిందికి దిగి వచ్చాడు. అతని వెనుకే ఆ గదిలోకి ప్రవేశించాడు నరసింహం. లోపలి దృశ్యం చూస్తూనే కొయ్యబారిపోయాడు. చాలా బీభత్సంగా ఉందా గది. సోఫాలో ఒక ముసలాయన బుల్లెట్ గాయాలతో పడి ఉన్నాడు. నేలపై ఇద్దరు చిన్నపిల్లల శరీరాలు పడి ఉన్నాయి. పదేళ్ల వయస్సుండే ఆ పిల్లల తలలు కొంచెం దూరంలో పడి ఉన్నాయి. ఆ దృశ్యం చూస్తూంటే కడుపులో తిప్పుతున్నట్లు ఉంది.

"మీరు బాక్సర్ కదూ?" అడిగాడు నరసింహం.

"అవును, ఫ్రెండ్! నా పేరు సింధూర్!"

"మరి ఈ బీభత్సమేమిటండీ?"


"ఒక స్మగ్లర్ ముఠాకు చెందిన అతి ముఖ్యమైన రహస్యం ఆ అమ్మాయికి తెలుసు. అందుకోసం మొత్తం కుటుంబాన్ని హతమార్చి ఆ అమ్మాయిని ఎత్తుకుపోయారు. ఆ అమ్మాయిని రక్షిద్దామనే వచ్చాను. కానీ లాభం లేకపోయింది."

"ఆ అమ్మాయి పేరేమిటి, సార్?"

"కైవల్య."

"మీరు అర్జంటుగా ఇక్కడినుండి వెళ్లిపొండి, సార్! నా పై అధికారులు వస్తే మీరు బయటపడలేరు!" చెప్పాడు.

విసురుగా తల తిప్పి నరసింహం వైపు చూశాడు సింధూర్.




## పొగాకుపురాణం

భారతదేశం జనాభా 90 కోట్లమందిలో 25 కోట్లమంది చుట్టా, బీడీ, సిగరెట్టు కాలుస్తున్నారు. 'గుట్కా'రూపంలో పొగాకు నములుతున్నారు. వీరిలో 15 సంవత్సరాల వయసు యువకులు ఎక్కువమంది ఉండటం విశేషం! 'పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్' అని గిరీశం చెబితే, మరి తాగిన వాళ్లలో ఏటా 30 లక్షలమంది జీవితం మధ్యలో తనువు చాలించి స్మశానానికి చేరుతున్నారు. వారి కుటుంబాలు నడిరోడ్డున పడుతున్నాయి. పొగ తాగడంవల్ల గుండెజబ్బులు, ఊపిరి తిత్తుల వ్యాధులు, కాన్సర్ మొదలైన రోగాలకు ఎందరో బలైపోతున్నారు. ఈ రోజులలో గుట్కా నమలడం యువతీయువకులలో ఒక ఫాషన్‌గా తయారయింది. ఫలితంగా పలువురు నోటికాన్సర్ వ్యాధిని కొని తెచ్చుకుంటున్నారు. పలు రాష్ట్రప్రభుత్వాలు బహిరంగస్థలాలలో గుట్కాను నమలడం నిషేధించాయి. మద్యపానంకన్నా ప్రమాదమైనది పొగాకు నమలడం అని మన వైద్యులు హెచ్చరిస్తున్నారు.

\- కృష్ణాజీ

"వీళ్లు విక్రమ్ మనుషులు సార్! పోలీస్‌డిపార్ట్‌మెంటులో విక్రమ్ మోచేతి నీళ్లు తాగేవాళ్లు చాలామంది ఉన్నారు. తప్పయినా, ఒప్పయినా విక్రమ్ మనిషిని చంపారు మీరు. దొరికితే మిమ్మల్ని పోలీసుస్టేషన్‌లోనే చంపేస్తాడు విక్రమ్!"

"కానీ నువ్వు నాకెందుకు సహాయం చేస్తున్నట్లు ...?"

"నా శత్రువు, మీ శత్రువు ఒకడే సార్! కొన్ని సంవత్సరాల క్రితం నా కుటుంబానికి కూడా ఇదే గతి పట్టించాడు."

"కైవల్యను ఎక్కడికి తీసుకువెళ్లి ఉండవచ్చు?" అడిగాడు సింధూర్.

"విక్రమ్ గుర్చి మీకు కరెక్ట్ ఇన్‌ఫర్మేషన్ ఇవ్వగల వ్యక్తి ఒక్కడే ఉన్నాడు, సార్! బెన్ని అనే కెమెరామెన్."

"బెన్ని స్టూడియో ఓనరేనా?"

"అవును, సార్! అతను మీకు తెలుసా?"

"ఒకసారి పరిచయమయ్యాడులే!" చెబుతూనే బయటకు పరుగెత్తాడు సింధూర్.

అతను వెళ్లినవైపు, ఆ తర్వాత గదిలో శవాలవైపు చూసి తల విదిలించాడు నరసింహం.

+++

అంగకు రెండు మెట్లు చొప్పున గబగబా ఎక్కి రెండో అంతస్తులో ఉన్న బెన్ని స్టూడియోముందుకు చేరుకున్నాడు సింధూర్.

గుమ్మానికి పైన పెద్ద పెద్ద అక్షరాలతో 'బెన్ని ఫోటోస్టూడియో' అని రాసి ఉంది. ఫొటోగ్రాఫిక్ ప్రపంచంలో అతనికి తెలియనిది చాలా తక్కువ.

ముందు గదిలో రిసెప్షన్ టేబుల్‌ముందు ఒక పదిహేను సంవత్సరాల కుర్రాడు కూర్చున్నాడు.

"బెన్ని ఎక్కడ?" అడిగాడు సింధూర్.

వాడు మాట్లాడకుండా లోపలికి చెయ్యి చూపించాడు.

"లోపల గుడ్లు పెడుతున్నాడా?" నవ్వుతూ అడిగాడు సింధూర్.

ఆ కుర్రవాడి కనుబొమలు ఒకసారి పైకి లేచి కిందకు దిగాయి. వాడు మాట్లాడట్లేదు. కుడిచేతిని సున్నాలా చుట్టి కంటి దగ్గర పెట్టుకున్నాడు. ఆ తర్వాత లోపలకు చూపించాడు. సింధూర్ జాలిగా చూశాడు వాడివైపు. వాడు మూగవాడని అర్థమైంది.

ఆ గదిలోనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు సింధూర్. అతని పక్కనేమరో కుర్చీలో ఒక అందమైన అమ్మాయి కూర్చుని ఉంది. బిగుతైన స్కర్ట్ ఆమె ఒంటి సొంపులను దాచడానికి విఫలప్రయత్నం చేస్తోంది. నల్లటి పొడవైన ఆమె జుట్టు, తేనెరంగు కళ్లు, తేనెలూరే పెదవులు ... మగవాడిని రెచ్చగొట్టే అందం ఆమెది.

"బెన్నికి మోడల్‌గా పనిచేస్తున్నారా?"

"అవును. మరి మీరు ...?" కుతూహలం కళ్లలో మెరుస్తుండగా అడిగింది.

"నేనా?" చిన్నగా నవ్వాడు. తన కుర్చీ ఆమె దగ్గరకు లాక్కున్నాడు. ఆ తర్వాత చెప్పాడు - "బెన్నీ నా స్నేహితుడు. సరదాగా చూద్దామని వచ్చాను. నా పేరు సింధూర్."

"నా పేరు నిశ్చల. బెన్నీకి దాదాపు నెలకొకసారి వ్యాపారం చేస్తుంటాను. ఈమధ్య పోటీ ఎక్కువయిందిలెండి. కాస్త కొలతలు బాగున్న ప్రతి అమ్మాయీ కెమెరా ముందుకు వచ్చేస్తోంది."

సరిగ్గా అదే సమయంలో తుఫానుగాలికి దడదడలాడినట్లు లోపల గది తలుపు విసురుగా తెరుచుకుంది. భూకంపం వచ్చినట్లు ఆ గది కిందమీదులైంది. తేరుకుని చూసేసరికి గున్నఏనుగు తొండం ఊపుతూ వచ్చినట్లు బెన్ని చెయ్యి ఊపుతూ వచ్చేస్తున్నాడు.

బెన్ని సాధారణంగా అలాగే వస్తాడు. పాపం కొత్తవాళ్లయితే ఆ భారీకాయాన్ని నోరు తెరుచుకుని అలా చూస్తూ ఉండిపోవలసిందే!

"హల్లో, సింధూర్! మై ఫ్రెండ్! ఎంత కాలానికి కనిపించావు?" రెండు చేతులూ చాపి బొజ్జ ఊపుకుంటూ ముందుకు వచ్చాడు బెన్ని. అది ధృతరాష్ట్రుడి కౌగిలి. ఎముకలు పిండిపిండి అయిపోవలసిందే.

"బెన్ని! నీ గర్ల్ ఫ్రెండ్ నీ కోసం ఎదురుచూస్తోంది." వెనక్కి జరిగి నిశ్చలవైపు చూపిస్తూ చెప్పాడు సింధూర్.

"ఓ, స్వీటీ! ఈ రోజు షూటింగు లేదు. నా ఫ్రెండ్‌తో మాట్లాడాలి. ఈరోజుకు ఫీజ్ తీసుకుని వెళ్లిపో! రేపు ఇదే సమయానికి ఇక్కడకు రా!" చెప్పి సింధూర్ చెయ్యి పట్టుకుని లోపలకు నడిచాడు బెన్ని.

లోపల గది స్టూడియోరూమ్. పెద్దపెద్ద స్క్రీన్లు, లైట్లు, ఫొటోగ్రాఫిక్ సరంజామాతోపాటు ఒక కింగ్‌సైజ్ బెడ్ కూడా ఉంది.

"బ్లూ ఫిలిమ్స్ తీస్తున్నావా?" బెడ్‌వైపు చూస్తూ అడిగాడు సింధూర్.

"కాదు బాస్, మాడలింగ్‌లో కూడా ఒక్కోసారి తప్పనిసరిగా కావాలి!"

"సరే బెన్నీ, నీ సహాయం కావలసి వచ్చాను."

"నా సహాయమా! మైగాడ్! అడుగు, బాస్!"

బెన్నికి సింధూర్ వృత్తి గురించి బాగా తెలుసు. బాక్సింగ్ ఫైటర్‌గా అతని పేరు ప్రఖ్యాతులు కూడా తెలుసు. అటువంటివాడు తన సహాయం కోసం రావడం బెన్నికి ఆశ్చర్యంగా ఉంది.

"బెన్నీ! నాకు తెలిసిన ఒక అమ్మాయిని కిడ్నాప్ చేశారు. ఎవరు చేశారో కూడా నాకు తెలుసు. కానీ వాడు ఎక్కడ ఉంటాడో తెలియదు. నీకు తెలిసి ఉండాలని వచ్చాను."

"భలేవాడివే, బాస్! కిడ్నాపర్స్‌కు ఒక స్థావరం అంటూ ఉండదు. పనిబట్టి ప్లేస్ మారుతుంది!"

"ఈ పని చేసింది ఒక పెద్ద ముఠా. పైగా వాళ్లు ఆ అమ్మాయి నుండి ఒక రహస్యం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు."


"ఏమిటి బాస్?"

"అది మాత్రం అడగకు!"

"పోనీ ఎవరు కిడ్నాప్ చేశారో తెలుసా?"

"విక్రమ్."

తన పక్కన హైడ్రోజన్‌బాంబు పడ్డా అంత అదిరిపోయేవాడు కాదేమో బెన్ని.



వేసవికాలపు మండుటెండలో నిలబడ్డవాడిలా నిలువెల్లా చెమటతో తడిసిపోయాడు. "వద్దు, బాస్! విక్రమ్ దారికి అడ్డు నిలబడితే బతకలేం. నా మాట విను! వాడి జోలికి వెళ్లొద్దు!" ప్రాథేయపడుతూ అన్నాడు బెన్ని.

"ఒక ఆడపిల్ల ప్రమాదంలో ఉంది, బెన్నీ! పైగా నేను అక్కడ ఉండగానే ఎత్తుకుపోయి నన్ను ఛాలెంజ్ చేశారు. వాళ్లని వదిలే సమస్యే లేదు!"

బెన్ని మౌనంగా ఉండిపోయాడు.

"బెన్నీ! ఇందులోకి నిన్ను లాగను. వాడు ఆ అమ్మాయిని ఎక్కడ దాస్తాడో చెప్పు, చాలు! నువ్వు చెప్పినట్లు ఎవరికీ చెప్పను!"

అప్పటికీ మాట్లాడలేదు బెన్ని. చాలాసేపు బతిమాలాడు సింధూర్. చివరికి ఇక ఫలితం లేదని వచ్చేస్తుంటే ఆపాడు బెన్ని.

"విక్రమ్‌కు ఒక స్టూడియో ఉంది, బాస్! తను చేసే బ్లూ ఫిలిమ్ వ్యాపారానికి కవర్‌గా ఒక హైక్లాస్ స్టూడియో మెయిన్‌టైన్ చేస్తున్నాడు. అయితే అతనికి బ్లూ ఫిలిమ్ వ్యాపారం ఒకటే కాదు. ఇంకా చాలారకాల వ్యాపకాలు ఉన్నాయి. స్మగ్లింగ్, దొంగనోట్లు ముద్రించడం.., ఒకటేమిటి ఎక్కడ ఎలా డబ్బు వస్తే అక్కడ అలా విక్రమ్ ఉంటాడు!"

"ఆ స్టూడియో అడ్రెస్ చెప్పు!"

"కానీ, ఆ అమ్మాయిని విక్రమ్ మనుషులు కిడ్నాప్ చేసి ఉంటే ఈపాటికి ఆ పిల్ల బతుకు తెల్లారిపోయి ఉంటుంది, బాస్!" స్టూడియో అడ్రెస్ చెబుతూనే ఈ మాట కూడా చెప్పాడు బెన్నీ.

అతనికి థాంక్స్ చెప్పి బయటకు నడిచాడు సింధూర్.

* * *

చీకటి పడుతుండగా బయటకు వచ్చాడు సింధూర్. టాక్సీలో దుర్గాఘాట్ చేరుకున్నాడు. ఇక అక్కడనుండి ఉంది అసలు వ్యవహారం. విక్రమ్ మనుషులకు గానీ, కాపలా తిరిగే బీట్ కానిస్టేబుల్స్‌కు గానీ కనపడకుండా బంగళాలో ప్రవేశించాలి.

ఆ సమీపంలోనే ఉన్న ఒక రిక్షా దగ్గరకు చేరాడు. రిక్షావాడు చలికి రిక్షాలో ముసుగుదీసుకుని పడుకున్నాడు. దగ్గరకు వెళ్లి వాడిని తట్టి లేపాడు సింధూర్. ఉలిక్కిపడి లేచాడు వాడు.

"విక్రమ్ బంగళాకు వస్తావా?"

తెల్లబోయి చూస్తున్నాడు రిక్షావాడు. మళ్లీ ఆ బంగళాను వర్ణించి చెప్పాడు సింధూర్.

"డైరెక్టర్స్ బంగళాకా?"

"అవును, వస్తావా?"

"ఇరవై రూపాయలవుతుంది." అది రాకరాక వచ్చిన అర్ధరాత్రి బేరం. అంత తేలికగా ఎలా వదులుకుంటాడు వాడు.

మాట్లాడకుండా ఎక్కి కూర్చున్నాడు సింధూర్.

"ఆ డైరెక్టర్ మీకు తెలుసాండీ?"

"అతను నా స్నేహితుడు. తెల్లవారేలోపు నేను అతన్ని కలవాలి. ఒక సినిమా విషయం గురించి మాట్లాడే పని ఉంది!" చెప్పాడు సింధూర్.

"ఆయన చాలారకాల సినిమాలు తీశారనుకుంటానండీ! ఇక్కడికి చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు వస్తూంటారు. ఆ తర్వాత వాళ్లను తీసుకుని ఎక్కడికో వెళ్లిపోతూంటారు. బహుశా ఔట్‌డోర్‌కనుకుంటాను."

"ఈమధ్యకాలంలో ఎవరైనా అమ్మాయి వచ్చిందా?" ఆత్రుతగా అడిగాడు సింధూర్.

"నాలుగురోజుల కిందట కొంతమంది అమ్మాయిలు వచ్చారండీ! బంగళాలోనే ఉండి ఉంటారు!" చెప్పాడు రిక్షావాడు.

అర్ధరాత్రి సమయానికి ఆ బంగళాముందు అతన్ని దించి డబ్బు తీసుకుని వెళ్లిపోయాడు రిక్షావాడు.

బంగళాముందు నిలబడి జాగ్రత్తగా పరిశీలించాడు. లోపల మనుషులున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ కుక్కలు కూడా ఉంటే తన ఉనికి బయటపడిపోతుంది. ప్రహరీగోడ దూకి వెళ్లడం కుదరదు. ఆ గోడ చాలా ఎత్తుగా ఉంది. పైగా కరెంట్ ఫెన్సింగ్ ఉంది. మరో మార్గం ఆలోచించాలి. సాలోచనగా చుట్టూ చూశాడు సింధూర్.

కొద్ది దూరంలో నేలపై డ్రైనేజి కనిపించింది. ఉత్సాహంగా అటు నడిచాడు. ఆ డ్రైనేజి మూతను రెండు చేతులతో బలంగా లాగాడు. ఊడి వచ్చిందది. లోపలకు దిగే ముందు మరోసారి ఆలోచించాడు.

ఆ డ్రైనేజి ఖచ్చితంగా బంగళాలోకి వెడుతుందని చెప్పలేం. ఆ డ్రైనేజి చాలాకాలంగా తెరిచి ఉండకపోవచ్చును. అందువల్ల లోపల ఏమైనా ఉండవచ్చు. గబ్బిలాల నుండి ఆలిగేటర్స్ దాకా ఏమైనా ఉండవచ్చును. కానీ ప్రస్తుతం అంతకంటే మార్గం లేదు.

తన పాంటుజేబు నుండి చిన్నసైజు టార్చిలైటు తీసి చేత్తో పట్టుకుని ఆ డ్రైనేజిలోకి దిగిపోయాడు సింధూర్. టార్చిలైటు వెలుగులో ముందుకు నడవసాగాడు.

ఆకుపచ్చని పసరుతో కూడిన ఆ నీరు భరించలేని వాసన వస్తోంది. ఆ వాసనకు కడుపులో తిప్పుతున్నా అలాగే ముందుకు సాగిపోయాడు. సడెన్‌గా ఒక మలుపు వచ్చింది. పైన ఉన్న ప్రదేశాన్ని ఒకసారి మనసులో గుర్తుకు తెచ్చుకున్నాడు.

బంగళాపక్కగా ఊళ్లోకి దారి ఉంది. ఈ మలుపు బహుశా దానిదే కావచ్చును. తిన్నగా వెళ్లేదే బంగళాలోకి వెడుతుంది. ముందుకు నడవసాగాడు సింధూర్. కొంతదూరం వెళ్లాక గుండ్రటి చక్రం ఒకటిపైన కనబడింది. దానిలో నుండి ఎలక్ట్రిక్ బల్బు వెలుగులోంది.

ఆ చక్రంలోనుండి బయటకు చూశాడు. ఎవరూ ఉన్నట్లు లేరు. ఆ ఇనుప చక్రాన్ని రెండు చేతులతో గట్టిగా పైకి నొక్కబోయాడు సింధూర్. అంతలో హఠాత్తుగా ఆ చక్రం పైభాగాన ఒక ఆకారం ప్రత్యక్షమైంది. చటుక్కున చేతులు వదిలేశాడు. బాలెన్స్ సరిగా లేక కింద బురదలో పడిపోయాడు.

ఆ చక్రం దగ్గరకు వచ్చింది ఒక డాబర్‌మెన్ జాతికి చెందిన కుక్క. శత్రువుల అలికిడి వాసన పట్టి ఆ ఇనుపచక్రం దగ్గరకు వచ్చింది. దాని కూడానే వచ్చాడు గార్డు. చేతిలోని పవర్‌ఫుల్ టార్చిలైటు వేసి మోకాళ్లపై వంగి లోపలకు చూశాడు. ఏమీ కనిపించలేదు.

చిన్నగా గుర్రుమన్న శబ్దం చేస్తూ అక్కడే గుండ్రంగా తిరగసాగింది. ఆ గార్డుకు ఏమీ అర్థం కాలేదు. ఒక్కోసారి ఏ గబ్బిలాన్నో చూసి ఆ కుక్కలు అలా ప్రవర్తిస్తాయి. బహుశా అంతే కావచ్చుననుకుని కుక్క మెడకున్న బెల్టు పట్టుకుని లోపలికి తీసుకుపోయాడు.

అలికిడి తగ్గాక బురద నీటిలోనుండి పైకి లేచాడు సింధూర్. తలనుండి కాళ్లదాకా బురదపట్టి ఉంది. కుక్కను తీసుకుని గార్డు దూరంగా వెళ్లాడన్న నమ్మకం కుదిరాక ఇనుప చక్రాన్ని బలంగా లాగాడు. ఒకవైపు బయటకు గొళ్లెం వేసి ఉంది.

## అంకెల మహత్తు!

తిమింగలాలు సముద్రాలలో హుషారుగా సంచరించే సమయాల్లో 'గానం' చేస్తాయట. ప్రతి 'స్వరం' మధ్య వ్యవధి ఖచ్చితంగా 128 సెకన్లు!!

✣ ✣ ✣

**1997లో** వెనిజులాలో జైళ్లలో బంధింపబడిన 336మంది ఖైదీలను జైలుకాపలాదారులూ, తోటిఖైదీలూ చంపేశారట!

చేతిలోని టార్చిని కన్నంలోనుండి బయటకు పోనిచ్చి గొళ్లెం మెల్లగా కదిపాడు. కదిలిందది. ఇంకొంచెం కదిపితే ఊడిపోతుందది. అయితే చివరకు లేపడం వల్ల టార్చిని రెండు వేళ్లతో పట్టుకోవాల్సివస్తోంది. అది ఏ క్షణానైనా చెయ్యి జారిపోయేలా ఉంది.

సడెన్‌గా గార్డు బూట్ల చప్పుడయింది. చెయ్యి కదపలేదు సింధూర్. చెయ్యి అకస్మాత్తుగా లాక్కుంటే గొళ్లెం చప్పుడవుతుంది. గార్డు బూట్ల చప్పుడు బట్టి బంగళా ముందు భాగానికి వెళ్లి ఉంటాడని ఊహించాడు. ఆ గార్డు బంగళా చుట్టూ తిరిగిరావడం పూర్తయ్యేసరికి తను బయటపడాలి!

వేళ్లతో టార్చి గట్టిగా పట్టుకుని గొళ్లెం జాగ్రత్తగా పైకెత్తాడు. ఊడిరాలేదది. చివరిదాకా వచ్చి వెనుకకు పడింది. ఇంకోసారి ప్రయత్నించాడు.

ఇంకోసారి .... మళ్లీ ఇంకోసారి ...

సింధూర్ ముఖంపై చిరుచెమటలు పట్టాయి. బురదవల్ల చేతి వేళ్ల పట్టు తప్పుతున్నాయి. గార్డు వచ్చే సమయం అయింది. చివరిసారిగా గట్టిగా పట్టుకుని పైకెత్తాడు. ఊడి వచ్చేసింది. రెండు చేతులతో దానిని పైకెత్తి బయటకు వచ్చేశాడు.

ఎదురుగా గార్డు నిలబడి ఉన్నాడు! అతని చేతిలో మెషిన్‌గన్ సింధూర్‌వైపు ఆకలిగా చూస్తోంది.

నిస్సహాయంగా భుజాలు ఎగరేశాడు సింధూర్.

* * *

బాక్సింగ్ మేటి వీరుడు మైక్‌టైసన్ మాటల్లో చెప్పాలంటే హెవీ వెయిట్ బాక్సింగ్‌కు సాటి మరొకటి లేదు. ఇందులో ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. హాస్యచిత్రానికెళ్తే నవ్వుకోబోతున్నామని, భయానకమైన సినిమా కెళ్తే భయపడతామని ముందే తెలుస్తుంది. అదే బాక్సింగ్ పోటీకెడితే మీ అభిమాన బాక్సర్ గతి ఏమవుతుందో చివరి నిముషందాకా తెలియదు. అదే ఇందులో ఉండే మజా.

ఎస్ ...! ఆ మజా కోసం మాత్రమే ఇక్కడ కొన్ని కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది.

బాక్సింగ్‌లో సాధారణంగా పోటీకి ముందే యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది. దానికి కారణం బాక్సర్లు తాము పాల్గొనబోయే ప్రతి పోటీకి ముందు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుతుంటారు. వాడిగా, వేడిగా వ్యాఖ్యలు చేస్తూంటారు.

కొద్దిరోజుల్లో సింధూర్, విల్లీఫోర్డ్‌ల మధ్య జరగబోయే పోటీ వార్తా పత్రికలలో ప్రముఖ స్పోర్ట్స్‌కాలమ్ అయింది. ఎటు చూసినా ప్రస్తుత ఛాంపియన్ విల్లీఫోర్డ్ మాటలే వినిపిస్తున్నాయి కానీ, అతని ప్రతి ద్వంది సింధూర్ వ్యాఖ్యలు వినబడటంలేదు.

ప్రస్తుతం అది పెద్ద చర్చనీయాంశం అయింది. కొంతమంది విల్లీఫోర్డ్‌కు భయపడి ఎక్కడో దాక్కున్నాడని ప్రచారం మొదలుపెట్టారు. సింధూర్ మేనేజర్ నంబియార్ మాత్రం సింధూర్ తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడని, పోటీలో పాల్గొంటాడని చెబుతున్నాడు.

నంబియార్‌కి కూడా మనసులో భీతిగానే ఉంది. ఎదుర్కోవలసిన ప్రత్యర్థి సామాన్యుడు కాడు. జాతీయంగానే కాక, అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు ఉన్నవాడు. పొరబాటు జరిగితే పెనాల్టీగా ప్రాణాలనే ఇవ్వవలసి ఉంటుంది. గెలిస్తే మాత్రం దేశం తరపున బాక్సింగ్‌వరల్డ్‌లోకి అడుగుపెట్టే కొత్త ధ్రువతార అవుతాడు. కానీ గెలుపు అంత సులభం కాదు.

బంగారు భవిత్యానికి తొలిమెట్టులాంటి ఈ పోటీని సింధూర్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాడు? నిరంతరం ప్రాక్టీస్ చేయవలసిన ఈ తరుణంలో ఎక్కడకు వెళ్లాడు?

నంబియార్ మనసులో రకరకాల ఆలోచనలు. దేనికీ స్పష్టమైన రూపం లేదు. ఎవరు చెబుతారు సింధూర్ అడ్రెస్? ఎక్కడ దొరుకుతాడు?

నంబియార్ మనసులో ఒక రూపం మెదిలింది. ఎస్ ... తెలిస్తే ఆయనకే తెలియాలి. ఆ ఒక్క వ్యక్తే ఖచ్చితంగా చెప్పగలడు.

జైలర్‌సాబ్ దగ్గరకు బయలుదేరాడు నంబియార్.

* * *

ఎదురుగా ఉన్న గార్డు చేతిలో మెషిన్‌గన్ చూస్తూనే ప్రాణాలపై ఆశ వదులుకున్నాడు సింధూర్. అనాలోచితంగా చిన్న చిరునవ్వు నవ్వాడు.

ఆ గార్డుకు తను చూస్తున్నది కలో, నిజమో తెలియలేదు. డ్రెయిన్‌లోనుండి ఒక బురదమనిషి పైకి వచ్చాడు. పైగా తనను చూసి నవ్వుతున్నాడు. నవ్వినప్పుడు నల్లని ఆకారంలో తెల్లనిపళ్లు కనబడి అతని ఒళ్లు జలదరించింది. ఏం చెయ్యాలో తోచక స్థాణువులా నిలబడిపోయాడు.

ఆయాచితంగా వచ్చిన ఆ అవకాశాన్ని సింధూర్ చక్కగా ఉపయోగించుకున్నాడు. తన చేతిలోని పెన్‌టార్చి అతని ముఖంపైకి విసిరాడు.

అసంకల్పితంగా రెండు చేతులూ ముఖానికి అడ్డుపెట్టుకున్నాడు గార్డు.

ఉల్కాపాతంలా విరుచుకుపడ్డాడు సింధూర్. బలంగా తన్నాడు ఆ గార్డు మోకాళ్లపైన. బాధతో అరవడానికి నోరు తెరిచాడతను. ఆ నోటిపై లాగిపెట్టి గుద్దాడు. ఆ వెంటనే అతని ముఖంపై ఒక అప్పర్‌పంచ్ ఫట్‌మని కట్ చేశాడు.

ఒకదాని వెనుక ఒకటిగా అన్ని దెబ్బలు పడితే మైక్‌టైసన్ అయినా తట్టుకోలేడు. పాపం, ఆ గార్డు ఎంత? మొదలు నరికినచెట్టులా కుప్ప కూలిపోయాడతను.

నేలపై పడిన మెషిన్‌గన్‌ను చేతిలోకి తీసుకున్నాడు సింధూర్. దాని అవసరం అంత ఉండకపోవచ్చును. అయినా ఫైట్ చేయాల్సిన అవసరం వస్తే వట్టి చేతులతో పోరాడటమే అతనికి ఇష్టం. మెషిన్ గన్‌ను డ్రెయిన్‌లోకి విసిరేశాడు.

ముఖానికి పట్టిన బురద వదిలించుకునే ప్రయత్నం చెయ్యలేదు సింధూర్. ఆ చీకటి రాత్రిలో భూతంలా ఉన్న మనిషిని చూస్తే ఎంత ధైర్యవంతుడికైనా గుండెలు జారిపోతాయి. చేతిలో ఆయుధం ఉన్నా ప్రయోగించడానికి ఆలోచిస్తాడు.

బంగళా లోపలకు నడిచాడు సింధూర్. ఎవరూ ఎదురవలేదు. జాగ్రత్తగా వెనుకా ముందూ చూసుకుంటూ లోపలకు నడిచాడు.

పెద్ద హాలు అది. ఒక ఓరగా గోడకు పెద్ద పెద్ద లైట్లు ఉన్నాయి. గది మధ్యలో గుండ్రని మంచం ఉంది. మంచానికి సమానమైన ఎత్తులో సీలింగ్‌కు ఒక అద్దం బిగించబడి ఉంది. అక్కడే కాదు, మంచానికి ఎదురుగా గోడలకు, తల వద్ద



ఒకటి, పాదాలవద్ద ఒకటి ఉన్నాయి.

ఆ మంచంపై ఒక యువతి, యువకుడు దాదాపు నగ్నంగా ఉన్నారు. వారికి కొంచెం దూరంలో సినిమా డైరెక్టర్స్ కూర్చునే కుర్చీలో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతని పక్కనే ఇంకొక వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని చేతిలో ఒక కొరడా ఉంది. వాళ్లు కాక, ఇంకా ఇద్దరు కెమెరా హేండిల్ చేస్తున్నారు.

చూస్తూనే తెలుస్తుంది అది బ్లూఫిలిమ్‌సెట్ అని. అదంతా గమనిస్తూ అక్కడే నిలబడ్డాడు సింధూర్. అరగంట పైగా జరిగిందా తతంగం. ఆ తర్వాత ఆ అమ్మాయిని తీసుకుని మరో గదిలోకి నడిచాడు కొరడావ్యక్తి.

అప్పుడు క్లియర్‌గా కనిపించిన ఆ అమ్మాయిని చూస్తూనే ఉలిక్కిపడ్డాడు సింధూర్. ఆ అమ్మాయి ....కైవల్య! .... ఎవరికోసం ఇంత కష్టపడి వచ్చాడో ఆ కైవల్యే!

పళ్లు కొరుకుతూ లేచి నిలబడ్డాడు. కొరడా వ్యక్తిని అనుసరించాడు. అతని కళ్లముందే కైవల్యను ఒక గదిలో పెట్టి తాళం వేశాడా వ్యక్తి.

తన ఫేవరేట్ వెపన్ బటయకు తీశాడు సింధూర్. అది ఇత్తడి బొడిపెలు అమర్చబడ్డ ఇనుప చేతితొడుగు. దాని పేరు బ్లాక్ గ్లోస్. ఆ ఇనుప పిడికిలితో ఎంతమందికైనా సమాధానం చెప్పగలడు సింధూర్.

కొరడా వీరుడు వెనక్కి తిరిగాడు. సింధూర్‌ను చూస్తూనే తన చేతిలోని కొరడా రివ్వున ఝుళిపించాడు. ఏమాత్రం వెనుకంజ వేయలేదు సింధూర్. ఎడమ చేతితో ఆ కొరడా ఒడిసిపట్టుకుని ముందుకు లాగాడు. కుడిచేతితో ఫట్‌మని ఆ వ్యక్తి తలపై కొట్టాడు. దెబ్బకు చిత్తయిపోయిందా వ్యక్తి మొహం. కీచుగా అరిచి వెనిక్కి పడ్డాడు. పడ్డవాడు మళ్లీ లేవలేదు.

అతని దుస్తుల నుండి తాళంచెవి తీసుకుని ముందుకు పరుగెత్తాడు. కైవల్య ఉన్న గది తలుపు తెరిచి లోపలకు వెళ్లాడు. ఆ గదిలో ఒక మూలగా కూర్చుని ఉంది కైవల్య. మోకాళ్లపై తల పెట్టుకుని మౌనంగా ఏడుస్తోంది.

సింధూర్‌ను చూడగానే టక్కున లేచి నిల్చుంది. అతడిని చూస్తూనే ఆశ్చర్యపోయింది. ఒంటినిండా బురదతో నల్లగా ఉన్న అతడెవరో ఆమెకు అర్థం కాలేదు.

కొరడాతో కొట్టినట్లు ఆమె ఒళ్లు వాతలతో నిండి ఉంది. అంతకంటే ఘోరంగా కనిపిస్తున్నాయి సిగరెట్ వాతలు. ఆమె బుగ్గలపై కారుతున్న కన్నీరు ఆమె పడ్డ కష్టాలు విప్పి చెబుతోంది.

పళ్లు బిగిస్తూ వెనుతిరగబోయాడు సింధూర్. అయితే వివేకం అతన్ని హెచ్చరించింది. ఆమెను ఆ స్థితికి తీసుకువచ్చినవారి సంగతి తర్వాత చూడవచ్చు. ముందు ఆమెతోబాటు అక్కడినుండి బయటపడాలి. లేకుంటే ఆమెతోబాటు తనూ చిక్కుపడిపోతాడు.

"మీరు ...?" సందేహంగా ఆగింది కైవల్య.

"నా పేరు సింధూర్. ఇంతకుముందు ఒక రెస్టారెంట్‌లో మీరు నన్ను చూశారు."

గుర్తుకు రాలేదు కైవల్యకు.

"రంభగారూ! నేనండీ! ఇంద్రుడిని. మీరు ఊర్వశిగారితో కలిసి హోటల్‌కి వచ్చినప్పుడు ..."

అప్పుడు జ్ఞాపకం వచ్చిందామెకు. మరుక్షణం సుడిగాలిలా అతన్ని అల్లుకుపోయిందా అమ్మాయి.

"నన్ను రక్షించండి! ఈ దుర్మార్గుల బారినుండి నన్ను కాపాడండి!" ఏడుపుతో ఆమె కంఠం రుద్ధమైంది.

"రిలాక్స్, బేబీ! నేను వచ్చింది కూడా అందుకే. ఏడుపు ఆపేయ్! నిన్ను వీళ్లు ఎందుకు పట్టుకున్నారో తెలుసా?"

"నాకు తెలియదు. ఏదో విగ్రహం గురించి అడిగారు. కోటిలింగమట! అతని గురించి అడిగారు. తెలియదని చెప్పాను. వినలేదు. నానాహింసలూ పెట్టారు. ఆఖరికి నన్ను ....నన్ను..." ఏడుపు తన్నుకువచ్చింది కైవల్యకు.

ఆమె చెప్పకుండానే అర్థమైంది. ఆమెను బలవంతంగా చెరిచారు. పైగా ఆమెతో బ్లూ ఫిలిమ్ తీశారు.

"ఇదంతా నువ్వు కోటిలింగంతో చేతులు కలపడం వల్ల జరిగింది!" చెప్పాడు సింధూర్.

"ఆ కోటిలింగం ఎవడో నాకు తెలియనే తెలియదు. వాడితో నేను చేతులు కలపడం ఏమిటి?"

ఒక్క క్షణం సీరియస్‌గా ఆమె ముఖంలోకి చూశాడు సింధూర్. ఆ తర్వాత చెప్పాడు - "నీకు నెమలిపింఛంరంగు చీర ఉంది కదా?"

"ఉంది. దానికీ, దీనికీ సంబంధం ఏమిటి?"

"జాక్సన్ అండ్ జాక్సన్ కంపెనీలో పనిచేసే నెమలిపింఛంరంగు చీర కట్టిన అమ్మాయి కోటిలింగంతో వాడు చనిపోవడానికి కొన్ని క్షణాలముందు మాట్లాడింది. ఆ కోటిలింగం ఒక క్రిమినల్. వాడికి కోట్లు విలువచేసే ఒక రహస్యం తెలుసు. దానిని వాడు ఆ అమ్మాయికి చెప్పాడు. అది నువ్వే!"

"నిజంగా నాకు ఇదంతా తెలియదు."

"తెలుసు మూడువారాల క్రితం నువ్వు కోటిలింగాన్ని కలిశావు. అబద్ధాలు చెప్పాలని చూడకు, కైవల్యా! నువ్వు ప్రమాదం నుండి బయటపడాలంటే నిజం మాత్రమే చెప్పాలి!" కఠినమైన స్వరంతో చెప్పాడు సింధూర్.

## సినిమా సమీక్ష

### వివేకుని నిజజీవిత విధం - అనేక జనహిత పథం!



"భగవంతుడు నాకు సిరి ఇచ్చాడు. దాన్ని సద్వినియోగపరచడమే నా ధర్మం" అంటూ ఒక ప్రయోజనాన్ని ఆశించి చిత్రనిర్మాణం చేసే వ్యక్తి డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి ఇప్పుడు 'వివేకానంద' నిర్మించారు. హిందూయిజం ప్రపంచ దేశాలన్నిటికీ శాంతి, సహనం నేర్పిన జీవిత విధానం. ఈ ఆదర్శాన్ని దశదిశలా, దేశదేశాలా చాటిన ప్రముఖుడు వివేకానందుడు. పూర్వాశ్రమంలో నరేంద్రుడు...1863లో జన్మించాడు. 40 సంవత్సరాల స్వల్ప జీవితం అతనిది.

రామకృష్ణ పరమహంస ఈ యువకుని తీర్చిదిద్దాడు. ఈ రామకృష్ణ పరమహంస అను క్షణం 'అమ్మ'ను (కాళి) ఆరాధిస్తూ స్పృహ తప్పిపోతూ ఆ తల్లి కృప పొందగలుగుతాడు. అతను ఏరికోరి వరించిన శిష్యుడు నరేంద్రనాథ్. అతనికి తన శక్తి ధారపోసి, తనువు చాలించాడు. వివేకానందుడై ఆపైన నరేంద్రుడు గురుబోధనలను విశ్వవ్యాప్తి చెందించాడు.

మిథున్ చక్రవర్తి రామకృష్ణుడుగా అపురూప

మైన నటన చూపాడు. అతని చూపు, మాట, నడక, పిచ్చివాలకం, కాళితో ప్రసంగ విధానం - అన్నీ సహజంగానే కనిపించాయి. సర్వదమన్ బెనర్జీ వివేకానందుడుగా నటించాడు. కాళిగా హేమామాలిని నటించింది. షమ్మీకపూర్, శశికపూర్, అనుపమఖేర్, మమ్ముట్టి, రాఖీ, జయప్రద, తనూజ, మీనాక్షిశేషాద్రి, దేబశ్రీరాయ్, శోభనవంటి ప్రముఖులంతా నటించారు.

టెక్నికల్‌గా అంతర్జాతీయస్థాయిలో ఒక అపురూపచిత్రంగా తీర్చిదిద్దాలని పడిన శ్రమ ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. మధు అంబట్ కెమెరా. సలీల్ చౌదరి సంగీతం. ఎనిమిది పాట(అందులో భక్తజయదేవ్ అష్టపది) లున్నాయి. పద్మా సుబ్రహ్మణ్యం, చిన్నీ పరేష్ నృత్యాలు. గుల్జార్ పాటలు. ఇంకా రవి, కృష్ణమూర్తి, లెనిన్ తెరవెనుక ముఖ్యుల్లో ఉన్నారు. మమ్ముట్టి ఆనాటి వివేకునికి చికాగోనుంచి తిరిగి రావడంతో స్వాగతం పలుకుతూ కనిపిస్తాడు. అలాగే ఈనాటి ప్రజలకీ కథ చెబుతూ ముగిస్తాడు.



జి.వి. అయ్యర్ దర్శకులు. "A humble contribution to the youth of India" అంటూ దీన్ని మన దేశ యువకులకు సమర్పించాడు నిర్మాత.

అతని గొంతులో కాఠిన్యానికి బిత్తరపోయింది కైవల్య. ఆమె ఏడుపుస్థాయి పెరిగింది.,

"ప్లీజ్, కైవల్యా! ఏడవకు. ఎవరైనా వచ్చే అవకాశం ఉంది."

"నిజానికి నేను ఆ చీర తీసుకున్నదే మూడు రోజుల కిందట. మూడు వారాలకు ముందు ఆ చీర నాకెక్కడిది?"

"అంటే ఆ చీర నువ్వు కొని మూడురోజులే అయిందా?"

"ఆ చీర నేను కొనలేదు. నా ఫ్రెండ్ సంయుక్తది. సరదాగా తీసుకున్నాను."

"సంయుక్త కూడా ఆ కంపెనీలోనే పనిచేస్తోందా?" కంగారుగా అడిగాడు సింధూర్.

తల ఊపింది కైవల్య.

అంటే కోటిలింగం మాట్లాడింది సంయుక్తతోనన్నమాట. ఆ విగ్రహం ఎక్కడ ఉందో సంయుక్తకు తెలుసు. ఆమెకోసం అల్లిన ట్రాప్‌లో అమాయకంగా కైవల్య ఇరుక్కుంది. జాలిగా చూశాడామెవైపు.

ఆ కాస్త సమయంలో కైవల్యకు కూడా జరిగింది అర్థమైంది. తన కుటుంబం నాశనం కవడానికి కారణం సంయుక్త. తెలిసి తెలిసీ తనను ఈ విషవలయంలోకి తోసింది.

"ఓకే బేబీ! ముందు ఇక్కడనుండి బయటపడాలి. ఆ తర్వాత సంయుక్త విషయం ఆలోచిద్దాం. పద!"

కైవల్య చెయ్యి పట్టుకుని బయటకు పరుగెత్తాడు సింధూర్. ఆ గది బయటే పడి ఉన్నాడు కొరడా వ్యక్తి. గబగబా అతని పాంటు, షర్టు ఊడదీసి కైవల్యకు ఇచ్చాడు.

అక్కడికి ఒక పక్కగా గది ఉంది. దానికి పెద్ద తాళంకప్ప వేలాడుతోంది. ఆ గదిలో ఏమున్నాయో చూడాలన్న కోరిక సింధూర్‌ను కుదిపివేసింది. వెళ్లి తాళం లాగి చూశాడు. రాలేదు. చాలా స్ట్రాంగ్‌గా ఉంది.

ఈలోగా దుస్తులు వేసుకుని అతని పక్కకు వచ్చి నిలబడింది కైవల్య.

ఆమెవంక పరిశీలనగా చూశాడు సింధూర్. అంతకుముందు ఆమె ఒంటిపై కేవలం ఒక తెల్లని చొక్కా మాత్రమే ఉండేది. ఇప్పుడు ఖాకీరంగుపాంటు. షర్టు వేసుకుంది. రేగిన తలను వేళ్లతో దువ్వింది.

కైవల్య తలలోని హెయిర్‌పిన్‌ను చూడగానే చాలా ఆనందం కలిగింది సింధూర్‌కు. "తెలుసుకోరుగానీ మీ ఆడవాళ్ల మేకప్ సామగ్రిలో చాలా ఉపయోగపడే వస్తువులు ఉన్నాయి, బేబీ!" ఆమె తలనుండి హెయిర్‌పిన్ తీస్తూ చెప్పాడు.

తన చేతికి ఉన్న బ్లాక్‌గ్లౌజ్ తీసి ఆమెచేతికిచ్చాడు. ఆ తర్వాత హెయిర్ పిన్‌ను తనకు కావలసిన విధంగా మార్చుకున్నాడు. కొద్ది క్షణాలలోనే అంత పెద్ద తాళంకప్ప ఊడి వచ్చింది. లోపలకు వెళ్లారిద్దరూ. రకరకాల ఫర్నిచరు ఉంది. రెండు చెక్క అలమార్లు ఉన్నయి. వాటిలో కొన్ని వీడియో కాసెట్లు ఉన్నాయి. మరికొన్ని రకరకాల కాగితాలు, నెగిటివ్‌లు ఉన్నాయి. పక్కకు తిరిగి కైవల్య వైపు చూశాడు.

"కైవల్యా! ఇదంతా బ్లూఫిలిమ్‌కు సంబంధించినదే అయివుంటుంది. ఈ అశ్లీలకరమైన సినిమాలు బయటకు రాకూడదు. సాయం పట్టు, నాశనం చేసి పోదాం!"

మాట్లాడలేదు కైవల్య. ఏదో ఆలోచిస్తున్నట్లు కాసేపు నిల్చుంది. ఆ తర్వాత రివ్వున బయటకు దూసుకుపోయింది.

కంగారుపడ్డాడు సింధూర్. శత్రువుల మనుషులు ఇంకా నలుగురు ఉన్నారు. స్పృహ తప్పిన గార్డుకు, కొరడావ్యక్తికి తెలివి వస్తే ఆరుగురవుతారు. వీళ్లు కాక దెయ్యంవంటి కుక్క ఉంది. దానిబారిన పడితే తప్పుకోవడం కష్టం. ఇటువంటి పరిస్థితిలో ఎక్కడకు వెళ్లింది? ముళ్లపైన ఉన్నట్లు ఫీలవసాగాడు సింధూర్.

పదినిముషాల తర్వాత తిరిగి వచ్చింది కైవల్య. ఖాళీగా రాలేదు. చేతిలో ఒక పెద్దడబ్బాతో వచ్చింది. రావడంతోనే ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అలమారులో ఉన్న కాసెట్లు, నెగెటివ్‌లు కింద కుప్పగా పోసింది. ఆ తర్వాత డబ్బాలో ఉన్న లిక్విడ్ వాటిపైన, ఆ గదిలో ఉన్న ఫర్నిచర్‌పైన చల్లింది.

ఘాటైన ఆల్కహాల్ వాసన సింధూర్ ముక్కుపుటాలను తాకింది. తాగడానికి ఆ సారా తెచ్చి ఉంటారు. దానిని గుర్తుంచుకుని తెచ్చింది కైవల్య.

నిమిషాలలో ఆ గదినిండా మంటలు అలుముకున్నాయి. కంగారుగా అక్కడనుండి బయటపడ్డారిద్దరూ. ఎలక్ట్రిక్ వైర్లు అంటుకుంటే బంగళా మొత్తం అగ్నిదేవుడి పాలబడుతుంది. ఈ లోపల బయటకు వెళ్లిపోవాలి.

అంతకుముందు చూసిన గదిలోనే కూర్చుని ఉన్నారు మిగిలిన నలుగురు వ్యక్తులు. వారిమధ్య ఒక టీపాయ్ ఉంది. దానిపైన విస్కీబాటిల్స్ ఉన్నాయి. ఆందోళనగా సింధూర్ ముఖంలోకి చూసింది కైవల్య. తాము వాళ్ల కంటబడకుండా వెళ్లాలి. లేకపోతే పట్టుబడటం ఖాయం. అయితే సింధూర్ ఆలోచించేది వేరే ఉంది.అదిఒక కుక్క. అది డాబర్‌మన్ జాతికి చెందిన కుక్క. ఎక్కడుంది? ఇంతసేపు శత్రువుల వాసన పసిగట్టకుండా ఉందా?

అతని ఆలోచనలు నిజం చేస్తూ ప్రళయకాల పర్జన్యఘోషలా వినబడింది కుక్క అరుపు. కట్టిన గొలుసు తెంచుకోవడానికి అది చేస్తున్న ప్రయత్నం కూడా తెలుస్తోంది.

చటుక్కున ఒక గోడవారకు తప్పుకున్నాడు సింధూర్. తనతోపాటు కైవల్యను కూడా లాగాడు. కుక్క అరుపుకు తల తిప్పి చూశారా వ్యక్తులు. మంటలు,




విపరీతమైనపొగ వారి దృష్టిని ఆకట్టుకున్నాయి. కంగారుగా లేచి ఆ వైపు పరుగెత్తారు.

వెంటనే బయటకు పరుగెత్తాడు సింధూర్. అతన్ని అనుసరించింది కైవల్య. మెయిన్ గేటు వద్దకు చేరగానే ముందు కైవల్యను గేటు ఎక్కించి అవతలకు దింపాడు. అతడు ఎక్కబోతుండగా బాణంలా దూసుకువచ్చింది కుక్క. అంతదూరం నుండే రివ్వున గాల్లోకి ఎగిరి తెల్లని కోరలు బయటపెడుతూ సింధూర్ కంఠంవైపు దూసుకువచ్చింది.

సిద్ధంగానే ఉన్నాడు సింధూర్. రెండు చేతులతో గేటు గట్టిగా పట్టుకుని కాలితో లాగిపెట్టి తన్నాడు. వెనక్కి పడిందా కుక్క. అది తిరిగి రియాక్ట్ అయితే తన బాడీషేపులు మారిపోతుందని తెలుసు. అందుకే వేగంగా గేటుపైనుండి అవతలకు దూకేశాడు సింధూర్.

అంతే! ఆ తర్వాత కైవల్యను తీసుకుని చీకటిలో కలిసిపోయాడు.

ఆ బంగళాను మాత్రం అగ్నిదేవుడు తన భార్య స్వాహాదేవితో కలిసి ప్రీతిగా ఆరగించసాగాడు.

* * *

తలుపు గెంటుకుని లోపలకు ప్రవేశించాడు విక్రమ్. చల్లని గాలి మేనుని మృదువుగా స్పృశించినట్లయింది. మత్తగజంలా భూమి అదిరేలా అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు. లోపల గదిలో ఒక పెద్దబల్ల ఉంది. దానిపై ఒక పెద్ద లైటు వెలుగుతోంది. ఆ టేబుల్ లాంపు కాంతి సూటిగా గుమ్మంవైపు ప్రసరిస్తోంది.

"వెల్‌కమ్, విక్రమ్!" టేబుల్ లాంపు వెనుక చీకటిలో నుండి వినబడిందో కంఠం.

విక్రమ్ కన్ను పొడుచుకు చూసినా ఆ చీకటి ఆకారాన్ని చూడలేకపోతున్నాడు. టేబుల్‌లాంపు అతనికా అవకాశాన్ని ఇవ్వడంలేదు.

"ఎందుకో పిలిచారట?" వినయంగానే అన్నాడు విక్రమ్. కానీ అతని కంఠంలో కరుకుదనమే ఎక్కువ ధ్వనించింది.

"ఈమధ్య నీలో చురుకుదనం తగ్గిపోతోందేం విక్రమ్? ఏపనీ ఒక పద్ధతిలో జరపడంలేదు!" మెత్తగా అడిగాడా వ్యక్తి.

మాట్లాడలేదు విక్రమ్. ఇంకో మనిషి ముందయితే అలా దోషిలా నిలబడేవాడు కాదు. కానీ తన ముందున్న మనిషి విషయం వేరు. ఆ మనిషి ఎవరో తనకు తెలియకపోయినా కనురెప్పల కదలికలతో చుట్టూ సమాజాన్ని శాసించగల సమర్థుడని తెలుసు. అతనిముందు ఆకతాయిగా ప్రవర్తిస్తే చాలా పెద్దపెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. మనుషుల ప్రాణాలు అతనికి గడ్డిపోచలతో సమానం.

"విక్రమ్!" ఆ వ్యక్తి కంఠస్వరం విక్రమ్ ఆలోచనలను భగ్నం చేస్తూ తిరిగి వినిపించింది.

"ఆ విగ్రహం ఏమైంది?"

విడమర్చి చెప్పాడు విక్రమ్. కోటిలింగాన్ని హత్య చేయడం, కైవల్యను బంధించడం, సదాశివం కోసం వెదికించడం అన్నీ వివరంగా, ఓపిగ్గా చెప్పాడు.

"ఇన్ని ప్రయత్నాలయ్యాక ఒక కుర్రాడు నీ భవనంలోకి ప్రవేశించి, దానికి నిప్పెట్టి నీ అధీనంలో ఉన్న అమ్మాయిని ఎత్తుకుపోయాడు. అవునా?"

తల ఊపాడు విక్రమ్.

"వాడు ఎవరో తెలిసిందా?"

"లేదు, సార్!"

"వాడి పేరు సింధూర్. ఒక బాక్సర్. నువ్వు పట్టుకున్న అమ్మాయి కూడా మనకు కావలసింది కాదు. ఆ విగ్రహం గూర్చి తెలిసింది అదే కంపెనీలో పని చేస్తున్న ఇంకో అమ్మాయికి."

"వెంటనే ఆ అమ్మాయిని పట్టుకుంటాను, సార్!"

"వద్దు. వాడు మనల్ని స్ట్రయిట్‌ఫైట్‌లో దెబ్బతీయలేదు. దొంగదెబ్బ తీశాడు. మనమూ అలాగే దెబ్బకొడదాం. ఏం చేస్తావో చెప్పు!" అడిగాడా వ్యక్తి.

తెల్లముఖం వేశాడు విక్రమ్. వందమందిని వట్టిచేతులతో ఎదిరించమన్నా, కొన్ని ఇళ్లు తగలబెట్టమన్నా వెనకా ముందూ లేకుండా చేసేస్తాడు విక్రమ్. ఒక్క క్షణం మెదడుకు పని చెప్పమంటే మాత్రం ...

ఆ విషయం బాగా తెలుసా వ్యక్తికి. అందుకే తిరిగి తనే చెప్పసాగాడు -

"విక్రమ్! ఇన్ని సంవత్సరాలు మనం స్మగ్లింగ్‌వ్యాపారం నిరాటంకంగా సాగడానికి ముఖ్యకారణం ఏమిటో తెలుసా? మన శక్తిసామర్థ్యాలు గానీ, ప్రభుత్వపు అసమర్థత గానీ కాదు. వీటికన్నా ముఖ్యమైన మరో కారణం ఉంది. అది భయం ..."

ఆశ్చర్యంగా చూశాడు విక్రమ్.

"ఎస్, విక్రమ్! అది ప్రజల మనసులో పారలుపారలుగా పేరుకుపోయిన భయం. ఏది ఎలా పోతేనేం, మనం మాత్రం కష్టాలు ఎందుకు తెచ్చుకోవాలి అనుకునే మనస్తత్వం. ప్రజల్లో ఆ భయం, ఉదాసీనవైఖరి భద్రంగా ఉన్నంతకాలం మన వ్యాపారానికి ఏ ఢోకా ఉండదు. కానీ ఒక్కసారి ఆ భయం నుండి తేరుకుంటే మన వ్యాపారానికి గండిపడ్డట్టే. కాబట్టి మనం చేయవలసిన మొట్టమొదటి పని ప్రజల్లోని ఆ భయాన్ని అలాగే ఉండనివ్వడం.

"ముక్కూ మొహం తెలియని ఒక కుర్రవెధవ మన సామ్రాజ్యానికి వచ్చి మనల్ని దెబ్బకొట్టిపోయాడని తెలిసిన మరుక్షణం మన ప్రతిష్ట దిగజారినట్లే! కాబట్టి ఆ కుర్రవాడిని దెబ్బతీయాలి. మనకు ఎదురు తిరిగిన ఏ మనిషికైనా ఇలాంటి శాస్తే జరుగుతుందని మిగిలినవాళ్లకు తెలియాలి!"

నిశ్శబ్దంగా వింటున్నాడు విక్రమ్.

చీకటిలోంచి ఆ గొంతు తిరిగి వినిపించింది. "ఆ కుర్రాడి సంగతి నేను చూసుకుంటాను. నువ్వు మాత్రం ఆ అమ్మాయి విషయం చూడు. ఎంతమంది మనుషులను వినియోగిస్తావో, ఎన్ని రక్తపుటేర్లు పారిస్తావో నాకు తెలీదు! ఆ అమ్మాయి ఆ విగ్రహం ఎక్కడుందో చెప్పాలి. ఈ పని నువ్వు చేయగలిగితే సగంవాటా నీకు ఇచ్చేస్తాను."

విక్రమ్ మొహంలోకి గొప్పవెలుగు వచ్చేసింది.

"వెళ్లు, విక్రమ్! ఈరోజునుండి ఆ పనిమీద ఉండు!" చెప్పాడా వ్యక్తి.

ఆనందంగా వెనుతిరిగాడు విక్రమ్.

సంయుక్త కోసం ఆ రకంగా శవపేటిక సిద్ధమైంది.

* * *

"కైవల్యా! ఇదే నా ఇల్లు. బ్రహ్మచారి కొంప. ఇంకా చెప్పాలంటే నా అన్నవాళ్లు లేని అనాథ ఇల్లు!" లోపలికి రాగానే కైవల్యతో చెప్పాడు సింధూర్.

"నేను కూడా అనాథనేగా!" అంది కైవల్య. ఆమె కళ్లలో నీళ్లు చివ్వున చిమ్మాయి.

"నేను ఏం పాపం చేశానని నాకీ శిక్ష? కేవలం చిన్ననాటి స్నేహితురాలని దానితో కలిసి ఉండటమేనా నేను చేసిన తప్పు?" అకస్మాత్తుగా ఏడవడం మొదలుపెట్టింది. ఆమెను ఎలా ఓదార్చాలో సింధూర్‌కు తెలియలేదు.

అంతకుముందురోజు కైవల్యను విక్రమ్ బారినుండి రక్షించాక తిన్నగా తన ఇంటికి తీసుకువచ్చేశాడు. తీసుకువచ్చాక తన ఇంట్లో కూడా ఆమెకు రక్షణ ఉండదేమోననిపిస్తోంది.

ఆమెకి ఎవరూ లేరు. పోనీ పోలీసులకు అప్పజెబుదామా అంటే అందులో నమ్మదగ్గవాళ్లెవరో, విక్రమ్ మనుషులు ఎవరో తెలియదు. అది తెలియకుండా ఆమెను పోలీసులకు అప్పగిస్తే తిరిగి విక్రమ్‌కు అప్పజెప్పినట్లే అవుతుంది. ఆమెకు వేరే ఊళ్లలో ఎవరైనా బంధువులు ఉన్నారేమో?

అతని ఆలోచనలు గ్రహించినట్లు ఆమె చెప్పింది -"బొంబాయిలో మా అంకుల్ ఉన్నారు. అక్కడకు వెళ్లిపోతాను. మీరు నన్ను జాగ్రత్తగా అక్కడకు చేర్చగలిగితే కృతజ్ఞురాలిని!"

"సరే, అలాగే చేద్దాం. ఈలోగా నేను వెళ్లి ఏమైనా తినడానికి తీసుకువస్తాను. స్నానం అదీ చేసి ఫ్రెష్ అయి ఉండు!" చెప్పి బయటకు వెళ్లబోయాడు సింధూర్.

"అయ్యో! ఇకనైనా ఆ బురద వదిలించుకోండి. చూడలేక చస్తున్నాం!" చెప్పింది కైవల్య. 'అలాగే' అని స్నానం చేసి వెళ్లిపోయాడు సింధూర్.

ఆ తర్వాత బాత్‌రూమ్‌లోకి వెళ్లి స్నానం చేసి సింధూర్ ఇస్త్రీ లుంగీ, లాల్చీ తీసుకుని వేసుకుంది కైవల్య. ఆ తర్వాత ఆమె ఇంటిని నీట్‌గా సర్దడం మొదలుపెట్టింది.

ఫోన్ మోగడంతో ఉలిక్కిపడి అటు చూసింది. ఎవరు చేసి ఉంటారో ఆమెకు అర్థంకాలేదు. బహుశా సింధూర్ బయటనుండి చేసి ఉండవచ్చుననుకుంటూ రిసీవర్ తీసింది.

ఆమె ఊహలను భగ్నం చేస్తూ ఒక బొంగురుగొంతు అవతలినుండి కర్కశంగా వినబడింది.

"హలో, కైవల్యా! బతికిపోయాననుకుంటున్నావా! ఒకసారి మా చేతుల్లో చిక్కినవాళ్లుగానీ, యముడి పాశానికి తగులుకున్నవాళ్లు గానీ బతికి బయటపడటం కల్ల!"

కైవల్య గుండెలు దడదడలాడాయి. నాలుక పిడచగట్టుకుపోయింది. విపరీతమైన వేగంతో గుండె కొట్టుకునే చప్పుడుకి ఊపిరి ఆగిపోతుందేమో అనిపిస్తోంది.

"ఈ వ్యవహారంలో నాకేం సంబంధం లేదు. ప్లీజ్, నన్ను వదిలిపెట్టండి!"

అవతలివైపు నుండి హేళనగా నవ్వు వినపడింది. "ఇనుముతో చేరిన నిప్పు కూడా సమ్మెట దెబ్బలు తింటుంది. పాలలో చేరిన నీళ్లు కూడా మరగుతాయి. అలాగే సంయుక్తతో చేరినందుకు నువ్వు కూడా అనుభవిస్తున్నావు. చిన్నప్పుడు సుమతీ శతకం చదవలేదా, బేబీ?

"చెడ్డవాళ్లతో చేరిన మంచివాళ్లు కూడా దూషితులవుతారు. అలాగే ప్రమాదకరమైన వ్యక్తులతో స్నేహం చేసినవాళ్లు కూడా ప్రమాదాలకు గురవుతారు!" చెబుతూనే పెద్దగా నవ్వారు అవతలివాళ్లు.

ఠక్కున ఫోన్ పెట్టేసింది కైవల్య. రివ్వున ముందు గదిలోకి వెళ్లి తలుపులు వేసేసింది. మొత్తం కిటికీలు కూడా బంధించివేసింది. ఆ తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మంచంపై భయంభయంగా కూర్చుంది. సింధూర్ ఎంత త్వరగా వస్తాడా అని ఉందామెకు.

కాలం మెల్లగా నత్తనడక నడుస్తోంది. ప్రాణభయం నిలువెల్లా ఆక్రమించిన కైవల్యకు క్షణమొక యుగంలా గడుస్తోంది. ఆమె చెవులు ఏ చిన్నశబ్దమైనా వినబడుతుందేమోనన్నట్లు అలర్ట్‌గా ఉన్నాయి. కానీ ఏ మాత్రం అలికిడి వినిపించడంలేదు. ఆ ఇంట్లో నిశ్శబ్దం ఘనీభవించినట్లు ఉంది.

విచిత్రంగా ఆ నిశ్శబ్దమే ఆమెను ఎక్కువ భయపెడుతోంది. ఆ నిశ్శబ్దంలో టేబుల్‌పై గడియారం ముల్లు తిరుగుతున్న శబ్దం, ఫాన్ గాలికి ఊగుతూ డోర్‌కి కట్టిన చిరుగంటల శబ్దం... ప్రతిదీ ఆమెను భయపెడుతున్నాయి.

సడెన్‌గా కాలింగ్‌బెల్ పెద్దగా మోగింది. కైవల్య శరీరంలో రక్తం వేగంగా పరుగులు తీసింది. చాలాసేపు కదలకుండా కూర్చుంది. కానీ అంతకంతకూ తలుపుపై శబ్దం రెట్టింపు కాసాగింది.

మెల్లగా లేచి తలుపుదగ్గరకు వెళ్లి ఆగింది కైవల్య. తలుపుకున్న చిన్న కన్నంగుండా బయటకు చూసింది. ఏమీ కనపడలేదు.

"ఎవరూ?" వణుకుతున్న కంఠంతో అడిగింది.

"పోలీస్ ప్లీజ్! ఓపెన్ ద డోర్!" బయటనుండి వినపడింది.

పోలీసులు వచ్చేశారు. ఇంక తనను ఎవరూ ఏమీ చెయ్యలేరు ... ఆనందంగా తలుపు తెరిచింది.


అదే ఆమె చేసిన పెద్ద పొరపాటు. అందుకు పెనాల్టీ కూడా బాగానే చెల్లించింది.

* * *

బైనాక్యులర్ నుండి చూస్తున్న ద్వారకానాథ్ నిట్టూర్చాడు. బైనాక్యులర్ వదిలివేసి వెనక్కు చేతులు పెట్టుకుని అటూ ఇటూ గంభీరంగా పచార్లు చేయసాగాడు.

టీపాయ్‌పై ఉన్న నల్లరేగడి మట్టి మరికొంచెం తీసుకుని తలకు పట్టించాడు. ఆ తర్వాత నాలుగైదు బస్కీలు తీశాడు. మళ్లీ బైనాక్యులర్స్ తీసుకుని చూడసాగాడు.

"అయ్యో! అయ్యో! తలనిండా అలా మట్టి పూసుకున్నావేమిట్రా?"



వెనుకనుండి తల్లి అరుస్తూ వచ్చింది.

"అబ్బబ్బ! నీకు తెలియదు ఊరుకో, మమ్మీ! మాలాంటి గొప్ప మేధావుల బుర్రలు ఆలోచనలతో వేడెక్కిపోతుంటాయి. స్నానం చేయబోయేముందు ఇలా నల్లరేడిమట్టి పట్టించుకుని ఆ తర్వాత చన్నీళ్లతో స్నానం చేస్తే తల చల్లబడుతుంది. అప్పుడు ఎలాంటి సమస్యనైనా చిటికెలో పరిష్కరించగలం!" చెప్పాడు ద్వారకానాథ్.

"ఏరా! డిగ్రీ చదివావు. చక్కగా మంచి ఉద్యోగం వెతుక్కుని చక్కని పిల్లను చూసి పెళ్లి చేసుకోక ఈ వేషాలేమిటిరా?"

అంతే! ఆ మాటలతో ద్వారకానాథ్ మూడ్ మారిపోయింది. రెండు చేతులూ కట్టుకుని సీరియస్‌గా ఆకాశంలోకి చూడసాగాడు.

"మామూలుగా ఉద్యోగాలు చేసి, పెళ్లి చేసుకుని, పిల్లలను కని, భవసాగరంలో మునిగిపోవడమేమిటమ్మా? నేను గొప్ప డిటెక్టివ్‌నవుతాను. షెర్లాక్‌హోమ్స్‌లా, యుగంధర్‌లా గొప్ప అపరాధపరిశోధకుడినవుతాను. అంతవరకు ఉద్యోగమనీ, పెళ్లనీ నన్ను బాధించకమ్మా! బాధించకు!" చెప్పాడు ద్వారకానాథ్.

ఆవిడ తల బాదుకుని లోపలకు వెళ్లిపోయింది.


ద్వారకానాథ్ మళ్లీ పచార్లు చెయ్యసాగాడు. అతడిని ఒక సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఆ మాటకొస్తే అతనికి సమస్య లేని రోజు ఉండదు. ఆ కాలనీలో ఒకరి ఇంట్లో గరిట పోయినా సమస్యే. ఇంకొకరి ఇంట్లో చిన్న గొడవ జరిగినా సమస్యే. ఇప్పుడు కూడా అటువంటి సమస్యే వచ్చింది.

ఆరోజు తెల్లవారుఝామున లేచి డాబాపైన ఎక్సర్‌సైజులు చేస్తున్న ద్వారాకానాథ్‌కు ఒక విచిత్రం కనబడింది. ఒక యువతి, యువకుడు దొంగల్లా తమ ఇంటికి కొంచెం దూరంలో ఉన్న ఇంట్లోకి వెళ్లారు. చిరువెలుతురులో వాళ్లను చూసి అదిరిపడ్డాడతను. ఆ యువకుడి పేరు సింధూర్ అని, అతనే ఆ ఇంటిఓనర్ అని ద్వారాకానాథ్‌కు తెలుసు. అది కాదు అతన్ని ఆశ్చర్యపరిచింది. సింధూర్ ఒంటినిండా బురద కొట్టుకుని ఉంది. అతని కూడా ఉన్న అమ్మాయి పాంటు, షర్టు వేసుకుని చాలా అందంగా ఉంది.

బ్రహ్మచారి అయిన సింధూర్ అంత అందమైన అమ్మాయిని తీసుకుని అలా రావడంతో అతని బుర్ర వేడెక్కిపోయింది.

పెర్రిమేసన్‌లా వాళ్ల ఇంట్లోకి చొచ్చుకుపోయి, షెర్లాక్ హోమ్స్‌లా అపూర్వ మేధతో, జేమ్స్‌బాండ్‌లా ఫైట్స్‌చేసయినా విషయం తెలుసుకోవాలి. వాళ్లిద్దరి వెనుక ఒక అపూర్వమైన రహస్యం ఉంది. అదేమిటో తెలుసుకోవాలి. ఆ ఆలోచన రాగానే మరి ఆలస్యం చేయలేదు ద్వారకానాథ్. గబగబా స్నానం చేసి సింధూర్ ఇంటివైపు బయలుదేరాడు.

చుట్టూ దొంగచూపులు చూసుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్న అతన్ని కొంత్తవాళ్లెవరైనా చూస్తే అతనే దొంగాడనుకుంటారు. అతని మెడలో బైనాక్యులర్స్, కెమెరా వేలాడుతున్నాయి. పాంటు జేబులో లోడ్ చేసిన రివాల్వర్ ఉంది. అది మోత చేస్తుందే తప్ప చీమను కూడా చంపదు. గుండె జబ్బు వాళ్లెవరైనా ఆ మోతలకు గుండె ఆగి చనిపోతే అది దాని తప్పుకాదు.




## నయనం ప్రధానం

దేశవ్యాప్తంగా సేవాసంస్థలవారు ఉచిత నేత్ర చికిత్సా శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ, దేశంలో అంధుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. దేశంలో 120 లక్షలమంది అంధులలో 80 శాతం 'కాటరాక్ట్' కారణంగా తమదృష్టిని కోల్పోయారు. రానున్న సంవత్సరాలలో వృద్ధాప్యం, ఆహారపు అలవాట్ల కారణంగా అంధులసంఖ్య 150 లక్షలకు పెరగనున్నది. శస్త్ర చికిత్సద్వారా కాటరాక్ట్‌ను తొలగించవచ్చు. అంధులలో గ్రామీణ ప్రాంతాలవారు ఎక్కువ ఉన్నారు. దేశంలో అంధులకు దృష్టిని ప్రసాదించడానికి ప్రపంచబ్యాంకు నిధులను అందజేస్తున్నది. రానున్న అయిదేళ్లలో 110 లక్షలమందికి కంటి శస్త్రచికిత్సలు చేయడానికి వరల్డ్‌బాంక్ సహాయపడుతున్నది.

- కృష్ణాజీ

అలాగే కాలి బూటుకున్న ప్రత్యేకమైన అరలో ఒక డాగర్ ఉంది. ఆ ప్రత్యేకమైన అరను తనకు తెలిసిన ఒక చర్మకారుడితో కుట్టించాడు ద్వారకానాథ్.

సింధూర్ ఇంటికి దగ్గరగా రాగానే ఆగిపోయాడు ద్వారకానాథ్. తన నల్లటి కనుగుడ్లను బండిచక్రాల్లా తిప్పి చుట్టూ చూశాడు. ఎవరూ గమనించడంలేదని నిర్ధారణ అయ్యాక ప్రహరీగోడ ఎక్కి లోపలకు దూకాడు.

ఆ ఇంట్లో మేడ పైభాగాన ఉంటున్నాడు సింధూర్. కింది వాటా వాళ్ల తలుపుగడియ వేసి ఉంది. నగరాల్లో ఇంతే. పక్క వాటాలో ఏం జరిగినా ఎవరూ పట్టించుకోరు అనుకుంటూ మేడమెట్ల వైపు వెళ్లాడు. మళ్లీ అంతలోనే సందేహం వచ్చింది. అనుమానితుల ఇల్లు సోదా చేసే పద్ధతి ఇది కాదేమో?

పక్కకు వెళ్లి వాటర్‌పంపు పట్టుకుని పైకి వెళ్లాడు. వీధి తలుపు గడియ వేసి ఉంది. అలవాటు ప్రకారం కాలింగ్‌బెల్ నొక్కాడు. బదులు రాలేదు. మళ్లీ నొక్కాడు. ఏ విధమైన అలికిడీ లేదు. మళ్లీ మళ్లీ నొక్కాడు. సడెన్‌గా ఒక ఆడపిల్ల వణుకుతున్న కంఠంతో "ఎవరూ?" అని అడిగింది.

సెకన్ల వ్యవధిలో ద్వారకానాథ్ తన అపూర్వ మేధస్సును ఉపయోగించేశాడు. "పోలీస్ ప్లీజ్! ఓపెన్ ద డోర్!" అన్నాడు.

* * *

హోటల్‌లో మంద్రంగా వినిపిస్తున్న మ్యూజిక్‌కి చిన్నగా తల ఊపుతూ యాపిల్‌జూస్ సిప్ చేస్తున్నాడు సింధూర్. పైకి మామూలుగా కనిపిస్తున్నా అతని తలనిండా ఎన్నోరకాల ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకుంటున్నాయి.

కైవల్యను బొంబాయి పంపివేయాలి. అసలు ఆ నరకం నుండి బయటపడతానని ఆమె ఊహించి ఉండదు. అటువంటిది ఒక్కసారిగా పొందిన స్వేచ్ఛ ఆమె నోట మాట రాకుండా చేసింది.

నిట్టూర్చాడు సింధూర్. విక్రమ్ ఇంకా ఎందరు ఆడపిల్లల జీవితాలు నాశనం చేస్తున్నాడో! అతిత్వరగా వాడి ఆట కట్టించాలి.

"హలో, సింధూర్! ఏమిటి ఇలా వచ్చారు?" ఎవరిదో పరిచితమైన కంఠం వినిపించింది. తలెత్తి చూశాడు సింధూర్.

ఎదురుగా నిలబడిందో యువతి. టైట్ పాంటు, టైట్ జీన్‌షర్టు, హైహీల్స్ బూట్లు ... అత్యంత ఆధునికంగా ఉందా యువతి. కళ్లకు ఉండవలసిన గాగుల్స్ తలపై ఉన్నాయి.

ఆమెను గుర్తుకు తెచ్చుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది సింధూర్‌కు. ఆమె పేరు నిశ్చల. బెన్నీ స్టూడియోలో మోడల్‌గా పరిచయమైంది. ఆమె అతని ఎదురు కుర్చీలో కూర్చుంది.

"నా సంగతి సరే! మీరేమిటి ఎలా వచ్చారు?" అడిగాడు సింధూర్.

"ఎవరో ఒకతను సినిమాఛాన్స్ ఇప్పిస్తానన్నాడు. ఆ ప్రొడ్యూసర్ ఇంకా మమ్మల్ని కలవలేదు. నా అదృష్టం బాగాలేనట్టుంది!" నిరాశగా నవ్వింది నిశ్చల.

"మోడల్‌గా కంటే సినీనటిగా లైఫ్ బాగుంటుందా?"

"సెంట్ పర్సెంట్! సినీ తారలకు లభించే గౌరవం మోడల్‌కు దొరకదు. పైగా రెమ్యూనరేషన్ కూడా సినీనటికే ఎక్కువవస్తుంది!" చెప్పింది నిశ్చల.

నిజమే. సినిమాతారలంటే ప్రజల్లో చాలా క్రేజ్ ఉంది. దానికోసమే కదా ఇంతమంది ఆడపిల్లల ఇళ్లనుండి వచ్చేసి విక్రమ్‌వంటి మోసగాళ్లబారినపడి బ్లూ ఫిలిమ్ తారలై అరబ్‌దేశాలకు ఎగుమతి అయిపోతున్నారు!

నిశ్చలకు కూడా బ్రేక్‌ఫాస్ట్ ఆర్డర్ చేశాడు సింధూర్. ఆ హోటల్‌లోని అన్ని పదార్థాలలోనూ హనీకేక్ సింధూర్‌కు బాగా నచ్చుతుంది. ఏం తినడానికి వచ్చినా ముందు హనీకేక్ రుచి చూస్తాడు. ఇప్పుడు కూడా అది ఆర్డర్ చేశాడు. రెండేసి పుల్కాలు, ఎగ్‌కర్రీ ఆర్డర్ చేశాడు.

వాళ్లు తినడం పూర్తయ్యేలోగానే ఒక వ్యక్తి ఆ టేబుల్ దగ్గరకు వచ్చి నిల్చున్నాడు. తెల్లటి అతని యూనిఫాం అతను కారుడ్రైవర్ అని చెప్పకు చెబుతోంది.

"మేడమ్! అయ్యగారు మీకోసం వెయిట్ చేస్తున్నారు. రమ్మని చెప్పారు!" నిశ్చలను చూస్తూ అన్నాడతను.

ఆ మాటలు వినగానే కంగారుపడింది నిశ్చల. తన దగ్గర ఉన్న చిన్న ఎయిర్‌బాగ్ సింధూర్‌కు అందిస్తూ చెప్పింది - "ఇప్పుడే వస్తాను, సింధూర్! ప్లీజ్, ఇది మీ దగ్గర ఉంచండి. నేను వచ్చి తీసుకుంటాను. నేను రావడం ఆలస్యమైతే మీ కూడా ఇంటికి తీసుకుపొండి. నేను వచ్చి తీసుకుంటాను!"

కంగారు కంగారుగా చెబుతున్న ఆమె మాటలకు నవ్వుతూ తల ఊపాడు సింధూర్. బహుశా ఆ ప్రొడ్యూసర్ కబురు పంపివుంటాడు. "బెస్టాఫ్ లక్, బేబీ! నీవు సినిమా తారవు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను!"

"థాంక్స్, ఫ్రెండ్!" అంటూనే పరుగులాంటి నడకతో బయటకు వెళ్లిపోయింది.

కైవల్య కోసం పార్సిల్ కట్టించుకుని తానుకూడా ఇంటికి బయలుదేరాడు సింధూర్.

మెయిన్‌డోర్ తీసుకుని లోపలికి వెళ్లేముందే ఏదో అనుమానం వచ్చింది. ముందు గది అస్తవ్యస్తంగా ఉంది. ఎవరో కంగారుగా పరుగెత్తినట్లు ఆ గదిలో సామానంతా కిందమీదులుగా ఉంది. ఒక్క అంగలో బెడ్‌రూమ్ చేరాడు సింధూర్. అక్కడ కూడా ఎవరూ లేరు. వంటగదిలోకి పరుగెత్తాడు. అక్కడా ఎవరూ లేరు.

కైవల్య ఏమైంది? ఎక్కడకు పోయింది? ఆ మృత్యువలయంనుండి రక్షించి ఎన్నో గంటలు అవలేదు. అప్పుడే తిరిగి వాళ్ల చేతులలో పడిందా? అసలు ఆమెను ఒంటరిగా వదిలి తాను ఎందుకు వెళ్లాడు? ఇప్పుడు ఎక్కడ ఉందో? ఏం చేస్తోందో? అసహనంగా అటూ ఇటూ తిరగడం మొదలు పెట్టాడు.

హఠాత్తుగా అతని చెవులకు నీళ్లు ధారగా పడుతున్న శబ్దం వినపడింది. జాగ్రత్తగా వినసాగాడు. బాత్‌రూమ్‌లో నుండి ఆ శబ్దం వస్తోందని గ్రహించడానికి అతనికి ఎంతో సమయం పట్టలేదు.

వేగంగా అటు వెళ్లాడు. బాత్‌రూమ్ తలుపు గెంటుకుని లోపలకు వెళ్లాడు సింధూర్. అక్కడి దృశ్యం చూస్తూనే అతడి నవనాడులూ స్తంభించిపోయినట్లు స్థాణువులా నిలబడ్డాడు. అతని కాళ్లకింద భూమి రెండుగా విచ్చిపోతున్నట్లు, తాను అందులో కూరుకుపోతున్నట్లు అనిపించింది.

అక్కడ బాత్‌టబ్‌లో పడుకుని ఉంది కైవల్య. ఆమె ఒళ్లంతా తూట్లుపడి ఉంది. ఆ గాయాలనుండి కారిన రక్తంతో ఆ టబ్‌లోని నీళ్లన్నీ ఎర్రబడ్డాయి. కైవల్య కళ్లు నిస్తేజంగా పైకి చూస్తున్నాయి.

'నిన్నటి జగన్మోహన సౌందర్యరాశి, వయ్యారాలకుప్ప, రత్నాలరాశి ఏది? కనిపించదే! ఆమె అందమంతా ఏమైపోయింది? అసలు ప్రాణభయంతో బెదురుతూ లేడిపిల్లలా గెంతే ఈమెను ఎలా చంపగలిగారు?

ఈ కష్టాలు, కన్నీళ్లు, బాధలు, భయాలూ ఏమీ లేనిచోటుకు వెళ్లిపోయిన నేస్తం! నీ ఈ దుస్థితికి కారకులైనవాళ్లను నేను వదిలిపెట్టను!' చాలాసేపటిదాకా అతడు ఆ షాక్ నుండి బయట పడలేదు. తెరుచుకుని ఉన్న కైవల్య కళ్లను మూసివేశాడు సింధూర్.

సరిగ్గా అదే సమయంలో ఎవరో వస్తున్నట్లు ముందు గదిలో అడుగుల శబ్దం వినపడింది. అతడు బయటకు వచ్చేలోగా ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ అక్కడికి వచ్చేశాడు.

"డోంట్ మూవ్ మిస్టర్! హత్య చేసి ఎవరూ తప్పించుకోలేరు!" అరిచాడు దత్తాత్రేయ. అతని వెనుక కొంతమంది కానిస్టేబుల్స్ అక్కడికి వచ్చారు.

"ఇన్‌స్పెక్టర్! ఈమెను నేను హత్య చేయలేదు. నేను వచ్చేసరికే కైవల్య చనిపోయి ఉంది!" చెప్పాడు సింధూర్.

"ఈ అమ్మాయి పేరు కైవల్యా?" అడిగాడు దత్తాత్రేయ.

"అవును."

"మరి నీ పేరు?"

"సింధూర్!"

"నీకేమవుతుంది?"

"ఏమీ కాదు, ఫ్రెండ్! అంతే."

"ఈమె తల్లిదండ్రులు ఎక్కడ ఉంటారు?"

"పై లోకంలో, ఇన్‌స్పెక్టర్! ఈమె కుటుంబం మొత్తం హత్యకు గురయింది. ఇప్పుడు ఈమెను కూడా చంపేశారు!" నిర్వికారంగా అన్నాడు సింధూర్.


"అయితే ఈ హత్యతో నీకు ఏ సంబంధమూ లేదంటావు?"

"లేదు. నేను ఇప్పుడే ఒక రెస్టారెంట్ నుండి వస్తున్నాను. కావాలంటే అక్కడ అడగండి!"

ఏమీ మాట్లాడలేదు దత్తాత్రేయ. అతని కూడా వచ్చిన సిబ్బంది ఇల్లంతా వెదుకుతున్నారు. కొద్దిసేపటికి ఒక కానిస్టేబుల్ ఒక ఎయిర్‌బాగ్‌తో దత్తాత్రేయ వద్దకు వచ్చాడు.

"సార్! ఈ బాగ్ చూడండి!" అన్నాడతను.

సింధూర్ కూడా ఆ బాగ్‌ను చూశాడు. అది నిశ్చల ఇచ్చిన బాగ్. అయితే అందులో ఒక జత బట్టలు ఉన్నాయి. ఆ బట్టలనిండా రక్తం వెదజల్లబడి ఉంది. ఒక కత్తి కూడా ఉంది. దానితోనే హత్య జరిగినట్లు తెలుస్తోంది.



తను హంతకుడయ్యాడు. నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. శత్రువులు చాలా తెలివిగా పథకం వేశారు.

దత్తాత్రేయ మొహంలో ఎక్కడలేని కాఠిన్యం వచ్చేసింది. సింధూర్‌వైపు తిరిగాడు. "మిస్టర్ సింధూర్! యువార్ అండర్ అరెస్ట్!" కటువుగా అన్నాడు.

ఒక కానిస్టేబుల్ హేండ్ కఫ్స్‌తో ముందుకు వచ్చాడు. సింధూర్ మౌనంగా చేతులు చాచాడు.

* * *

పెరట్లో తులసికోట దగ్గర కూర్చుంది సంయుక్త. తన మెడలోని గొలుసుని, ఆ గొలుసు చివర ఉన్న డ్రాగెన్ బొమ్మను చూస్తూ ఏదో ఆలోచించుకుంటోంది.

ఆమె పక్కనే కూర్చున్నాడు భరత్. సంయుక్త మెడలోని గొలుసు వాడికి కూడా విచిత్రంగా కనిపించింది.

"అక్కా! ఆ గొలుసు ఎప్పుడు కొన్నావు?"

"కొనలేదురా! మా నాన్నగారు పంపారు. ఆయన స్నేహితుడు తెచ్చి ఇచ్చాడు!" చెప్పింది సంయుక్త.

"మీ డాడీ ఎక్కడ ఉన్నారక్కా?" సందేహంగా అడిగాడు భరత్.

తెలియదన్నట్లు పెదవి విరిచి, భుజాలు ఎగరేసింది సంయుక్త. ఈలోగా అక్కడికి బామ్మ వచ్చింది. ఎప్పుడూ ఏదో ఒకటి చేసి గోలగోల చేసే అల్లరిమేళం కామ్‌గా కూర్చుని ఉండటం బామ్మలో అనుమానం రేకెత్తించింది.

"ఏమిటే ఆలోచిస్తున్నారు?" సాగదీస్తూ అడిగింది బామ్మ.

"ఏం లేదు, బామ్మా! భరత్‌గాడు కొత్తగా కాలేజీలో చేరబోతున్నాడు కదా! అక్కడ లెక్చరర్లను ఎలా ఏడిపించాలో నేర్పుతున్నాను!" అదే స్థాయిలో చెప్పింది సంయుక్త.

"నీ దగ్గర చిన్నపిల్లలను వదలడం చాలా ప్రమాదమే!"

"వీడు చిన్నపిల్లాడా? చాలా తప్పు, బామ్మా! వచ్చే సంవత్సరం వాళ్ల క్లాస్‌మేట్ ఎవరినో ప్రేమించానని తీసుకువస్తాడు చూడు!"

సంయుక్త ఆ మాట చెప్పగానే భరత్ తెగ సిగ్గుపడిపోవడం మొదలుపెట్టాడు. వాడి వాలకం చూసి బామ్మకు చిర్రెత్తుకొచ్చింది. "ఒరేయ్ కుర్రకుంకా! అలాంటి పిచ్చివేషాలు వేస్తే మీ అమ్మ సంగతి ఎలా ఉన్నా, నేను వాతలు పెడతాను, జాగ్రత్త!"

"లేదు, బామ్మా! అక్క వాళ్ల నాన్నగారి గురించి చెబుతోంది!" భయపడుతూ చెప్పాడు భరత్.

"దాని మొహం! వాళ్ల నాన్నను అది చూసి ఏడిస్తే కదా నీకు చెప్పడానికి!"

"అయితే చూడకుండానే ఏడిచానా బామ్మా!"

"ఏదో ఏడిశావులే!" కసిరింది బామ్మ.

"అది కాదు, బామ్మా! నాన్న మనల్ని ఎందుకు వదిలిపోయాడు? ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడైనా చెప్పవా! ప్లీజ్, బామ్మా!" బామ్మ గడ్డం పట్టుకుని బతిమాలుతూ అడిగింది సంయుక్త.

బామ్మ కళ్లలో క్షణంపాటు నీలినీడలు. మరిచిపోయిన బాధాకరమైన గతం కళ్లముందు కదలాడింది. అక్కడే నేలపైన చతికిలపడింది సంయుక్త. సంయుక్త ఆమె పక్కనే కూర్చుని ఆమె ఒళ్లో తల పెట్టుకుని పడుకుంది. సంయుక్త తల నిమురుతూ చెప్పసాగింది బామ్మ.

"ఒకప్పుడు మనం బాగా డబ్బున్నవాళ్లం. మీ తాతగారు స్వాతంత్ర్యసమరంలో సర్వం ధారపోశారు. మన ఆస్తిపాస్తులన్నీ అప్పుడే కరిగిపోయాయి. మీ నాన్న హయాం వచ్చేసరికి తిండికి కూడా వెదుక్కోవలసిన పరిస్థితి వచ్చేసింది. మీ నాన్న ఇంకా సంపాదనలో పడకుండానే నేను తొందరపడి పెళ్లి చేసేశాను. ఈలోగా నీవు కడుపులో పడ్డావు. నెలలు నిండేకొద్దీ ఇంట్లో కరువు ఏర్పడసాగింది.

"ఒకరోజు మీ అమ్మకు నొప్పులు వస్తుంటే గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాం. ఆరోజు ..." బామ్మ గద్గదకంఠంతో చెప్పసాగింది.

* * *

లేబరు గదిముందు నిలబడి ఉన్నాడు గణేష్. లోపలినుండి భార్య మూలుగులు వినపడుతున్నాయి. ఒకపక్కగా అతని తల్లి కూర్చుని ఉంది. ఆమె చాలా ఆదుర్దాగా, కంగారుగా ఉంది. "ఒరే, చిన్నోడా! ఈ గండం గడుస్తుందంటావా?" కొడుకునుద్దేశించి అంది.

అతను ఏమీ మాట్లాడలేదు. అతని ముఖంలో ఏ భావం ప్రస్ఫుటించడంలేదు. నిశ్చలంగా నిలబడి ఎదురుగా ఉన్న గోడపై మూలగా ఒక సాలెపురుగు గూడుకట్టడానికి చేస్తున్న ప్రయత్నం చూస్తున్నాడు.

"చిన్నోడా! ఈ గండం గడిచి తల్లీ, బిడ్డ క్షేమంగా బయటపడితే దేవుడికొండకు నడిచి వెళ్దాంరా!" మళ్లీ చెప్పిందామె.

గాజు కళ్లవంటి కళ్లతో మళ్లీ చూశాడు తల్లివైపు గణేష్. దేవుడైనా తనకు సహాయం చేస్తాడా? తల్లి పిచ్చిగానీ, తనవంటి పేదవాళ్లి దేవుడు మాత్రం ఎందుకు కనికరిస్తాడు?

ఆ మాత్రం సమయంలో ఏ ధనికుడికో సహాయం చేస్తే తన ఆలయానికి బంగారుపూత పూయిస్తాడు. ఏ మంత్రిగారికో సహాయపడితే తనకు బోలెడంత ప్రచారం చేసిపెడతాడు. కూటికోసం తిప్పలు పడే తమకు సహాయం చేస్తే ఏం వస్తుంది?

ఇంతలో అక్కడికి నర్సు వచ్చింది. గణేష్‌ను చూస్తూ చెప్పింది - "డాక్టరుగారు పిలుస్తున్నారు."

"వస్తా!"

ఆ నర్సు వెంట డాక్టరు రూమ్‌లోకి వెళ్లాడు గణేష్. ఆ డాక్టరు ముఖం కూడా అప్రసన్నంగా ఉంది.

"ఆమెకు సరైన ఆహారం ఇస్తున్నారా?" అడిగింది డాక్టర్.

జవాబు చెప్పకుండా తల వంచుకున్నాడు గణేష్.

"కడుపుతోవున్న మనిషికి సరైన తిండిపెట్టాలని కూడా మీకు తెలియదా?"

ఈసారి కూడా మౌనంగానే ఉన్నాడు గణేష్.

"కనీసం భార్య పోషణ చూడలేనివాడివి పెళ్లి ఎందుకు చేసుకున్నావు? భార్యకే తిండిపెట్టలేని వాడివి పిల్లల్ని ఎందుకు కనాలనుకుంటున్నావు?" కసిరింది డాక్టరు.

అప్పటికీ మాట్లాడలేదతను. పేదరికం మనిషిని అన్నివిధాలా అశక్తుడిని చేసేస్తుంది. కాళ్లకు, చేతులకు, నోటికి తాళాలు వేస్తుంది. దరిద్రాన్ని మించిన శాపం మనిషికి మరొకటి లేదు.

"ఇదుగో, ఈ మందులు తీసుకురాగలిగితేనే నీ భార్య, బిడ్డ నీకు దక్కుతారు! ఈ మందులు హాస్పిటల్‌లో లేవు. చాలా ఖరీదైన మందులు. ఎవరి కాళ్లు పట్టుకుంటావో, ఏం చేస్తావో... మొత్తానికి ఆ మందులు తీసుకురావాలి!" తన చేతిలోని చీటీ గణేష్‌కు ఇస్తూ చెప్పింది డాక్టర్.

అది తీసుకుని బయటకు నడిచాడు గణేష్. ఎక్కడికీ వెళ్లలేదతను. వెళ్లి నా ప్రయోజనం ఉండదని తెలుసు. ఇంట్లో చెంబూతపేళాలతో సహా

## అంకెల మహత్తు!

కరువుకాటకాల కారణంగా ఉత్తరకొరియాలో గత మూడేళ్లలో 20 లక్షల 50 వేలమంది అసువులు కోల్పోయారు.

* * *

అమెరికాలో 1982 నాటికి అత్యంత సంపన్నుల సంఖ్య కేవలం 13. మరి ఇప్పుడో ...170!

* * *

**1997లో** ఎవరెస్టు పర్వత సానువులనుంచి సేకరించిన 'చెత్త' 30 టన్నులు.

అమ్మేశారు. ఇంక అమ్మడానికి ఏమీ లేవు. తనను చూసి అప్పు ఇచ్చేవాడూ లేడు.

ఆ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఒక చెట్టుకింద కూర్చున్నాడు. ఆ డాక్టరమ్మ చెప్పింది నిజం. తనకే జరుగుబాటు లేనప్పుడు పెళ్లెందుకు చేసుకున్నాడు? పిల్లల్నెందుకు కనదల్చుకున్నాడు? పేదవాడికి పెళ్లిచేసుకునే హక్కుందా?

అతనిలో పొంగుకొస్తున్న ఉద్రేకం, ఏమీ చేయలేని అసహాయత అతని గుండె చుట్టూ పొరలుపొరలుగా కాఠిన్యాన్ని పెంచుతున్నాయి.

చాలాసేపటికి అతని తల్లి ఏడుస్తూ బయటకు వచ్చింది. "చిన్నోడా! ఆడపిల్ల పుట్టిందిరా! బిడ్డ బాగానే ఉంది కానీ, కోడలు మనల్ని వదిలి వెళ్లిపోయిందిరా!" ఏడుస్తూ చెప్పింది.




చటుక్కున లేచి నిలబడ్డాడు గణేష్. ఆసుపత్రిలోకి వెళ్లలేదతను. బయటకు నడిచాడు. పెళ్లాం పోయిన షాక్‌లో ఉన్నాడులే అనుకున్న అతని తల్లి అతన్ని ఆపే ప్రయత్నం చెయ్యలేదు.

రైల్వేస్టేషన్‌కు చేరాడతను. ఏదో ట్రెయిన్ కదలడానికి సిద్ధంగా ఉంది. పరుగున వెళ్లి ఎక్కేశాడు. కిటికీ పక్క సీటులో కూర్చుని ఊరివైపు చూశాడు. అతడు పుట్టిందీ, పెరిగిందీ ఆ ఊరిలోనే. ఇన్నాళ్లకు ఆ ఊరిని వదిలిపెట్టాల్సివచ్చింది.

'మనిషి బతకడానికి డబ్బు కావాలి. అందుకోసమే వెళ్తున్నాను. న్యాయమో, అన్యాయమో, నీతిగానో, అవినీతిగానో డబ్బు సంపాదిస్తాను. చెప్పలేనంతగా సంపాదిస్తాను!' కసిగా అనుకున్నాడు గణేష్.

రైలు మెల్లగా కదిలింది.

✲ ✲ ✲

**బా**మ్మ కళ్లు తుడుచుకుంది. "మీ నాన్న వెళ్లిపోయాక, వాడు ఏమయ్యాడో నాకు తెలియదు. నేను కూడా ఆ ఊరు వదిలి వచ్చేశాను. కష్టపడే వయసు దాటిపోయింది. చేతుల్లో కళ్లు తెరవని పసిగుడ్డు. భగవంతుడు నాకు ఆ శక్తి ఎలా ఇచ్చాడో తెలీదు. కష్టపడ్డాను. నిన్ను చదివించాను. ఈ ఊళ్లో ఒక ఇల్లు కూడా సంపాదించగలిగాను!" చెప్పింది బామ్మ.

సంయుక్తకు ఏడుపు వస్తోంది. ఇంటి మగవాడు అసమర్థుడిలా పారిపోతే, ఆడదయి ఉండీ తన బాధ్యత స్వీకరించింది బామ్మ. అది కూడా వయసుకాని వయసులో. ఎన్ని జన్మలెత్తితే బామ్మ రుణం తీరుతుంది?

సంయుక్త చెంపలపై ధారగా కన్నీరు కారుతోంది.

"ఛ!ఛ! పిచ్చిపిల్లా! ఏడవకే! నీ కళ్లనుండి నీరు రాకూడదనేగా నేను ఇంత పట్టుదలగా బతికింది!" చెప్పింది బామ్మ.

"కానీ నాకొకటి అర్థంకాలేదమ్మాయి. ముసలిదాన్నయి నేను ఇంత ధైర్యంగా నిలబడ్డానే, పడుచువాడైన మీ నాన్నకు బతుకంటే ఎందుకంత భయం?"

ఆ ప్రశ్నకు సమాధానం సంయుక్తకు కూడా తెలియదు. చాలామంది మనిషి బతుకే డబ్బు అనుకుంటారు. డబ్బు లేకుండా బతకలేమనుకుంటారు. డబ్బు మాత్రమే సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తుందనుకుంటారు.

అయితే ... మనిషి బతకడానికి డబ్బు కావాలి. నిజమే, కానీ డబ్బే మనిషి బతుకు కాకూడదు!

✲ ✲ ✲

**అ**ది పోలీస్‌స్టేషన్‌లోని లాకప్ గది. సింధూర్‌ను అరెస్ట్ చేశాక అతన్ని లాకప్‌లో ఉంచారు. ఎందుకనో దత్తాత్రేయ అతన్ని ఏమీ ప్రశ్నించలేదు. ఎస్.ఐ. కుమార్‌కి అతన్ని అప్పగించాడు. సింధూర్‌ని అరెస్ట్ చేసిన విషయం కూడా రహస్యంగా ఉంచాడు.

"నీ పేరేంటి బే!" లోపలకు వచ్చిన దృఢకాయుడు అడిగాడు.

"సింధూర్."

"ఏం చేశావు?"

"మర్డర్."

"అబ్బా! మర్డర్లు చేసేంత మొనగాడివా?" దగ్గరగా వస్తూ అడిగాడు.

సింధూర్ మాట్లాడలేదు. ఎందుచేతనో ఆ వ్యక్తి వ్యవహారం అనుమానంగా ఉంది. తనతో గొడవ పెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడతను.

సడెన్‌గా ఆ వ్యక్తి కుడిచెయ్యి అతి వేగంగా కదిలింది. కన్నుమూసి తెరిచేలోగా సింధూర్ తలవైపు దూసుకువచ్చింది. ఠక్కున తల వంచాడు సింధూర్.

బాక్సింగ్‌ప్రాక్టీస్‌లో అలాంటి లైట్నింగ్‌కిక్స్‌ను తప్పుకోవడం ప్రత్యేకంగా నేర్పుతారు. అలా తప్పుకోవడాన్ని డిఫెన్సింగ్ సబ్జెక్టుగా నేర్పుతారు. ఇంతకు రెట్టింపు వేగంతో నంబియార్ విసిరే పంచెస్‌నే చాలా సింపుల్‌గా తప్పుకుంటాడు సింధూర్.

ఆ విషయం తెలియని ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు. అతడు తేరుకునేలోగానే సింధూర్ కుడి పిడికిలి పిడుగులా ఆ వ్యక్తి గడ్డంకింద తాకింది. ఆ దెబ్బ ఎంత గట్టిగా తగిలిందంటే బాక్సింగ్‌ప్రాక్టీస్‌లో కాయలుకాసిన సింధూర్ చేతి వేళ్లు కూడా చిరచిరలాడి మంటపుట్టాయి.

వెనక్కు విరుచుకు పడిపోయాడతను. అతని నోటినుండి రక్తం ధారగా కారింది. పడ్డవాడు మళ్లీ లేవలేదు.

అందుకోసమే కాచుకున్నట్లు పోలీస్ కానిస్టేబుల్స్ గబగబా వచ్చి ఇద్దరినీ బయటకు తీసుకుపోయారు. అక్కడ ఒక డాక్టరు సిద్ధంగా ఉన్నాడు. ఇద్దరినీ పరీక్షించి హాస్పటల్‌లో చేర్చాలన్నాడు.

"అయాం ఆల్‌రైట్, డాక్టర్! హాస్పిటల్‌లో చేర్చాల్సింది అతన్ని!" చెప్పాడు సింధూర్.

"నో...నో...నిన్ను కూడా హాస్పిటల్‌లో చేర్చాలి. తప్పదు!" ఖచ్చితంగా చెప్పాడు డాక్టర్.

వెంటనే ఇద్దరినీ అంబులెన్స్‌లో ఎక్కించారు. లోపల ఇద్దరు పోలీసులు, ఇద్దరు కాంపౌండర్లు ఉన్నారు. సింధూర్ తలను సీటుకు ఆనించి కళ్లు మూసుకున్నాడు.

అతని ఎదురుగా స్ట్రెచర్‌పై దెబ్బలు తిన్న వ్యక్తి ఉన్నాడు. చిన్న కుదుపుతో అంబులెన్స్ బయలుదేరింది.

కొంతదూరం వెళ్లాక హఠాత్తుగా సింధూర్‌ని బయటకు నెట్టారు. వెంటనే అంబులెన్స్ కదిలి వేగంగా అక్కడనుండి వెళ్లిపోయింది.

ఆశ్చర్యపోయాడు సింధూర్. హత్యానేరంలో అరెస్టయ్యాడు తను. తనను అలా ఎందుకు వదిలేశారు. ఏం జరిగింది? రకరకాల అనుమానాలు తేనెతుట్టెను కమ్ముకునే తేనెటీగల్లా అతని మస్తిష్కాన్ని ముసురుకున్నాయి.

రోడ్డుపైనుండి లేచి బట్టలు దులుపుకున్నాడు సింధూర్. ఎదురుగా కనబడుతున్న ఒక మెడికల్‌షాపులోకి నడిచాడు. దత్తాత్రేయకు ఫోన్ చేయాలని అతని ఆలోచన. మెడికల్‌షాపులో కౌంటర్ దగ్గర ఉన్న వ్యక్తి ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. సింధూర్ దగ్గరకు రాగానే అడిగాడు -

"మీరేనా సింధూర్?"

"అవును."

"మీకు ఫోన్!" రిసీవర్ అందిస్తూ చెప్పాడతను.

సింధూర్ ఆశ్చర్యం రెట్టింపయింది. ఎవరు ఫోన్ చేసింది? సరిగ్గా ఆ సమయంలో తాను అక్కడికి వస్తానని ఎలా తెలిసింది?"

"హల్లో బాక్సర్! బావున్నావా?" అవతల ఎవరిదో కంఠం గరగరమంది.

"నువ్వెవరు?"

"మొన్నరాత్రి ఎవరిబారి నుండి ఒక ఆడపిల్లను తప్పించావో ఆమనిషిని."

"విక్రమ్...?"

"కాదు. వాడి బాస్‌ని. నీలా ఒళ్లు ఉన్నవాడికి బుర్ర ఉండదని నా నమ్మకం. అందుకే నిన్ను జైలు నుండి తప్పించాను. ఇప్పుడు నువ్వు ఆ హత్య చెయ్యలేదంటే ఎవరూ నమ్మరు. నిజానికి కైవల్యను నేనే చంపించాను. ఆ నేరం నీపై తోశాను. పోలీసుల్ని నీవు కొట్టి జైలు నుండి పారిపోయినట్లు సాక్ష్యం సృష్టించాను. ఇప్పుడు నువ్వు ఎదుర్కోవలసింది నన్ను, నా గూండాలను కాదు! పోలీస్‌డిపార్ట్‌మెంట్‌తో తలపడాలి. పోనీ, పోలీసులకు లొంగిపోవాలనుకో, కైవల్యను హత్య చేసిన నేరంపై, లాకప్‌నుండి పారిపోయిన నేరంపైన కొన్ని సంవత్సరాలు జైల్లో మగ్గిపోవాలి. ఎలా ఉంది మై డియర్?" హేళనగా నవ్వు వినపడింది.

"ఇడియట్"కసిగా తిట్టాడు సింధూర్.

"థాంక్స్!" అవతలివైపు ఫోన్ పెట్టేశారు.

తను కూడా రిసీవర్ పెట్టేసి వెనక్కి తిరిగాడు సింధూర్. అక్కడ నిలబడ్డ మనిషిని చూసి అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. తనను చూసి తికమక పడుతున్న సింధూర్‌ని చూసి చిరునవ్వు నవ్వాడా వ్యక్తి.

* * *

ప్రతి పట్టణంలోనూ సాధారణంగా కొంతమంది పోలీస్ ఇన్‌ఫార్మర్లు ఉంటారు. వాళ్లు పోలీసులు కారు. వాళ్ల వృత్తి వేరే ఉంటుంది. తమ ఏరియాలో అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపించినా, ఏదైనా నేరం జరుగుతున్నా వాళ్లు వెంటనే తమ జురిస్‌డిక్షన్‌కు తెలియజేస్తారు. ఆ ఏరియాలో తమ ఇన్‌ఫార్మర్‌ని కలిశాడు దత్తాత్రేయ. సోమూ ఇచ్చిన అడ్రెస్‌లోని అమ్మాయిగూర్చి వాకబ్ చెయ్యమన్నాడు. అరగంటలో ఆ అమ్మాయి జాతకం మొత్తం బయటకు వచ్చింది. ఆ అమ్మాయి పేరు నిశ్చల. క్లబ్‌లో డాన్సు చేస్తూనో, బ్లూఫిలిమ్స్‌లో యాక్ట్ చేస్తూనో, క్రిమినల్స్‌కు తలలో నాలికలా సహాయపడుతూనో, ఏదో ఒకలా డబ్బు సంపాదిస్తుంది. డబ్బు పారేస్తే ఏ పనైనా చేస్తుంది.

మరో అరగంటలో ఆమె ఎక్కడ ఉందో తెలిసింది. వెంటనే మందీమార్బలంతో అక్కడకు వెళ్లాడు దత్తాత్రేయ.

కానీ, అప్పటికే నిశ్చల తల మొండెం నుండి వేరైపోయింది. ఎవరో ఆమెను దారుణంగా హత్యచేసి ఆమె నోరు శాశ్వతంగా మూసేశారు. ఆ శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కు పంపుతూండగానే తెలిసింది మరో పిడుగులాంటి వార్త. సింధూర్ జైలునుండి తప్పించుకున్నాడు.


దత్తాత్రేయ పిడికిళ్లు కసిగా బిగుసుకున్నాయి.

* * *

మనం పేపరు తిరగేస్తే ఎక్కువగా కనిపించేవి బాంకుదొంగతనాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ మొదలైనవి. అయితే వీటన్నింటినీ మించినది వేరే ఉంది. చాపకింద నీటిలా ఏ మాత్రం అలికిడి లేకుండా జరిగే చోరీలు, విగ్రహాల దొంగతనాలు. ఈ విగ్రహాల దొంగతనాలు ప్రస్తుతం మనదేశంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. వీటికి ముఖ్యకారణం మనదేశంలో ఉన్న విగ్రహాలపై విదేశీయులలో ఉన్న మోజు. రెండో కారణం ప్రజల నిర్లక్ష్యం.

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న విగ్రహాలకు కాపలా ఉంటుంది. కొన్ని విగ్రహాలు మ్యూజియమ్స్‌లో ఉన్నాయి. ఇంతవరకు ఫరవాలేదు. కానీ స్థానికంగా గ్రామాల్లో ఉండే పురాతనదేవాలయాలే ఎక్కువ. వీటిలోనుండి విగ్రహాలు దొంగతనం చేయడం చాలా తేలిక. ఇటువంటి దొంగతనాలకు పెద్దగా ప్రచారం ఉండదు. అందువల్ల వాటి గురించి ఎవరూ పట్టించుకోరు. అయితే ఇక్కడ మనం ఆలోచించవలసింది ఒక మతం గూర్చి కాదు. కొంతమంది నమ్మకాల గూర్చి కాదు. మన దేశ ప్రాచీన సంపదను మన చారిత్రక వైభవాన్ని విదేశాలే అంత కొనియాడుతుంటే, లక్షలు ఖర్చుపెట్టి ఈ సౌందర్యాన్ని వాళ్లు కొనుక్కుంటుంటే ...

మనం మాత్రం ఏ కొంచెమూ వీటి విషయంగా జాగ్రత్తలు తీసుకోము. పున్నమి వెన్నెలలో మిలమిల మెరిసే తాజమహల్ సౌందర్యం మనకు పట్టదు. దానిపై బొగ్గుముక్కలతో పేర్లు రాస్తాము. చార్మినార్, కుతుబ్‌మీనార్‌వంటి కట్టడాలపై కిళ్లీపుమ్ములు ఊస్తాము. అపురూప శిల్పాలముక్కులు, చేతులు విరగ్గొట్టి ఆనందిస్తాము.




## కిడ్నీల కొరత!

మనదేశంలో కిడ్నీలు (మూత్రపిండాలు) పనిచేయక ఏటా లక్షమంది అనారోగ్యానికి గురవుతున్నారు. వీరికి మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్) ఆపరేషన్ చేయాలంటే దేశంలో కిడ్నీల దాతల సంఖ్య 1500 మందికిమించి లేరు. కిడ్నీలకు ఉన్న డిమాండ్‌తో ఆరోగ్యంగా ఉన్నవారు తమ కిడ్నీలలో ఒకటి అమ్మడానికి సిద్ధం అవుతున్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిషేధిస్తూ కేంద్రం ఇటీవల ఒక చట్టం చేసింది. బంధువులు తమ ఆమోదాన్ని తెలిపితేనే కిడ్నీల దానాన్ని ప్రభుత్వం అనుమతిస్తుంది.

చెడిపోయిన కిడ్నీలకారణంగా రోజూ డయాలసిస్ (రక్తశుద్ధి) కార్యక్రమం చేయాలంటే రోజుకు మనిషికి రు. 600లు ఖర్చవుతుంది. ఇంతకంటే లక్ష రూపాయలతో కిడ్నీ కొనుక్కుని ఆపరేషన్ చేయించుకోవడం ఉత్తమం అని కిడ్నీ వ్యాధిగ్రస్తులు అనుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఎటువంటి ధనాన్ని ఆశించకుండా కిడ్నీలు దానంచేస్తే ఎందరి జీవితాలో బాగుపడతాయి.

- కృష్ణాజీ

ఆరోజు పేపరులో పడ్డ ఆ న్యూస్ ఐటమ్ గూర్చి ఆలోచిస్తోంది సంయుక్త. ఆఫీసులో లంచ్‌అవర్‌లో పేపరు చూస్తూండగా కాలయముడి విగ్రహం దొంగతనంపై వచ్చిన ప్రత్యేకమైన ఆర్టికల్ ఆమె కంటపడింది. దానిలో ఆ విలేఖరి వెలిబుచ్చిన ఖండితమైన అభిప్రాయాలు ఆమెకు నచ్చాయి.

ఏ దేశ జాతీయసంపదను ఆ దేశ ప్రజలే కాపాడుకోవాలి. దీనికి మతంతో పనిలేదు. కులంతో పనిలేదు. కేవలం మేము భారతీయులం అనే భావన ఒక్కటే చాలు.

ఆలోచనల మధ్య నడుస్తున్న సంయుక్త పక్కన సడెన్‌బ్రేక్‌తో ఆగింది ఒక కారు. దాని టైర్లు కీచుమంటూ రొదపెట్టాయి. అదిరిపడి తలతిప్పింది సంయుక్త.

ఈలోగానే ఒక బలమైన హస్తం ఆమెను కారులోకి లాగింది. మరుక్షణం ఎక్కుపెట్టి విడిచిన బాణంలా ఆ కారు అక్కడనుండి కదిలిపోయింది.

చుట్టూ జనం నివ్వెరపోయారు. అయితే అది క్షణకాలం మాత్రమే. ఇటువంటివి నగరాలలో సామాన్యమే కనుక కాసేపటిలో ఎవరి పనుల్లో వాళ్లు మునిగిపోయారు.

సంయుక్తకు మాత్రం మతిపోయినంత పనయింది. తన ఎదురుగా ఉన్న ఆకారం ఆమెకు భయం గొల్పుతోంది. డోర్ తెరుచుకుని దూకెయ్యబోయింది. భుజంపై చెయ్యి వేసి వెనక్కు లాగాడు స్టీరింగ్‌ముందున్న దృఢకాయుడు. అంతేకాదు, లాగిపెట్టి ఆమె చెంపపై కొట్టాడు. ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది సంయుక్తకు.

"నా పేరు సదాశివం!"

స్పృహపోతున్న ఆఖరిక్షణంలో ఆ దృఢకాయుడి మాటలు వినిపించాయి. అయితే సదాశివం ఎవరో ఆమెకు తెలియదు.

* * *

"విక్రమ్ గురించి నేను ముందే మిమ్మల్ని హెచ్చరించాను, సార్! మీరు వినలేదు. ఇప్పుడు చూడండి, మీకోసం ఆ గూండాలే కాక, పోలీసులూ వెదుకుతున్నారు!" చెప్పాడు నరసింహం.

"ఆ విషయం వదిలెయ్! ప్రమాదమని తెలిసీ నేను ఈ విషవలయంలో అడుగుపెట్టాను. నాకు ఆ విక్రమ్ ముఠాగురించి భయం లేదు. కానీ ప్రజలను, శాంతిభద్రతలను కాపాడవలసిన మీ డిపార్ట్‌మెంట్ ఒక మామూలు నేరస్థుడి ముందు వంగివంగి సలామ్ చేస్తున్నదే, అదే నా బాధ!"

"అందరూ అలా లేరు, సార్! దత్తాత్రేయగారిని కలిస్తే ఆయన మీకు తప్పకుండా సాయం చేస్తారు."

తల అడ్డంగా ఆడించాడు సింధూర్. ఈ పరిస్థితిలో తనకు ఏ పోలీసు అధికారీ సహాయం చెయ్యడు. ముందు తను విగ్రహం సంపాదించాలి. ఆ తర్వాత ఈ పోలీసుల విషయం జైలర్‌సాబ్ చూసుకుంటారు.

జైలులోనుండి బయటపడ్డ సింధూర్‌కు నరసింహం కనిపించాడు. ఇద్దరూ కలిసి నరసింహం ఇంటికి వచ్చేశారు.

నరసింహం బ్రహ్మచారి. అందుకు కారణం లేకపోలేదు. నరసింహానికి ఒక తమ్ముడుండేవాడు. వాడు ఈ స్మగ్లింగ్ గొడవల్లో విక్రమ్ ముఠాకు వ్యతిరేకంగా పనిచేశాడు. కక్షగట్టిన విక్రమ్ నరసింహం తమ్ముడిని చంపేశాడు. అడ్డం వచ్చిన అతని తల్లిదండ్రులను కూడా నరికివేశాడు. అప్పుడు ఊళ్లో లేనందువల్ల నరసింహం బతికిపోయాడు. ఆ రోజునుండి విక్రమ్ పతనం కోసం ఎదురు చూస్తున్నాడు నరసింహం.

"సార్! నేను దత్తాత్రేయగారిని కలిసి మొత్తం విషయమంతా చెబుతాను. ఈలోగా మీరు ఆ విగ్రహం సంపాదించండి!" చెప్పాడు నరసింహం.

"ఆ విగ్రహం వెదకాలంటే దాని ఆచూకీ తెలిసిన ఒకే ఒక అమ్మాయి ఉంది. ఆమెను పట్టుకోవాలి. సమస్య ఏమిటంటే ఆ అమ్మాయి ఎక్కడ ఉంటుందో తెలియదు."

"ఆమె గురించి విక్రమ్‌కు తెలుసా?"

"తెలుసుననుకుంటాను. కైవల్య చెప్పి ఉండవచ్చు!" చెప్పాడు సింధూర్.

నరసింహం లేచాడు. అదే గదిలో టేబుల్‌పై ఉన్న ఫ్లాస్క్‌లోనుండి కాఫీ రెండు గ్లాసుల్లోకి వంచాడు. ఒకటి సింధూర్‌కి ఇచ్చి, ఆ తర్వాత చెప్పాడు - "ఆ అమ్మాయిని విక్రమ్ ఈపాటికే పట్టుకుని ఉంటాడు, సార్! బహుశా ఆ రహస్యం కూడా చెప్పించి ఉంటాడు."

ఆ మాట నిజమే అనుకున్నాడు సింధూర్. ఆ ఊహ రాగానే తాగుతున్న కాఫీ చేదుగా అనిపించింది.

"అంతేకాదు, సార్!" తిరిగి చెప్పాడు నరసింహం. "మీరు ఎవరికోసం ఇంత రిస్క్ తీసుకుంటున్నారో వాళ్లను కూడా పట్టుకుని ఉంటాడు!"

జైలర్‌సాబ్ గుర్తుకురాగానే తుళ్లిపడి లేచాడు సింధూర్.

* * *

తలపై ఎవరో సమ్మెటతో బాదుతున్నట్టు అనిపించి కళ్లు తెరిచింది సంయుక్త. అదే సమయంలో మొహంపైన ఎవరో నీళ్లు కొట్టారు. చల్లటినీళ్లు ఒక్కసారిగా మీదపడటంతో ఉక్కిరిబిక్కిరి అయింది సంయుక్త.

"కళ్లు తెరిచి ఇటువైపు చూడు!" ఎవరిదో కంఠం బొంగురుగా వినిపించింది.

కళ్లు విప్పి చుట్టూ చూసింది సంయుక్త. ఎదురుగానే ఉన్నాడు సదాశివం. అతడే తనను కిడ్నాప్ చేసి తీసుకొచ్చింది.

సంయుక్త తనవైపు చూడగానే చిన్న చిరునవ్వు నవ్వాడు. నవ్వినప్పుడు అతని పెదవులు వంకర తిరిగి ముఖంలోని క్రూరత్వాన్ని రెట్టింపు చేశాయి.

"మిస్! నీ పేరు?" ప్రశ్నించాడు సదాశివం.

"సంయుక్త."

"ఏం చేస్తున్నావు?"


"జాక్సన్ కంపెనీలో క్లర్క్‌ని."

"మరి ఉద్యోగం చేసుకునేదానివి నీకు విగ్రహాల గొడవ ఎందుకు?"

"ఏ విగ్రహం?" ఆశ్చర్యంగా అడిగింది సంయుక్త.

ఆమె జుట్టుపట్టుకుని తల పైకెత్తాడు సదాశివం.

"సంయుక్తా! నీవు చాలా చిన్నదానివి. నేను ఈ వృత్తిలో రాటుదేలిపోయినవాడిని. నేను పెట్టే హింసలు భరించడం నీ వల్ల కాదు!



కోటిలింగం ఆ యముడి విగ్రహం ఎక్కడ దాచాడో నీకు చెప్పాడు. ఆ సంగతి నాకు తెలుసు. మర్యాదగా అది ఎక్కడ ఉందో చెప్పేయడం నీ ఒంటికి మంచిది!" కర్కశంగా అన్నాడు సదాశివం.

"ఆ విగ్రహం సంగతి నాకేమీ తెలియదు. ఏదో విగ్రహం పోయినట్లు మాత్రం పేపర్లో చదివాను. మీరు చెప్పే కోటిలింగం ఎవరో నాకసలు తెలియదు!"

అంతే! ఆ మాటతో సదాశివం ముఖంలోకి ఎక్కడలేని క్రౌర్యం వచ్చేసింది.

"కోటిలింగం ఎవరో తెలియకుండానే ఆ రోజు వాడితో బస్‌స్టాప్‌లో మాట్లాడావా?" జుట్టు మరింత గట్టిగా పట్టుకుని లాగుతూ అడిగాడు సదాశివం.

సంయుక్త తలలో నరాలు జివ్వుమన్నాయి. ముఖంపై స్వేదబిందువులు ఆవిర్భవించాయి. అదే సమయంలో ఆమె మెదడులో మెరుపు మెరిసింది. ఆ రోజు తన తండ్రి స్నేహితుడనని చెప్పినవ్యక్తి ఇతని స్నేహితుడై ఉంటాడు. అదే నిజమైతే ఆ విగ్రహం గురించిన రహస్యం తన మెడలోని లాకెట్‌లో ఉండితీరాలి. అంతకుముందు పేపర్లో చదివిన విశేషాలు ఆమె కళ్లముందు మెదిలాయి. ఆమెలో మొండి పట్టుదల వచ్చేసింది. తన దేశానికి చెందిన అపురూపమైన కళాఖండమది. దానికి ఇటువంటి కిరాతకులపాలు చెయ్యకూడదు!

"చెప్పు, ఆ విగ్రహం ఎక్కడ ఉంది?" కఠినంగా అడిగాడు సదాశివం.

"నాకు నిజంగా తెలియదు!"

సంయుక్త ముఖంపై పడిందో దెబ్బ. సంయుక్త పెదవులు చిట్లి రక్తం నోటికి ఉప్పగా తగిలింది.

"నన్ను హింసించి ప్రయోజనం లేదు. కోటిలింగం గురించి గానీ, ఆ విగ్రహం గురించిగానీ నాకేమీ తెలియదు!"

కసిగా పళ్లు బిగించాడు సదాశివం. సంయుక్త చేతులు తాడుతో వెనక్కి బిగించి కట్టేశాడు. జేబులోంచి అగ్గిపెట్టె తీసి అక్కడే బల్లపై ఉన్న కొవ్వొత్తిని వెలిగించాడు.

కళ్లు పెద్దవి చేసి అతడు చేసే పనులను భయంగా చూస్తోంది సంయుక్త.

ఆమె కళ్లలో భయాన్ని గుర్తించి శాడిస్టిక్‌గా నవ్వాడు సదాశివం. చేతిలో వెలుగుతున్న కొవ్వొత్తి ఆమె ముఖంపై వంచాడు. కాలుతున్న మైనం సంయుక్త బుగ్గలపై పడింది.

విపరీతమైన బాధతో కెవ్వున అరిచిందామె.

మరోసారి ఆమె ఎడమబుగ్గపైకి వంచాడు.

సర్రున కాలింది ఆ భాగమంతా!

ఇంతలో బయట ఏదో శబ్దం వినిపించడంతో చేతిలోని కొవ్వొత్తిని నేలపైకి విసిరికొట్టి లేచి నిల్చున్నాడు. "నీ శరీరంలో ఏ భాగానికి ఆ భాగం కోసైనా నీ చేత నిజం చెప్పిస్తాను. ఈ సదాశివం సంగతి నీకు సరిగ్గా తెలియదు!" అని బయటకు నడిచాడు.

నీళ్లు నిండిన కళ్లతో చుట్టూ చూసింది సంయుక్త. అది ఒక చెక్కల గది. బహుశా పై అంతస్తులో ఉండి ఉండవచ్చు. ఏదో పాతమేడలో తనను బంధించాడు. తిరిగి వచ్చాక తనను బతకనిస్తాడన్న నమ్మకం లేదు. ఒకవేళ విగ్రహం రహస్యం చెప్పేసినా తనను బతకనివ్వడు. ఈలోగానే తాను తప్పించుకుంటే ....?

కానీ ఎలా ...?

ఆమె కళ్లకు కొద్ది దూరంలో నేలపై పడి ఉన్న కొవ్వొత్తి కనిపించింది. మెల్లగా దేకుతూ అక్కడికి చేరింది సంయుక్త.

వెనక్కు విరిచికట్టి ఉన్న చేతులను ఆ కొవ్వొత్తి మంటవైపు చాచింది. సదాశివం వచ్చేలోగా ఆ తాడు అంటుకుంటే తన చేతులు వదిలించుకోవచ్చు. అయితే కొవ్వొత్తి ఎక్కడ ఉందో సరిగ్గా కనిపించడంలేదు. అందువల్ల చేతులు కాలి బొబ్బలెక్కుతున్నాయి. అయినా అలాగే ప్రయత్నిస్తోంది సంయుక్త.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆమెకు భయంభయంగా ఉంది. ముచ్చెమటలు ఆమె దేహాన్ని తడిపి ముద్దచేస్తున్నాయి. ఏ క్షణంలోనైనా సదాశివం లోపలికి రావచ్చుననే భయంతో ఆమె దేహం చిగురుటాకులా కంపిస్తూనే ఉంది.

కొద్దిక్షణాల్లోనే ఆమె చేతులను బంధించి ఉంచిన తాడు అంటుకుంది. క్షణాలమీద చేతులు విదిలించి లేచి నిల్చుంది సంయుక్త. కళ్లు మసకలు కమ్మి శరీరం తూలినట్లయింది.

ఈలోగా గది బయట అడుగుల శబ్దం వినిపించింది. మెరుపులా తను ఉన్న గది తలుపు లోపలివైపు గడియ వేసేసింది. అయితే ఆ తలుపు తనను రక్షిస్తుందన్న ఆశ లేదు. ఎందుకంటే అది చెక్క తలుపు! పైపెచ్చు ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా ఉంది.

భయంగా చుట్టూ చూసింది. అక్కడే పళ్లెంలో కొన్ని పళ్లు, వాటిని కోసుకోవడానికి కత్తి ఉంది. దానిని తీసుకుని గుప్పిట బిగించి పట్టుకుని నిలబడింది సంయుక్త.

చేతిలో విస్కీబాటిల్ సిప్ చేస్తూ అక్కడకు వచ్చాడు సదాశివం. గది తలుపులు లోపలినుండి బంధించి ఉన్నాయని అర్థమయిందతనికి. కోపంతో తలుపులు దబదబా బాదసాగాడు. చేతిలో ఉన్న విస్కీబాటిల్ ఆ చెక్క తలుపుకేసి కొట్టాడు. సీసా పగిలి, దానిలోని లిక్కర్ ఆ తలుపును పూర్తిగా తడిపేసింది. ఒక్క క్షణం మౌనంగా నిలబడి ఆలోచించాడు సదాశివం.

తలుపు గడియ ఏ ప్రాంతంలో ఉంటుందో, సరిగ్గా దానిపైన పిడికిలి బిగించి బలంగా గుద్దాడు. అక్కడ చెక్క కొంతమేర చీలింది. ఆ చీలికలోనుంచి లోపలకు చెయ్యి పెట్టాడు.

సంయుక్తకు గది బయట జరుగుతున్న హడావుడి తెలుస్తూనే ఉంది. ఇప్పుడు తను ఎలా తప్పుకోవాలా అని ఆలోచిస్తున్నదామె. వెనుకవైపు ఒక కిటికీ ఉంది. దానిలోపలనుండి బయటకు వెళ్లొచ్చు. అటు కదలబోయింది.

ఇంతలో తలుపు బద్దలై ఒక చెయ్యి లోపలకు వచ్చి తలుపు గడియకోసం వెతకసాగింది. ఆ తలుపు గనుక తీస్తే తన పని ఆఖరే. చేతిలో ఉన్న కత్తిని తలుపుమీద ఉన్న చేతిపై బలంగా దించింది.

ఆ చేతిని చీల్చుకుంటూ తలుపులో దిగబడిపోయింది కత్తి. చివ్వున రక్తం చిమ్మింది. దిగంతాలు దద్దరిల్లేలా అరిచాడు సదాశివం.

అయితే అంతకు రెట్టింపు కేక వేసింది సంయుక్త. తలుపుకు పిన్ చేయబడ్డ చేతిని చూస్తే ఆమెకు భయంగానూ, అసహ్యంగానూ ఉంది. ఆ చేతినుండి కారిన రక్తం తలుపు దగ్గర మడుగులా అవుతోంది.

సదాశివానికి నరకం అంటే ఏమిటో తెలిసివస్తోంది. బిగ్గరగా అరుస్తూ తలుపు పగలగొట్టసాగాడు. ఒంటిచేత్తో ఆ పని సాధ్యం కావడంలేదు. కానీ సంయుక్తకు ఆ తలుపు బద్దలైపోతున్నట్లే అనిపించసాగింది.

సరిగ్గా ఆ సమయంలో తలుపుకింద నుండి లోపలకు ప్రవహించిన ఆల్కహాల్ అక్కడ ఉన్న కొవ్వొత్తిని తాకింది.

## అంకెల మహత్తు!

**2040వ** సంవత్సరం నాటికి ప్రపంచజనాభా 7.7 బిలియన్లకి చేరుకుంటుంది! (పదిలక్షలు ఒక మిలియన్; వంద మిలియన్లొక బిలియన్!) అయితే 2150వ సంవత్సరంనాటికి, ఈనాటికున్న ప్రపంచ జనాభాలో 2/3వ వంతుకి - అంటే 3.6 బిలియన్లకి పడిపోతుందని తాజా సమాచారం!

✣ ✣ ✣

గుజరాత్‌లోని కాండ్లా సమీపంలో తుపాను కారణంగా అరేబియా సముద్రతీరంలో నివసించే ఉప్పు ఉత్పత్తి చేసే కార్మికులు 20,000 మంది చనిపోయారట!

అంతే! ఆ మంట క్షణాల్లో తలుపుని ఆక్రమించి పెనుజ్వాలగా మారిపోయింది. గింజుకుంటున్న సదాశివాన్ని ఆ జ్వాలలు సజీవదహనం చేయసాగాయి. పిచ్చిపిచ్చిగా, భయంభయంగా, భీతావహంగా సదాశివం పెడుతున్న కేకలతో ఆ ప్రదేశం దద్దరిల్లింది! సజీవదహనం!

గిర్రున వెనుతిరిగి కిటికీ దగ్గరకు పరుగెత్తింది సంయుక్త. ఊరికి చాలా దూరంగా ఉన్నదా చెక్కల మేడ. చుట్టూ ఇసుక ఉన్న నేల కింద లోతుగా ఉంది. వెనుతిరిగి చూసింది.

మంటలు ఆ గదిని ఆక్రమించేశాయి. కాసేపు ఉంటే తనకూ సదాశివానికి పట్టిన గతే పడుతుంది! వెనుకాముందూ చూడకుండా బయటకు దూకేసింది. నేల వేగంగా ఎదురువచ్చింది. తల పగలలేదు. కానీ నడుము విరిగినట్లయింది. లేచి దూరంగా పరుగెత్తింది.

అక్కడ రోడ్డువారగా ఉంది సదాశివం తనను తీసుకువచ్చిన కారు. అయితే సంయుక్తకు డ్రైవింగ్ రాదు. ఆమె ఒక సాధారణ మధ్యతరగతి అమ్మాయి. ప్రాణాపాయ పరిస్థితి ఆమెలో తెచ్చిన తెగింపువల్ల అంత సాహసం చేసింది, కానీ లేకుంటే ఆమె ఒక ముద్దమందారం.

దూరంగా ఒక కారు వస్తూ కనబడింది. గబగబా చేతిని ఊపుతూ రోడ్డు మధ్యకు వచ్చింది సంయుక్త. కారులో ఉన్న పురుషాకారం ఆమెను గుర్తుపట్టినట్లు తలాడించింది.

వేగంగా వచ్చిన కారు ఆమె పక్కనే సడెన్‌బ్రేక్‌తో ఆగింది.

* * *

చీకట్లో మాటువేసిన పులిలా కూర్చున్నాడు సింధూర్. ఎదురుగా ఉన్న భవంతివైపు చూస్తున్నాడు. దాదాపు అరగంట నుంచి అక్కడే కాపువేసి ఉన్నాడు. అతనికి విక్రమ్ అనుచరులు ఆ చుట్టుపక్కలే ఉంటారనిపిస్తోంది. అందుకే లోపలకు వెళ్లడానికి తటపటాయిస్తున్నాడు. మనసులో మాత్రం మాధవరావుగారు ఎలా ఉన్నారో అని పీకుతోంది.

అంతే కాదు, విక్రమ్‌ది కేవలం పశుబలం మాత్రమేనని, ఆ బలం వెనుక ఉన్న మేధ వేరొకరిదని కూడా తెలుస్తోంది. కానీ ఆ తెరవెనుక మనిషి ఎవరో తెలియడంలేదు.

ఎదురుగా ఆ పాతకాలపు భవంతి జడలు విప్పుకుని నిలబడ్డ బ్రహ్మరాక్షసుడిలా ఉంది. లోపల ఏదో జరుగుతోందనిపించి లేచి నిలబడ్డాడు సింధూర్. ముఖద్వారంవైపు వెళ్లలేదు. వెనుకవైపు నడిచాడు. ఎత్తుగా ఉన్న ప్రహరీగోడ కనబడింది. రెండడుగులు వెనక్కు వేశాడు. జింకలా ముందుకు పరుగెత్తాడు. గోడను సమీపిస్తూనే పక్షిలా గాల్లోకి లేచి గోడను రెండు చేతులతో పట్టుకున్నాడు. శరీరాన్ని మెల్లగా గోడపైకి చేర్చాడు.

కాసేపు అక్కడే ఉండి జాగ్రత్తగా లోపలకు చూశాడు. ఆ భవంతిలోగానీ, చుట్టూ ఉన్న తోటలోగానీ ఏ విధమైన అలికిడి లేదు. కానీ ఖచ్చితంగా ఆ సమయంలో అక్కడ ఏదో జరిగిందనిపిస్తోంది. లోపలకు వెళ్లి చూడాలనే నిర్ణయానికి వచ్చాడు.

లోపలివైపుకు దూకాడు. చెట్లచాటున ముందుకు కదిలాడు. ఆ బిల్డింగ్‌కి కొద్దిదూరంలో ఉందో మామిడిచెట్టు. గబగబా అది ఎక్కేశాడు. దాని కొమ్మ పై అంతస్తుపైకి వాలి ఉంది. ఆ కొమ్మద్వారా బిల్డింగ్‌లోకి చేరాడు.

వెనుకవైపు తలుపు గెంటుకుని లోపలకు వెళ్లాడు. ముందుగా ఎదురైంది బెడ్‌రూమ్. అక్కడ ఎవరూ లేరు. లోపలకి నడిచాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా ఎవరూ కనిపించలేదు. చప్పుడుకాకుండా మెట్లు దిగి కిందకు వచ్చాడు.

అక్కడ ...

ఆ మెట్లకు ఎదురుగా ...

బల్లపై పడుకోబెట్టబడి ఉందా ఆకారం. కాళ్లనుండి తలదాకా తెల్లని దుప్పటి కప్పబడి ఉంది. దడదడలాడుతున్న గుండెలతో దానిని సమీపించాడు సింధూర్. వణుకుతున్న చేతులతో దుప్పటిని తొలగించాడు.

మాధవరావుగారి శవం ఉందక్కడ. బరువైన సుత్తులతో మోదినట్లు ఆయన శరీరమంతా నజ్జునజ్జయిపోయింది. చనిపోయేముందు ఆ వృద్ధుడు అనుభవించిన బాధ ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ హత్య ఎవరో కిరాయిగూండా చేసింది కాదనీ, బాక్సింగ్ బాగా వచ్చిన మనిషి చేసిందని చూడగానే అర్థమవుతోంది.


కాసేపు తన ముందున్న దృశ్యం కలో, నిజమో అర్థంకాలేదు సింధూర్‌కి. అర్థమయ్యాక బిడ్డను కోల్పోయిన అడవిజంతువులా భీకరంగా అరిచాడు. కళ్లలో నిండిన నీళ్లకు ముందున్నదంతా మసకమసకగా కనిపిస్తోంది.

ఏ దేవుడి దయ వల్ల తనకు సమాజంలో ఒక స్థానం లభించిందో, ఆయనని ఇలా శవరూపంలో చూడవలసివచ్చింది. తనపైన పగతో వయసుమీరిన వ్యక్తి అని చూడకుండా ఆయనను దారుణంగా చంపివేశారు.

సింధూర్ కళ్లలో ఎరుపురంగును అతని కన్నీళ్లు తుడిచి వేయలేకపోతున్నాయి.

"ఏం సింధూర్, బాధగా ఉందా?" ఎవరిదో ఒక కంఠస్వరం ప్రశ్నించింది.

చివ్వున తల తిప్పి అటు చూశాడు సింధూర్.



## నఖాలంకరణ

వేళ్లకు, గోళ్లకు ఒకప్పుడు గోరింటాకు సంప్రదాయంగా వుండేది. ఆ తరువాత ఆ స్థానాన్ని నెయిల్ పాలిష్ ఒక ఫ్యాషన్‌గా మారి ఆక్రమించింది. మళ్లీ కొంతకాలంపాటు కనుమరుగైన ఈ నెయిల్ పాలిష్ ప్రస్తుతం చాలా ప్రాచుర్యంలో వుంది. ఇది ముదురు, తేలిక రంగుల్లో రెండు విధాలుగా వుంటుంది.

ముదురు రంగులు చాలా ఆకర్షణీయంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. కాని వీటిని మెయిన్‌టెయిన్ చేయడం కష్టం. కాస్త పోయినా, గోళ్లు విరిగినట్లూ, మచ్చలున్నట్లూ అసహ్యంగా కనిపిస్తాయి. ముదురు రంగుల నెయిల్ పాలిష్‌లు కాళ్ల నఖాలంకరణకు చాలా బాగుంటాయి.

తేలిక రంగుల లేదా లైట్ కలర్ నెయిల్ పాలిష్‌ల విషయంలో మెయిన్‌టెనెన్స్ గొడవ వుండదు. వీటిలో కేండీ పింక్, లావెండర్ బ్లూ, పసుపుపచ్చ రంగులు చాలా బావుంటాయి. ఇంకా చాలా రంగులున్నాయి. అస్సలు రంగులేని-కలర్‌లెస్-నెయిల్ పాలిష్ వేసుకున్నా గోళ్లు సహజసిద్ధంగా ఆహ్లాదం కలిగిస్తాయి. ఈ నెయిల్ పాలిష్ గోళ్లకు కొత్త అందం కలిగిస్తుంది. నెయిల్ పాలిష్ వేసుకునే ముందు వైట్ వార్నిష్ ఓ కోటింగ్ వేసుకుని, దానిమీద ఇష్టమైన రంగు వేసుకుంటే గోళ్లు చాలా సహజంగా కనబడతాయి.

**జలజ**

ఒక ఆంగ్లోఇండియన్ నిలబడి ఉన్నాడక్కడ. ఎర్రటిరంగులో, గొరిల్లాలాగా బలిష్టమైన శరీరంతో ఉన్నాడతను. నున్నటి అతని ముఖంలో కాఠిన్యమే తప్ప మృదుత్వం కానరావడంలేదు.

అతడు ...

విల్లీఫోర్డ్!

ఈ దేశంలో సింధూర్ ఎదుర్కోవలసిన అంతిమ బాక్సింగ్ ప్రత్యర్థి.

"మా జోలికి రావద్దని ముందే హెచ్చరించాము. విన్నావా? ఫలితం చూడు! నీవల్ల ఒక ఆడపిల్ల, ఒక ముసలాయన చచ్చిపోయారు!" వెటకారంగా అన్నాడు విల్లీఫోర్డ్.

ఉల్కాపాతంలా అటు కదిలాడు సింధూర్. అతని కదలికలను గమనిస్తూనే పిడికిలి బిగించి విసిరాడు విల్లీఫోర్డ్.

ఠక్కున ఎడమచేతితో దానిని బ్లాక్‌చేశాడు సింధూర్. క్షణాల వ్యవధిలో శరీరంలో మొత్తం శక్తిని కుడిచేతిలోకి తెచ్చుకుని ఒక మిడిల్ పంచ్ కట్‌చేశాడు.

ఆ దెబ్బ తగిలితే మామూలు మనుషులు వెంటనే స్పృహ కోల్పోతారు. కానీ విల్లీఫోర్డ్ నిజంగా ఉక్కుమనిషి. అతని ముఖంలో బాధ మచ్చుకైనా కానరాలేదు. అయితే క్షణాలమీద ఆ గదిలోకి రకరకాల ఆయుధాలతో కొంతమంది వచ్చేశారు.

సింధూర్‌లో ఏ మాత్రం కదలిక కనిపించినా వాళ్లు ఆయుధాలు ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నారు.

"నీతో ఇక్కడ ఫైట్ చేయదలుచుకోలేదు మాన్! వుయ్ విల్ మీట్ ఇన్ ది ఎరీనా!" చెప్పాడు విల్లీఫోర్డ్.

బలవంతంగా ఆవేశాన్ని అదుపుచేసుకున్నాడు సింధూర్. కళ్లు మూసుకుని మనసుని స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

"అయితే ఈ ముఠానాయకుడివి నువ్వేనన్నమాట?" అడిగాడు.

"కాదు. నాపైన వేరే వ్యక్తి ఉన్నాడు. ఆయనను నేనెప్పుడూ చూడలేదు. కానీ అతనే మా బాస్!" ఒక్క క్షణం ఆగి తిరిగి చెప్పాడు -"నిన్ను నేను బాక్సింగ్ ప్రత్యర్థిగానే గౌరవిస్తాను. మిస్టర్ సింధూర్! నిన్ను ఎరీనాలోనే ఎదుర్కొంటాను. అక్కడే నీ పొగరణుస్తాను!"

సూటిగా అతనిముఖంలోకి చూశాడు సింధూర్.

"నీ కోరిక తీరుస్తాను, మై డియర్! బాక్సింగ్ రింగ్‌లోనే నిన్ను లీగల్‌గా చంపేస్తాను!" పళ్లు బిగిస్తూ చెప్పాడు సింధూర్.

* * *

**త**న చేతిలో కెమెరారీలు మరోసారి చూసుకున్నాడు ద్వారకానాథ్. అందులో ఉన్న ఫొటోలను తలుచుకోగానే వెన్నులోనుండి జలదరింపు పైకి తన్నింది. అప్రయత్నంగా గుండెలపై చెయ్యి వేసుకున్నాడు.

ఆ రోజు కైవల్య హత్య జరిగినరోజు తీసిన ఫొటోలవి. వాటిని అర్జెంటుగా డెవలప్ చేయించి పోలీసులకు అందజేయాలి. అప్పుడు తన పేరు అన్ని పేపర్లలో వస్తుంది. తనకు గొప్ప డిటెక్టివ్‌గా చాలా కీర్తి వస్తుంది. ఒక అత్యంత క్లిష్టమైన కేసును క్షణాలపైన సాల్వ్ చేసి హీరోగా అందరిముందూ సగర్వంగా నిలబడతాడు. చుట్టూ పత్రికావిలేఖరులు తనను ప్రశ్నలు వేస్తూ, ఫొటోగ్రాఫర్స్ ఫొటోలు తీస్తూంటారు.

అవునూ, అప్పుడు తాను ఏం చేయాలి? డిటెక్టివ్ యుగంధర్‌లా తలవంచుకుని వినయంగా 'నేను దేశం కోసమే పుట్టాను' అనాలా? లేకపోతే వాలిగారిలా చుట్ట ముట్టించి పడకకుర్చీలో కూర్చుని అర్ధనిమీలితనేత్రాలతో జవాబులు చెప్పాలా? లేక జేమ్స్ బాండ్‌లా ..."

"ఓయ్! కళ్లు తెరుచుకుని నడవవయ్యా! లేకపోతే స్వర్గానికి పోతావ్!" ఎదురుగా వస్తున్న వ్యక్తి మందలించాడు.

కానీ ఊహాలోకంలో ఉన్న ద్వారకానాథ్‌కు ఆ మాటలు వినబడలేదు. తన లోకంలో తాను ఉన్నాడు.

ఆ వ్యక్తి కూడా చిత్రమైన మనస్తత్వం కలవాడు. కనిపించిన ప్రతి రంధ్రంలోనూ వేలుపెట్టే తత్వం కొంతమందిలో కనిపిస్తుంది. ఆ వ్యక్తి కూడా అదే బాపతు. నిద్రలో నడుస్తున్నట్లున్న ద్వారకానాథ్ భుజంపై చెయ్యి వేశాడు.

అంతే! ద్వారకానాథ్ సిక్త్ సెన్స్ పనిచేయడం మొదలుపెట్టింది. గబుక్కున మోకాళ్లపై కూర్చుని కాలి బూటుకున్న ప్రత్యేకమైన అర నుండి డాగర్‌ను విసురుగా బయటకు తీశాడు.

ఎదురుగా ఉన్న పెద్దమనిషి పెద్దగా అరిచి వెనక్కు తిరిగి చూడకుండా పరుగులు పెట్టాడు.


అప్పటికి ఈ లోకంలోకి వచ్చాడు ద్వారకానాథ్. తనచేతిలోని కత్తి దాచబోయాడు. కానీ అప్పటికే జరగవలసిన డామేజ్ జరిగిపోయింది. రోడ్డుపై నడిచే ప్రజలందరూ ద్వారకానాథ్‌ను టెర్రరిస్టులా చూడసాగారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్స్ నిముషాలపై వచ్చేశారు.

చురకత్తి, రివాల్వర్ దగ్గర పెట్టుకుని రోడ్లపై మనుషులను బెదిరిస్తున్న వ్యక్తి దొరికేసరికి వాళ్లకు చాలా ఆనందమైంది. ఎందుకంటే రిక్షావాళ్లతోనూ, బ్లాక్ టికెట్లవాళ్లతోనూ, చిల్లరదొంగలతోనూ వాళ్ల డ్యూటీ వెళ్లిపోతుంది.

ఇప్పుడు....ఇన్నాళ్లకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక టెర్రరిస్టు దొరికాడు!

వందకోతులకు ఒక్క కొబ్బరికాయ మాత్రమే దొరికితే ఎంత హడావుడి అవుతుందో అంతకు రెట్టింపు హడావుడి జరిగింది.

అరగంట తర్వాత దత్తాత్రేయ ముందు నిలబడ్డాడు ద్వారకానాథ్. ఏడుపు ఒక్కటే తక్కువగా తన ముందు దీనంగా నిల్చున్న అతడిని చూస్తే దత్తాత్రేయకు




## కాకరకాయ సర్వరోగ నివారిణి

**పూ**ర్వంరోజులలో అలోపతీ వైద్యులు, ఆసుపత్రులు లేనప్పుడు ఆయుర్వేదం ద్వారా ఎన్నో వ్యాధులను నయం చేసేవారు. కాకరకాయలో ఎన్నో ఔషధగుణాలు ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. కఫం, వాతం, పైత్యం, రక్తదోషాలను నివారించి అజీర్ణం కలగకుండా కాకరకాయ శరీరాన్ని కాపాడుతుంది. జ్వరం వచ్చినవారికి కాకరకాయ ఆకు తరిగి కూరలా పెట్టేవారు. దానితో ఎటువంటి జ్వరం అయినా తగ్గేది.

మధుమేహం వ్యాధి ఉన్నవారు రోజూ ఉదయం ఒక గ్లాసు కాకరకాయ రసం తగ్గితే వ్యాధి అదుపులో ఉంటుంది. మాజీ ప్రధాని శ్రీ పి.వి.గారు ఉదయం ఒక గ్లాసు కాకరరసం తాగుతారు. వీరు 78 సంవత్సరాల వయసులో నేటికీ ఉత్సాహంగా కనిపిస్తున్నారు.

కాకరకాయ వేపుడు, పులుసు తింటే అన్నం హితవుగా ఉంటుంది. కాకరకాయ ఆకు, పువ్వు...తీగతో చూర్ణంచేసి రాస్తే ఎటువంటి వ్రణాలైనా తగ్గుతాయి. రెగ్యులర్‌గా కాకరకాయ తినేవారికి మలబద్ధం కూడ ఉండదు. సుఖంగా విరేచనం అవుతుంది. అందుకే ఇన్ని సుగుణాలు కలిగిన కాకరకాయకు ఆయుర్వేదంలో అత్యధిక ప్రాధాన్యం ఉంది.

\- కృష్ణాజీ

ప్రమాదకారిలా అనిపించలేదు. అందుకే సౌమ్యంగా అడిగాడు -

"నీ పేరు?"

"ద్వారకానాథండీ!"

"ఏం చేస్తూంటావ్?"

ఒక్క క్షణం ఆలోచించి చెప్పాడు - "డిటెక్టివ్‌ని.'

"లైసెన్స్ ఉందా?"

భయపడుతూనే తల అడ్డంగా ఊపాడు ద్వారకానాథ్. వణుకుతున్న కంఠంతో తాను అపరాధ పరిశోధకుడిగా పేరు తెచ్చుకోవాలని పాటుపడుతున్నట్లు చెప్పాడు.

"మరి ఈ కెమెరారీలు ఏమిటి?" అడిగాడు దత్తాత్రేయ.

కైవల్య సింధూర్ ఇంటికి రావడం, తాను అనుమానించి వెంబడించడం చెప్పాడు ద్వారకానాథ్.

"ఆ తర్వాత...?" కుతూహలంగా అడిగాడు దత్తాత్రేయ.

"నేను పోలీస్ అని తలుపు కొట్టాను, సార్! ఈలోగా మెట్లపైన చప్పుడయింది. వెళ్లి దాక్కున్నాను. లావుగా, కండలు తిరిగి ఉన్న మనిషి ఒకతను పైకి వచ్చాడు. సరిగ్గా అప్పుడే కైవల్య తలుపు తెరిచిందండీ! ఆ మనిషిని చూసి తలుపు మూయబోయింది. కానీ అతను ఆ అవకాశం ఇవ్వలేదు. లోపలకు తరుముకువెళ్లాడు. నేను కిటికీ దగ్గరకు వెళ్లి భయంభయంగా చూడసాగాను. కైవల్య గింజుకుని పారిపోబోయింది. కానీ ఆ వ్యక్తి తన చేతిలో ఉన్న కత్తితో అందినచోటల్లా పొడవసాగాడు. నేను వెంటనే ఫొటోలు తీశాను! పేపర్లో ఆమె ఫోటో చూశాక తెలిసింది ఆమె పేరు కైవల్య అని"

ఆ దృశ్యం కళ్లముందు మెదలడంతో భయంతో ఒక్క క్షణం ఆగాడు ద్వారకానాథ్.

"ఆ తర్వాత?" ఆలస్యం భరించలేనట్లు అడిగాడు దత్తాత్రేయ.

"చనిపోయిన కైవల్యను బాత్‌రూమ్‌లో పడేసి వచ్చాడు. నేను అలికిడి కాకుండా వెనక్కి తిరిగి పారిపోయాను. ఆ ఫొటోలే ఇవి!"

ఏం చెయ్యాలో నిర్ణయించుకోవడానికన్నట్లు కుర్చీలో వెనక్కు వాలి, కళ్లు మూసుకున్నాడు దత్తాత్రేయ. ఆ ఫోటోలను ఒక గంటలో డెవలప్ చేయించాడు దత్తాత్రేయ. ఆ తర్వాత ఒక ఫొటో తీసి చూపించి, "ఇతనేనా?" అన్నాడు.

"ఇతడు సింధూరండీ!"

"అది నాకు తెలుసు. కైవల్యను చంపింది ఇతనేనా?"

"కాదు, సార్! వాడు వేరే! పక్కా గూండాలా ఉన్నాడు."

స్టేషన్‌లో ఉన్న నేరస్థుల ఫొటోలన్నీ చూపించాడు. ఒక్కొక్కటీ తీసి పక్కన పెడుతున్నాడు ద్వారకానాథ్. అప్పుడు వేరే ఫైల్ తీసి చూపించాడు దత్తాత్రేయ.

"ఇతడే సార్! ఆ హంతకుడు వీడే!"

"ఏయ్, కానిస్టేబుల్! ముందు వీడిని లోపల పారేయ్!" కూల్‌గా చెప్పాడు దత్తాత్రేయ.

"అన్యాయం, సార్! నాకేం తెలియదు!"

"ఏమీ తెలియకపోవడం ఏమిటి? చాలా తెలుసు. వాడు నంబర్‌వన్ క్రిమినల్. పేరు విక్రమ్. ఈ హత్య గురించి నాకు చెప్పావు కదా! ఇప్పుడు బయటకు వెళ్తే పోలీస్‌స్టేషన్ ముందే నిన్ను చంపేస్తాడు. కాబట్టి వాడు అరెస్టయ్యేదాకా నువ్వు లోపల ఉండు!"

* * *

**సం**యుక్తకు చాలా దగ్గరగా ఆగింది ఆ కారు. స్టీరింగ్ ముందున్న యువకుడు పలకరింపుగా నవ్వాడు. పజిల్ అయింది సంయుక్త. అతడిని ఎక్కడో చూసినట్లు ఉంది. ఎక్కడ అనేది గుర్తు రావడంలేదు.

"హల్లో! గుర్తున్నానా?"

"సరిగ్గా జ్ఞాపకం రావడంలేదు. పరిచయాలు తరువాత చేసుకుందాం. ముందు ఇక్కడనుండి వెళ్లిపోవాలి, పదండి!" చుట్టూ తిరిగి వచ్చి ఫ్రంట్ సీటులో అతనిపక్కన కూర్చుంటూ చెప్పింది సంయుక్త.

చిన్న జర్క్‌తో కారు ముందుకు కదిలింది. తన పక్కన కూర్చున్న యువకుడిని ఓరగా చూసింది సంయుక్త. ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా అతన్ని ఎక్కడ చూసిందీ గుర్తురావడంలేదు.

"నా పేరు సింధూర్. మనం ఒక రెస్టారెంట్‌లో కలుసుకున్నాం!" చెప్పాడు సింధూర్.

అప్పటికీ ఆమెకు జ్ఞాపకం రావడంలేదు. మొహమాటంగా చిరునవ్వు నవ్వింది.

"యముడి విగ్రహం ఎక్కడ ఉంది, సంయుక్తా!"

అదిరిపడింది సంయుక్త. కారు డోర్ తెరుచుకుని దూకేయబోయింది. ఒడిసిపట్టి లోపలకు లాగాడు సింధూర్.

"ఇడియట్! అమ్ముకుని కోట్లు సంపాదిద్దామనుకుంటున్నావా?"

"నువ్వు అనుకోవడంలేదా?" వెంకిగా అంది సంయుక్త.

"లేదు. నా దేవుడి ఆఖరి కోరిక ఆ విగ్రహాన్ని తిరిగి ఆలయంలోకి చేర్చడం. ఎంత కష్టమొచ్చినా, ఎంతమంది అడ్డు తగిలినా ఆ పని చేసి తీరుతాను!" దృఢంగా చెప్పాడు సింధూర్.

ఆశ్చర్యంగా చూస్తున్న సంయుక్తకు తన అనుభవాలు వివరించాడు. కైవల్య విషయం చెప్పగానే సంయుక్త గుండెల్లో బాధ కన్నీళ్ల రూపంలో కళ్లవెంబడి బయటకు రాసాగింది.

"సంయుక్తా! నీ స్నేహితురాలి ఆత్మశాంతికోసమైనా నువ్వు ఆ విగ్రహం ఎక్కడుందో చెప్పాలి!"

"ఆ విగ్రహం ఎక్కడుందో నిజంగా నాకు తెలియదు. కోటిలింగం నాకు ఒక గొలుసు ఇచ్చాడు. తర్వాత వచ్చి తీసుకుంటానన్నాడు. ఇదిగో, ఇదే ఆ గొలుసు!" తన మెడలో గొలుసు తీసి ఇచ్చింది.

కారు రోడ్డు పక్కకు ఆపాడు సింధూర్. ఆ గొలుసును జాగ్రత్తగా అటూ ఇటూ తిప్పి చూశాడు. డ్రాగన్ బొమ్మ ఆ గొలుసు చివర వేలాడుతోంది. ఆ బొమ్మ తల దగ్గరనుండి సన్నని గీత కనపడింది. ఆ చీలికలోకి వేలి గోరు పోనిచ్చి రెండుగా విడదీశాడు. ఒక కాగితం ఉంది. దానిపై కొన్ని గీతలు గీసి ఉన్నాయి. ఒకచోట సున్నా చుట్టి ఉంది.



"సంయుక్తా! నిన్ను కోటిలింగం కలిసిన బస్టాప్ ఎక్కడో గుర్తుందా?"

తల ఊపింది సంయుక్త.

"దారి చెప్పు, అక్కడకు వెళ్లాలి!" కారు ముందుకు పోనిస్తూ అన్నాడు.

దారి పొడవునా చుట్టూ చూస్తూ డ్రైవ్ చేస్తున్నాడు సింధూర్. తనకోసం పోలీసులు వెదుకుతున్నారు. దానికితోడు ఆ కారు దొంగిలించుకువచ్చాడు. దాని ఓనరు ఈ సరికే రిపోర్టు ఇచ్చి ఉంటాడు.

దారి పొడవునా ఎవరి ఆలోచనల్లో వాళ్లు ఉండి, మాట్లాడకుండా కూర్చున్నారు. మధ్యమధ్య సంయుక్త ఎటు వెళ్లాలో దారి చెబుతోంది.

"అదిగో, ఆ కనిపించేదే బస్టాండ్! అక్కడే కోటిలింగం నాకు కనిపించింది. మా ఇల్లు ఇక్కడకు దగ్గరే! వెళ్దాం, రండి!"

"వద్దు! విక్రమ్ మనుషులు ఈసరికే నీ ఇంటిదగ్గర కాపుకాసి ఉంటారు. అక్కడకు వెడితే నిన్నూ, నన్నూ కూడా సైలెంట్‌గా మూసేస్తారు."

"ఒక్కసారి బామ్మను చూసి రావాలి!"

"వద్దు! వాళ్లను తక్కువగా అంచనా వెయ్యకు, సంయుక్తా! మనం ముందు విగ్రహాన్ని సాధించాలి. ఆ తర్వాత పోలీసుల సహాయంతో ఈ స్మగ్లర్లను అరికట్టాలి!" సంయుక్త ముఖంలోకి చూస్తూ చెప్పాడు సింధూర్.

"ప్లీజ్ ... ఒక్కసారి ..." బతిమిలాడింది సంయుక్త.

"ఆలోచించు. ఇప్పుడు నీవు ఇంటికి వెళ్తే నీతోపాటు మీ బామ్మను కూడా చంపేస్తారు, చూస్తూ చూస్తూ ఆ ముసలావిడను అటువంటి దుర్మరణంపాలు చేస్తావా?"

ఆ మాటలు తారకమంత్రంలా పనిచేశాయి. మరి వాదించలేదు సంయుక్త. తల వంచుకుని కూర్చుంది. జాలి కలిగింది సింధూర్‌కు. కానీ చేయగలిగిందేమీ లేదు. ఆమె చేతిపై చెయ్యి వేసి మృదువుగా నొక్కాడు.

ఆ స్పర్శ ఎంతో ఓదార్పుగా అనిపించింది సంయుక్తకు. చెప్పవలసిన ఎన్నో మాటలు ఆ స్పర్శ ద్వారా చెప్పాడతను. ఆ క్షణాన అంతకంటే ఆత్మీయులు లేరనిపించింది.

తన చేతిలోని కాగితాన్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలుపెట్టాడు సింధూర్. అక్కడికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది విగ్రహం దొంగిలించబడిన దేవాలయం. కోటిలింగం అక్కడనుండి బయలుదేరి ఇక్కడకు వచ్చాడు. అంటే ఈ ఆరు కిలోమీటర్లలోనే ఎక్కడో ఆ విగ్రహం దాచి ఉండాలి.

పటంలో మొదలు ఒక కొండ గుర్తు ఉంది. అది దేవాలయమనుకుంటే అక్కడనుండి బయలుదేరి ముందుకు రావాలి.

"సింధూ! ముందు ఆ గుడిదగ్గరకు వెళ్దాం!" అంది. అన్నాక, తాను ఏకవచనం మాట్లాడిన విషయం గమనించి "సారీ!" అంది.

"డోంట్ వర్రీ, సంయుక్తా! ఆ యముడి దయవల్ల నేను మానసికంగా నీకు ఎప్పుడో దగ్గరయ్యాను!"

ఆ మాటలకు సంయుక్త బుగ్గలలోకి వెచ్చటిఆవిర్లు వచ్చాయి.

## ఓజోన్ కథాకమామిషు

**సు**మారు నూరుకోట్ల సంవత్సరాలుగా-మన వాతావరణానికి పైని ఉన్న ఓజోన్ పొర, సూర్యుడినుంచి వెలువడే అతిలోహిత (అల్ట్రావయొలెట్) కిరణాల నుంచి ఈ భూమిని రక్షిస్తోంది.

ఎలెక్ట్రానిక్స్ పరిశ్రమ భూవాతావరణంలో ఓజోన్‌పొరకి హాని కలిగిస్తున్నదనే విషయాన్ని 1974 నాటికే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఇంకో ఆసక్తి కలిగించే విషయం ఏమంటే: క్లోరోఫ్లోరో కార్బన్ల కారణంగానూ, ఇతర మానవనిర్మితద్రవ్యాలు కారణంగానూ అంటార్కిటికామీద యూరప్ సైజుకి రెండు రెట్లు అధికంగా ఓజోన్ పొరకి 'కన్నం' పడిందట! అందు మూలంగా ఏర్పడ్డ 'అతిలోహిత ఉష్ణోగ్రత' కారణంగా కొన్ని రకాల పంటల దిగుబడి తగ్గిపోయిందట. చర్మపు క్యాన్సర్, కంటికి సంబంధించి క్యాటరాక్ట్ వంటి జబ్బుల్ని పెంచడమేకాక, మనిషి శరీరానికి సహజంగా వుండే 'ఆరోగ్యరక్షణ' యంత్రాంగాన్ని ఇటువంటి చర్యలు దెబ్బ తీస్తున్నాయట!

క్లోరోఫ్లోరిక్ కార్బన్లలోని ఒకే ఒక్క క్లోరిన్ యాటమ్ ఒక లక్ష ఓజోన్ మాలిక్యూల్స్‌ని నాశనం చేయగలదని శాస్త్రజ్ఞుల అంచనా!-

నిపుణులు గట్టిగా చెప్పేదేమంటే: క్లోరోఫ్లోరో కార్బన్ల వినియోగాన్ని శ్రద్ధపట్టి నిరోధిస్తే, -కనీసం క్రీ.శ. 2050 నాటికి ఓజోన్ పొర తన సహజ'ఆరోగ్యకర'స్థితిని మళ్లీసాధించుకోగలదట!

కాసేపటికి ఎదురుగా కనబడింది దేవాలయం. అక్కడ ఆపి, చేతిలో ఉన్న కాగితాన్ని బయటకు తీశాడు. బాణం గుర్తునెంబడి కారు పోనిచ్చాడు మెయిన్ రోడ్డువెంట కొంత దూరం వెళ్లాక, రోడ్డు సైడున మట్టిదారి కనబడింది. కారు అటు తిప్పాడు. మరికొంత దూరం వెళ్లాక ఇసకపర్ర తగిలింది. కారు ఇక ముందుకు వెళ్లనంది. దిగి నడవడం మొదలుపెట్టారు.

ఆ ఇసుక తర్వాత ఓ తోట ఎదురైంది. అక్కడనుండి సన్నటి కాలిబాట ఉంది. ఆ తర్వాత మళ్లీ గుబురుగా చెట్లు ఎదురయ్యాయి. అక్కడ ఒకపక్కగా ఉంది చిన్న గుడి. అక్కడ ఆగిపోయారు.

చేతిలో ప్లాన్ కాగితం చూశాడు. "సంయుక్తా! బహుశా ఈ కాగితంలో రౌండు చుట్టబడిన భాగం ఈ గుడి అయి ఉండాలి. లోపలకు పోయి చూద్దాం!" చేతిలోని ప్లాన్ కాగితం సంయుక్తకు ఇస్తూ చెప్పాడు సింధూర్.

సంయుక్త మాట్లాడలేదు. ఆ కాగితం పరిశీలిస్తూ ఉండిపోయింది. ఈలోగా సింధూర్ లోపలకు వెళ్లాడు.

అది ఎప్పటిదో పాత రాతిగుడి. అందులో ఉండవలసిన విగ్రహాలు కూడా లేవు. లోపల అంతా వెదికి నిరాశగా బయటకు వచ్చేశాడు. సంయుక్తకేసి చూస్తూ పెదవి విరిచాడు.

సంయుక్త ఆలోచనలు వేరే విధంగా ఉన్నాయి. ఎంతయినా కోటిలింగం ఇటువంటి విషయాలలో ఆరితేరిన క్రిమినల్. ఆ పటం ఎవరికి దొరికినా ముందు గుడిలోకే వెడతారని ఊహించలేడా? ఆ గుడి కేవలం తప్పుదారి పట్టించేది మాత్రమే! మరి ఈ సున్నా చుట్టిన భాగం ఏది?

చుట్టూ చూసింది సంయుక్త. అంతా చెట్లమయం. రకరకాల చెట్లు. ఒక్కొక్క చెట్టు దగ్గరకు వెళ్లి చూడటం మొదలుపెట్టింది. ఆమె ఆలోచన అర్థం కాకపోయినా అనుసరించాడు సింధూర్.

ఒక మద్దిచెట్టు దగ్గర ఆగింది. ఆ చెట్టు కాండంపై దేనితోనే గుండ్రంగా చెక్కారు. నిర్మానుష్యమైన ఈ ప్రదేశంలో పనికట్టుకుని ఎవరు చెక్కారు?

సింధూర్ ముఖంలోకి చూసింది. అతనికి ఏమీ అర్థంకాలేదు. ఏమిటన్నట్లు చూశాడు. ఆగమని సైగచేసి చెట్టు చుట్టూ తిరిగింది. ఒకచోట నేలపై మట్టి తిరగబోసినట్లుంది. అంటే అక్కడ తవ్వారన్నమాట. మళ్లీ సింధూర్‌వైపు చూసింది. అయోమయంలో ఉందా శాల్తీ.

"మై డియర్ మొద్దబ్బాయ్! ఒళ్లు పెంచడమే కాదు, బుర్ర కూడా పెంచాలి. ఇక్కడ తవ్వి చూడు!" సింధూర్ చెవిపట్టుకుని ఆడిస్తూ చెప్పింది.

"అందుకే ఒక పని చేద్దాం! మనం పెళ్లి చేసుకుందాం. మన పిల్లలకు నా బలం, నీ తెలివితేటలు వస్తే ప్రపంచాన్ని ఏలుతారు!"

"కానీ, నా సుకుమారం, నీ తెలివితేటలు వస్తే ఎలా?" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగింది.

ఆమె నడుం చుట్టూ చేతులు వేస్తూ దగ్గరకు లాక్కున్నాడు. అప్పుడు కనిపించాయి ఆమె బుగ్గలపై ఎర్రటి చారలు. సంయుక్త చేతులు కూడా కాలి

బొబ్బలెక్కాయి. సదాశివం పెట్టిన హింసల గుర్తులవి. ఆప్యాయంగా ఆమె తలపై చేయి వేసి నిమిరాడు. తల్లి రెక్కలచాటున దాగే పక్షిపిల్లలా అతని ఛాతీపై తల ఆనించి అతని చేతులమధ్య ఇమిడిపోయింది.

సంయుక్త నుదుటిపై ముద్దుపెట్టాడు. ఆ తర్వాత కనురెప్పలపై, ఆపైన రెండు బుగ్గలపై, అటుపైన గడ్డంపైన, ఆఖరున పెదవులను అందుకున్నాడు.

తన్మయత్వంగా కళ్లు మూసుకుంది సంయుక్త. నుదుటిపైన ముద్దు పూర్వజన్మనుండి నీకోసం ఎదురు చూస్తున్నానని చెబుతుంటే, కనురెప్పపైన ముద్దు నా కలలసుందరి నీవేనని చెబుతుంటే, బుగ్గలపై ముద్దు నీ తోడు నీడ నేనేనని వాగ్దానం చేస్తూంటే, గెడ్డంపై ముద్దు నా ప్రాణానివని గునుస్తుంటే, పెదవులపై ముద్దు నాతిచరామి అంటుంటే .... ఆమె పరవశంతో కళ్లు మూసుకుంది. అలాగే ఎంతకాలమైనా, ఎన్ని యుగాలైనా ఉండిపోవాలనుంది. ఎన్నియుగాలైనా ...

"కమాన్, సంయుక్తా! ముందు ఇక్కడనుండి బయటపడాలి. పోలీసుల దగ్గరకు వెళ్లాలి. బయలుదేరు!" చెప్పాడు సింధూర్.

అయిష్టంగా అతనినుండి విడివడింది సంయుక్త.

ఎండిన కర్రవొకదాన్ని తీసి గబగబా తవ్వాడు సింధూర్. కొంత లోతు తవ్వాక నల్లటి విగ్రహం కనపడింది. ఆ విగ్రహాన్ని చూస్తూనే అప్రయత్నంగా వెన్నులో చలిగాలి రివ్వున స్పృశిస్తూ పరుగెడుతున్నట్లుగా కంపించిపోయాడు సింధూర్. ఎందుకో సంయుక్తకు కూడా అదే భావన కలిగింది.

ఎన్ని జీవులను బలిగొన్నదా మృత్యుదేవత? ఎందరి ప్రాణాలు పోయాయి? కేవలం తన స్థానాన్ని కదిపిన పాపానికి రక్తపుటేర్లు ప్రవహింపజేస్తున్నాడా రక్తపిపాసి.

అప్రయత్నంగా చేతులు జోడించింది సంయుక్త.

జాగ్రత్తగా ఆ విగ్రహాన్ని బయటకు తీశాడు సింధూర్. నిత్యం గంజాయిధూపం వల్ల ఆ విగ్రహంపైనుండి గంజాయివాసన వస్తోంది.

కారు దగ్గరకు నడిచారిద్దరూ. విగ్రహాన్ని వెనక సీట్లో పడుకోబెట్టాడు. కారు రివర్స్ చేసి ముందుకు పోనిచ్చాడు. మెయిన్‌రోడ్డుపైకి వచ్చాక కారు వేగం పెంచాడు సింధూర్. సాయంత్రమయింది. చల్లనిగాలి రివ్వున వీస్తోంది. చీర చెంగు తల పైకి లాక్కుని సింధూర్‌కి దగ్గరగా జరిగింది సంయుక్త.

ఆకాశాన పశ్చిమదిశగా మేఘమాలికలు ఎర్రగా ఉన్నాయి. అన్నీ రక్తరాగరంజితాలే. వాటి అంచులు మాత్రం సూర్యకిరణాలు సానపట్టినట్లు వెండితీగల్లా మెరుస్తున్నాయి.

"సింధూ!" అతని భుజంపై తల వాలుస్తూ పిలిచింది సంయుక్త.

"ఏమిటి?"

"మన పరిచయం వయసెంత?"

"కొన్ని గంటలు."

"మరి ..."

"ఏమిటి మరి? ఇలా ఎలా దగ్గరైపోయామా అనుకుంటున్నావా? ప్రేమ అనేది ఎప్పుడు ఎలా కలుగుతుందో తెలియదు అన్నాడో కవి!" చెప్పాడు సింధూర్.

"ఈ మాట ఇప్పటికి ఎంతమందితో చెప్పావు?" చిలిపిగా అంది.

"ఏ మాట?"

"అదే ... ఐ లవ్ యూ అనే మాట."

"నీతో కలిపి ముగ్గురు." అదే పద్ధతిలో చెప్పాడు.

ఠక్కున సరిగ్గా కూర్చుంది సంయుక్త.

"ఏమైంది?" ఆశ్చర్యంగా అడిగాడు సింధూర్.

ఈసారి కిటికీ దగ్గరకు వెళ్లిపోయింది.

బిగ్గరగా నవ్వాడు సింధూర్.

రోషంతో మీదకు దూకి పిడికిళ్లతో బాదసాగింది.

"ఓకే! ఇంక చాలు. యాక్సిడెంట్ అవుతుంది!" చెప్పాడు సింధూర్.

కొంత దూరం వెళ్లాక మళ్లీ అడిగింది - "సింధూ! మిగిలిన ఇద్దరూ ఎవరు?"

"ఎవరు?"

"అదే ...నువ్వు ప్రేమిస్తున్నానని చెప్పినవాళ్లు!" గారంగా అడిగింది.

"ఒకటి మా అమ్మ, రెండు మా టీచర్, మూడూ నువ్వు!" చెప్పాడు సింధూర్.

సంయుక్త మూతి అందంగా తిప్పింది. ఒకచేత్తో దగ్గరకు లాక్కుని ఆ బుల్లినోటిని మరింత అందంగా, ముద్దుగా మూశాడు సింధూర్. ఆ నాలుగు పెదవుల కలయికలో మాధుర్యం ఎంతకూ తీరడంలేదు.

హఠాత్తుగా ముందుకు చూసిన సంయుక్త కళ్లు పెద్దవయ్యాయి. కారు సిటీలోకి ప్రవేశించింది. సింధూర్ ఏకాగ్రత దెబ్బతినడంతో వంతెనపైన పేవ్‌మెంట్ పైకి ఎక్కబోతోంది.

ఒక చేత్తో స్టీరింగ్ పక్కకు తిప్పింది సంయుక్త. కారు పక్కకు తిరిగి ఒక టెలిఫోను స్తంభాన్ని గుద్ది ఆగింది.

అప్పటికి సింధూర్ మత్తు వదిలింది. సంయుక్తను విడిచిపెట్టి చుట్టూ చూశాడు.


అప్పుడే చీకట్లు ముసిరాయి. సిటీలోకి ప్రవేశించారు కానీ నగరం చివర కావడంతో నిర్మానుష్యంగా ఉంది. యముడి విగ్రహాన్ని తీసుకుని కాలినడకన అక్కడనుండి బయలుదేరారు. సరాసరి దత్తాత్రేయ ఉన్న స్టేషన్‌కు నడిచారు. పోలీస్‌స్టేషన్ కొంతదూరంలో ఉండగా చెప్పాడు సింధూర్ -

"సంయుక్తా! నువ్వు ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ దగ్గరకు వెళ్లి ఈ విగ్రహం ఇచ్చి, జరిగింది చెప్పు. నేను నంబియార్ వద్దకు వెడతాను. రేపు నా జీవిత లక్ష్యానికి చేరువయ్యే రోజు. నా ప్రాణం ఇచ్చి అయినా పగ తీర్చుకోవలసిన రోజు!"

అదిరిపడుతూ చూసింది సంయుక్త. ఆమె ఏదో అడిగేలోగానే సింధూర్ అక్కడినుండి వేగంగా చీకటిలో కలిసిపోయాడు. అక్కడే నిలబడి సింధూర్ వెళ్లినవైపు చూస్తూండిపోయింది. అదే ఆమె చేసిన పొరబాటు. ఆమె ఆ ధ్యాసలో ఉండగానే ఆమె చుట్టూ నిశాచరుల్లా కమ్మేశారు విక్రమ్ అనుచరులు.

తనముందు మర్రిచెట్టు మొదలులా నిలబడిన విక్రమ్‌ను చూసి చెళ్లున ఎలక్ట్రిక్‌హంటర్‌తో కొట్టినట్లు ఉలిక్కిపడింది సంయుక్త. కెవ్వున అరవబోయింది.

ఈలోగానే విక్రమ్ చెయ్యి ఆమె ముఖాన్ని తాకింది. తీవ్రమైన బాధను



సూచిస్తూ ఒక మూలుగు ఆమె నోటినుండి వెలువడింది. వెంటనే స్పృహ కోల్పోయింది.

సంయుక్త చేతిలోని విగ్రహం తీసుకున్నాడు విక్రమ్. అతని అనుచరులు సంయుక్తను భుజానికి ఎత్తుకున్నారు.

ఎదురుగా ఉన్న రక్షకభటనిలయం చీకటిలో నిలబడి అలాగే చూస్తోంది.

* * *

మెల్లగా కళ్లు తెరిచింది సంయుక్త. ఆమెకు కాస్త దూరంలో పెద్దబల్ల ఒకటి ఉంది. దానినుండి కాంతి నలుమూలలా చిమ్ముతోంది. దాహంతో ఎండిపోయిన పెదవులను నాలుకతో తడుపుకోవడానికి ప్రయత్నించి విఫలమైంది.

కళ్లు సగం తెరిచి చుట్టూ చూసింది. అసలైన హీరోలంతా అక్కడే ఉన్నారు. విక్రమ్, అతని అనుచరులు, ఒక ఆంగ్లో ఇండియన్ చుట్టూ నిలబడ్డారు. టేబుల్ లైటు వెనుక చీకటిలో ఇంకో ఆకారం ఉంది. చీకటిలో ఆ శాల్తీ ఎవరో తెలియడంలేదు.

"సెహభాష్, విక్రమ్! మొత్తానికి విగ్రహం సంపాదించావు. ఒక పని పూర్తయింది. రేపు దీన్ని మన ఓడ ఎక్కించి దేశంనుండి బయటకు పంపేయడమే మిగిలింది!" చెప్పాడా చీకటి మనిషి.

"దీన్ని ఏం చెయ్యమంటారు, సాబ్?" సంయుక్తను చూపిస్తూ అడిగాడు విక్రమ్.

"నీ వ్యాపారానికి ఉపయోగించుకో! ఇక సింధూర్ విషయం విల్లీఫోర్డ్ చూస్తాడు."

"తప్పకుండా, సార్! రేపే వాడికీ, నాకూ పోటీ! ఆ ఎరీనా నుండి మా ఇద్దరిలో ఒకళ్లు మాత్రమే బయటకు వస్తాము. ఒకరు విజయాన్ని వరిస్తే, ఇంకొకరు మృత్యువుని ముద్దాడతాం!" చెప్పాడు విల్లీఫోర్డ్.

వింటున్న సంయుక్త గుండెలు దడదడలాడాయి. తను, సింధూ కూడా ప్రమాదంలో ఉన్నారు. ఏమైనా తను ఇక్కడనుండి బయటపడాలి. ఎలా...?

సడెన్‌గా నాలుగు చేతులు ఆమెను ఒడిసిపట్టుకున్నాయి. ఆ క్షణంలోనే ఆమె శరీరం గాల్లోకి లేచింది. విక్రమ్ అనుచరులు ఆమెను అక్కడనుండి మోసుకుపోయారు.

* * *

ద్వారకానాథ్ చెప్పినదానివల్ల, తన చేతిలోని ఫొటోలవల్ల ఈ హత్య సింధూర్ చేయలేదని రుజువైంది దత్తాత్రేయకు. అంతేకాదు, తనపై ఆఫీసరైన ప్రహ్లాద్, విక్రమ్‌కు సహాయం చేశాడని రూఢీ అయింది.

తన డ్రాయర్ కింది అర తాళం తీశాడు దత్తాత్రేయ. ఒక టేప్‌రికార్డర్ ఉంది. ఆమధ్య అతని స్నేహితుడు ఫారిన్‌నుండి తెచ్చి అతనికి ప్రెజెంట్ చేశాడది. టేప్‌రికార్డర్ పక్కనే ఉన్న చిన్న మైక్రోఫోన్ బటన్ తీసి షర్ట్‌కు తగిలించుకున్నాడు. ఒకసారి టేపు సరిగ్గా పని చేస్తోందో, లేదో అని టెస్ట్ చేసుకున్నాడు. ఆ తర్వాత ప్రహ్లాద్ రూమ్‌కు బయలుదేరాడు.

"వాట్ హేపెండ్, దత్తాత్రేయా?" ప్రశ్నించాడు ప్రహ్లాద్.

"సార్! కైవల్యను సింధూర్ హత్య చేయలేదు. ఇవిగో ... ఈ ఫొటోలు చూడండీ! వీడు పాత క్రిమినల్, సార్! వీడి పేరు విక్రమ్. వీడే ఆ అమ్మాయిని చంపాడు!" స్టిఫ్‌గా శాల్యూట్ చేసి చెప్పాడు.

ఆ ఫొటోలు చూస్తూనే ప్రహ్లాద్ ముఖంలో రంగులు మారాయి.

"ఆ ఫొటోలు ఇక్కడ పెట్టి, నువ్వు వెళ్లిపో!"

"విక్రమ్‌ను అరెస్ట్ చేయమంటారా, సార్?"

"నాన్‌సెన్స్ ఇటువంటి చెత్తఫొటోలతో ఒక పెద్దమనిషిని ఎదుర్కోవడం బుద్ధితక్కువ పని!"

"వాడు పెద్దమనిషి కాదు, సార్! ఒక క్రిమినల్... మర్డరర్!"

"నో, నీవు అనవసర విషయాల్లో కలగజేసుకోకు, దత్తాత్రేయా! మైండ్ యువర్ ఓన్ డ్యూటీ!" కటువుగా చెప్పాడు ప్రహ్లాద్.

"ఇది కూడా నా డ్యూటీయే సార్!"

ఒక్క క్షణం దత్తాత్రేయ ముఖంలోకి చూశాడు ప్రహ్లాద్. భావరహితంగా చూస్తున్న అతని ముఖంలో ఎటువంటి ఫీలింగ్ కనపడలేదు.

"బి కేర్‌ఫుల్!" చెప్పాడతను. "నీవు నేను ఏం చెబితే అది చెయ్యడానికి మాత్రమే ఉన్నావు. నీ అభిప్రాయాలు వినే అవసరం నాకు లేదు. అయినా పెద్దవాళ్ల గొడవలు నీకు అనవసరం!" టేబుల్‌పైని పేపర్‌వెయిట్ ఒకసారి గుండ్రంగా తిప్పాడు.

"ఆ ఫొటోల విషయం మర్చిపో! విక్రమ్ సంగతి నీకు తెలియదనుకో. కాదూ అని ఈ విషయాల్లో తలదూరిస్తే వాళ్లు మంచివాళ్లు కాదు. నీ కుటుంబాన్ని దిక్కులేనిదానిలా మార్చేస్తారు. నీ మంచి కోసరే చెబుతున్నాను. నా మాట విను!" అనునయంగా చెప్పాడు ప్రహ్లాద్.

"అయితే నేను విన్నది నిజమేనన్నమాట!"

"ఏమిటి?" అనుమానంగా అడిగాడు.

"మీరు విక్రమ్ దగ్గర లంచాలు పుచ్చుకుంటున్నారు. అతని కోసం మీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు."

అంతే, ప్రహ్లాద్‌కు ఆవేశం తన్నుకొచ్చింది. టేబుల్‌పై పిడికిలితో బలంగా గుద్దాడు. "అవును! నేను లంచాలు తీసుకుంటున్నాను. డబ్బు తీసుకునే ఆ స్మగ్లర్లను అలా వదిలేశాను. లంచం తీసుకునే సింధూర్‌ను అరెస్ట్ చేయించాను. ఆ కేసుతో నీకు సంబంధం లేకుండా చేశాను. నాకు ఆ విగ్రహం దొరికితే విక్రమ్‌కే అందజేస్తాను. సింధూర్ దొరికితే లాకప్‌లో చంపేస్తాను! ఇప్పుడు చెప్పు! నువ్వు నన్నేమైనా చెయ్యగలవా? లేదు! కానీ నేను తల్చుకుంటే నీ బతుకు తెల్లారిపోతుంది, జాగ్రత్త!" అరిచాడు ప్రహ్లాద్.

బండరాయిలా ఉన్న దత్తాత్రేయ ముఖంలోకి చిరునవ్వు తన్నుకొచ్చింది. ఆ గదిలోనుండి బయటకు వచ్చాడు. తన టేబుల్ సొరుగులోని టేప్ రికార్డర్ ఆన్‌చేసి చూశాడు. అంతా కరెక్ట్‌గా వచ్చింది.

డి.జి.పి. చాలా నిజాయితీపరుడు. ఇటువంటివి ఏమాత్రం సహించడాయన. గబగబా నాలుగుటేప్‌లు రికార్డ్ చేశాడు దత్తాత్రేయ. రెండు పొడుగు ఎన్వలప్స్ బయటకు తీశాడు. ఒక కాసెట్ అందులో పెట్టి డి.జి.పి. పేరు రాశాడు. మరొకదానిలో ఇంకో కాసెట్ పెట్టి హోమ్‌మినిస్టర్ పేరు రాశాడు. మిగిలిన కాసెట్స్ తన జేబులో పెట్టుకున్నాడు. వాటిని బాంక్ లాకర్‌లో పెట్టదలుచుకున్నాడు. తలపై కాప్ పెట్టుకుని బయటకు నడిచాడు దత్తాత్రేయ.

* * *

తనముందు నిలబడ్డ సింధూర్‌కేసి నమ్మలేనట్లు చూశాడు నంబియార్. సింధూర్ వస్తాడనే ఆశ అతనికి ఆ క్షణం వరకు లేదు.

"బాబా! జైలర్‌సాబ్‌ని ఆ విల్లీఫోర్డ్ చంపేశాడు!" చెప్పాడు సింధూర్.

ఆ ఒక్కమాటలో అన్నీ అర్థమయ్యాయి నంబియార్‌కు. అతని ముఖంలోకి కూడా ఎక్కడలేని కాఠిన్యం వచ్చేసింది.

## అనాథ

టీచర్: సూరీ! నరమాంసభక్షకుడంటే ఏమిట్రా?

సూరి: తెలీదు, సార్!

టీచర్: ఉదాహరణకు...నువ్వు మీ అమ్మానాన్నను తినేశావనుకో... నిన్ను ఏమంటారు?

సూరి: అనాథ అంటారు, సార్!

**పి. రాధిక**, హంపసాగర (కర్ణాటక)

"దెబ్బకు దెబ్బ తియ్యాలి, సింధూ! నిజమే. కానీ నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్న అతన్ని, సరిగ్గా ప్రాక్టీస్ లేని నువ్వు పడగొట్టడం అసంభవం. పైగా గత కొన్ని నెలలుగా నీ బాక్సింగ్‌పోటీలకు అతడు వస్తూండడం గమనించావా? అంటే ... నీ ఫైటింగ్ స్టయిల్, నువ్వు బ్లాకింగ్ చేసుకునే విధానాన్ని అతడు గమనిస్తున్నాడన్నమాట. నీకు ఆ అవకాశం లేదు. పైగా గత కొద్దిరోజులుగా నీ ఆహారనియమాల్లో కూడా తేడా వచ్చి ఉంటుంది. అవునా? ఇప్పుడు చెప్పు. నువ్వు విల్లీఫోర్డ్‌ను గెలవగలవా?" అడిగాడు నంబియార్.



నిస్సహాయంగా భుజాలు ఎగురవేశాడు సింధూర్. నంబియార్ చెప్పిన ప్రతిమాటా నిజమని అతనికి తెలుసు.

"కానీ ఇప్పటికీ నీకు అవకాశం ఉంది, సింధూ!" చెప్పాడు నంబియార్.

"చెప్పండి, మాస్టర్! ఏమిటది?"

"విల్లీఫోర్డ్ ఫైటింగ్ కాసెట్స్ సంపాదించాను. జాగ్రత్తగా గమనించు. అతని వీక్‌పాయింట్ పట్టుకో. నీ బ్లాకింగ్‌స్టయిల్ మార్చేయ్! ఎటాకింగ్ స్టయిల్ మార్చనవసరం లేదు. రా, కూర్చో!" సింధూర్ కనబడకపోయినా నంబియార్ ఊరుకోలేదు. తన శిష్యుడి విజయానికి బాట వేసే ఉంచాడు.

వీడియోముందు కూర్చున్నాడు సింధూర్. విల్లీఫోర్డ్ చేసిన ఫైట్స్ కొన్ని ముఖ్యమైనవి అందులో ఉన్నాయి. దాదాపు నాలుగైదు గంటలు అలాగే చూస్తూ కూర్చున్నాడు.

ఇది ఈ మధ్యకాలంలో చాలామంది క్రీడాకారులు అనుసరిస్తున్న పద్ధతి. జోబగ్‌నర్‌ను ఓడించడానికి బ్రూనో ఇలాగే అతని కాసెట్స్ చూశాడంటారు. అందుకే 'జో'ని అంత తేలిగ్గా ఓడించాడని వాదించేవాళ్లున్నారు. మొదటి మూడు రౌండ్లు 'జో' అతిగా ఫైట్ చేస్తాడనీ, ఆ తర్వాత అలిసిపోతాడని బ్రూనో కనిపెట్టాడు. అందుకే ఆ ఫైట్‌ని పదిరౌండ్ల వరకు సాగదీసి అప్పుడు 'జో'ని చిత్తుగా కొట్టాడు.

అలాగే 1987 రిలయన్స్ కప్ పోటీలలో క్లిష్టమైన మణీందర్‌సింగ్ బౌలింగ్‌కు గ్రాహంగూచ్ ఇలాగే మందు కనిపెట్టాడు. దాదాపు రెండురోజులు వీడియోని అంటిపెట్టుక్కూర్చుని మణీందర్ బౌలింగ్‌ను స్వీప్‌షాట్ ద్వారా చిత్తు చేయవచ్చని గ్రహించాడు. అందుకే ఎంతో ఎకనామికల్‌గా చెప్పబడే మణీందర్ సెమీఫైనల్స్‌లో ఎనభై పరుగులకుపైగా ఇచ్చాడు. విజయం ఇంగ్లండ్ టీమ్‌ది అయింది.

చాలాసేపటి తర్వాత చేతిలో ఆపిల్‌జూస్ గ్లాసులతో అతని పక్కకు వచ్చి కూర్చున్నాడు నంబియార్.

"ఏమైనా తెలిసిందా?" ఒక గ్లాసు సింధూర్‌కి ఇస్తూ అడిగాడు నంబియార్.

తల ఊపాడు సింధూర్.

"ఏమిటి?"

"ఫైన్‌సర్కిల్‌లో ప్రత్యర్థి హుక్ చేసే పాట్లు అతన్ని ఇబ్బంది పెడుతున్నాయి. డిఫెన్స్‌కంటే ఎటాకింగ్‌కు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాడు. ఎదుటివాడు కొట్టే లైట్ మిడిల్ పంచస్ భుజంతో ఆపే బదులు తల వంచి తప్పుకుంటున్నాడు!"

నంబియార్ కళ్లలోని ఉత్సాహం వరదలా తన్నుకొచ్చింది. సింధూర్ భుజం తట్టాడు.

"నువ్వు చేయవలసిందేమిటో తెలుసుగా? నేను చెప్పనవసరం లేదు. నీ డిఫెన్స్ సిస్టమ్ మాత్రం పూర్తిగా మార్చుకో. ఎటాక్ చేయడం మాత్రం పూర్తిగా అదే పద్ధతి! ఇక నిద్రపో. పొద్దుటే లేపుతాను. బాక్సర్ ఎప్పుడూ ఆహార విషయంలోనూ, నిద్రవిషయంలోనూ నియమబద్ధంగా ఉండాలి!" చెప్పాడు.

లోపలి గదిలోకి వెళ్లిపోయాడు సింధూర్.

* * *

తను ఆ గదిలో మంచంపై పారేశాక చాలాసేపు కదలకుండా పడుకుంది సంయుక్త. ఆ తర్వాత కనురెప్పలగుండా చుట్టూ చూసింది. ఎవరూ లేరు. చటుక్కున లేచి కూర్చుంది. ఆ గది ఒక స్టూడియో మాదిరిగా ఉంది. పెద్ద పెద్ద ఫ్లడ్‌లైట్లు, ఒక పెద్ద మంచం వగైరా హంగామాలతో నిండి ఉంది. ముందు ఇక్కడనుండి బయటపడాలి.

తలుపువైపు కదలబోయి ఆగింది. ఆ గదిలో ఒక ఫుల్‌హాండ్స్ షర్టు, ఒక పాంటు ఒక మూలగా వేలాడుతున్నాయి. గబగబా తన ఒంటిపైని చీర వదిలేసి, పాంటు షర్టు తొడుక్కుంది. జుట్టు కొప్పులాగా నెత్తిపైకి చుట్టుకుంది. షర్టు లూజుగానే ఉన్నా, పాంటు టైట్ అయింది.

అయినా ఇప్పుడు పరుగెత్తడం చాలా సులభం. తలుపు దగ్గరగా నడిచింది. ఆ తలుపు బయటకు గొళ్లెం వేశారు. తలుపు పైన కొద్దిగా ఖాళీ ఉంది. తలుపు పక్కన ఉన్న అలమరాలు ఎక్కి ఆ ఖాళీలోకి వేలు పోనిచ్చింది. తేలికగానే అవతలివైపు గొళ్లెం ఊడి వచ్చింది. తలుపు కొద్దిగా తెరిచి బయట కు చూసింది. నిర్మానుష్యంగా ఉంది వరండా. బయటకు వచ్చేసింది. ఒక పక్కగా మేడమెట్లు కనపడ్డాయి. పైకి ఎక్కేసింది.

రెండవ అంతస్తులో లైట్లు వెలుగుతున్నాయి. ఓరగా తెరిచి ఉన్న ముఖద్వారం గుండా లోపలకు చూసింది. లోపల ఒక టేబుల్‌పై కూర్చుని ఉన్నాడు విక్రమ్. అతని చుట్టూ అతని అనుచరులు కూర్చున్నారు. ఉలిక్కిపడి నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ మెట్లు ఎక్కింది. అది ఓపెన్ టెర్రస్.

ఒక చిన్న కొండపై ఉందా బిల్డింగ్. చుట్టుపక్కల మరి ఇళ్లు లేవు. అప్పుడు తెలిసింది తను చేసిన పొరబాటు. తను కిందకు వెళ్లవలసింది పోయి, పైకి వచ్చింది. ఇప్పుడు బయటకు వెళ్లాలంటే మళ్లీ కిందకు వెళ్లాలి. భగవంతుడిపై భారం వేసి అక్కడే నక్కింది సంయుక్త.

* * *

ఆ గదిలోకి వస్తూనే నిశ్చేష్టుడైపోయాడు విక్రమ్. ఖాళీగా ఉంది గది. లోపల మంచంపై ఉండవలసిన సంయుక్త లేదు. మండిపడ్డాడతను. ఎనుబోతులా అరిచాడు.

విక్రమ్ ఒక రియల్ శాడిస్ట్. మనిషి రూపంలోని రాక్షసుడు. అతని భార్య పూర్వం అతడిని విడిచి మరొకడితో లేచిపోయింది. వారంరోజుల్లో ఆ ఇద్దరినీ కత్తికొక కండగా నరికిపారేశాడు విక్రమ్. కానీ ఆడవాళ్లపై కసి అతని మనసులో అలాగే ఉంది.

అందుకే ఆడదాన్ని హింసించే అవకాశం వస్తే ఊరుకోడు. ఒకసారి రతిలో అతనితో పాల్గొన్న ఆడది సృష్టికార్యమంటేనే భయపడిపోతుంది.

సంయుక్తవల్ల ఎంతో ఆనందం పొందుదామని వచ్చాడతను. ఇక్కడ చూస్తే ఖాళీ మంచం వెక్కిరించింది. తన మనుషులను బయటకు తోలాడు. అందరూ బయటకు వెళ్లిపోయాక ఐడియా వచ్చింది. ఒకవేళ పైకి వెళ్లి ఉంటే ...?

ఒక హంటింగ్ బ్లేడ్ తీసుకుని పైకి వెళ్లాడు. పైన టెర్రస్ ఖాళీగా ఉంది. పిట్టగోడ దగ్గర నిలబడి కిందకు చూశాడు. అతని మనుషులు నాలుగువైపులా వెతుకుతున్నారు. ఆలోచిస్తూ నిలబడ్డ విక్రమ్‌కు తాను ముందుకు తూలినట్లనిపించింది.

చిత్రంగా తాను గాల్లో తేలుతున్నాడు.

కంగారుగా చేయి ఊపాడు విక్రమ్. సగం కట్టి వదిలిన బిల్డింగ్ కాబట్టి బయటకు పొడుచుకు వచ్చిన ఇనుప ఊచలున్నాయి. విక్రమ్‌చొక్కా ఒక ఇనుప ఊచకు తగులుకుంది. ఏ ఆధారం లేకుండా అతడు అలాగే గాల్లో వేలాడసాగాడు.

మృత్యువు ముంగిట్లో నిలుచుంటే ఎలా ఉంటుందో తెలిసింది విక్రమ్‌కు. మనిషికి భయంకరమైన శిక్ష ఒక్కటే - కాసేపట్లో చచ్చిపోతానని తెలియడం. ఇప్పుడు విక్రమ్ పరిస్థితీ అదే!

మృత్యుదేవత నగ్నంగా కరాళనృత్యం చేస్తున్నట్లు ఉంది. తలెత్తి చూశాడు. సంయుక్త నిలబడి ఉంది. పళ్లు కొరుకుతూ కాళ్లూ, చేతులూ గింజాకున్నాడు.

ఆ మాత్రం కదలిక చాలు, అతని చొక్కా చిరిగిపోయింది. అతని శరీరం వేగంగా కిందకు జారింది.

అంతకంటే వేగంగా ఎదురొచ్చింది నేల. రెండుగా విచ్చిపోయింది అతని తల!

స్థానభ్రంశం చెందిన సమవర్తికి మరో కబళం దొరికింది.

* * *

విక్రమ్ శవాన్ని చూడలేక గిర్రున వెనక్కి తిరిగి ముందుకు పరుగెత్తింది సంయుక్త. కిందకు పరుగెత్తి మెట్ల వేగంగా దిగసాగింది.

"సంయుక్తా!" పిలిచారెవరో.

ఉలిక్కపడి అటు చూసింది సంయుక్త.

అతడు జాక్సన్. తన బాస్!

ఇక్కడ ఎలా ఉన్నాడు?

సంయుక్త ఆలోచనలు చదివినట్లు నవ్వాడు జాక్సన్. "ఈ బిజినెస్ నాదేనమ్మా! నేనే దీని లీడర్‌ని. నాకెందుకో నువ్వు మొదటినుంచి సమర్థురాలిలా అనిపించావు. అందుకే [illegible] అంచనా వేసి దెబ్బతిన్నాడు. నేనలా కాదు!"

ఇంతలో ఒక వ్యక్తి పరుగున వచ్చాడు. "సాబ్! పోలీసులు వచ్చేశారు. మనల్ని చుట్టుముట్టారు!" అరుస్తూ చెప్పాడు.

కలవరపాటుగా అటు చూశాడు జాక్సన్. తిరిగి ఇటు చూసేసరికి ఎదురుగా ఉండాల్సిన సంయుక్త లేదు. ఆమె షార్ప్‌నెస్‌కి ఆశ్చర్యపోయాడు జాక్సన్.

మెరుపులా లోపలికి వెళ్లి ఒక బ్రీఫ్‌కేస్‌తోనూ, యముడి విగ్రహంతోనూ బయటకు వచ్చాడు.

కారిడార్‌లో ఉన్న తన కారు స్టార్ట్ చేసి అమితమైన వేగంతో పోనిచ్చాడు. రైఫిల్‌నుండి వెలువడిన తూటాలా ముందుకురికింది కారు.

## పదమూడో ఎక్కం

ఇంట్లోనే ప్రైవేట్ చెప్పించుకుంటున్న వంశీకి మాస్టార్ వచ్చి క్లాసు మొదలు పెట్టాడు: "ఏరా, వంశీ, పదమూడో ఎక్కం చెప్పరా!" అంటూ.

ఎక్కం అప్పచెబుతూండగా, వంటింట్లోంచి తల్లి కేక విన్పించింది: "ఒరే వంశీ! ఏం చేస్తున్నావురా?" అని.

"మాస్టారుకి పదమూడో ఎక్కం రాదట ...చెబుతున్నా, మమ్మీ!" అన్నాడు.

**చందూ వంశీ**, నంద్యాల

భంగు తాగిన ఏనుగులా గుడ్డిగా దూసుకువస్తున్న కారును చూస్తూనే చెల్లాచెదురయ్యారు పోలీసులు. జాక్సన్ చేతిలో స్టీరింగ్ విష్ణుచక్రంలా తిరిగింది. అడ్డం వచ్చిన గేటు విరగ్గొడుతూ ముందుకు సాగింది.

కొంతమంది పోలీస్ ఆఫీసర్లు జాక్సన్‌ని వెంబడించారు. మరికొందరు బంగళాలోకి వెళ్లారు.

అదే వేగంతో ముందుకు వెళ్తోంది జాక్సన్ కారు. అడ్డం వచ్చిన వాహనాలను అదరగొడుతూ ముందుకు సాగాడు. హఠాత్తుగా ఒక మలుపు ఎదురైంది. అక్కడ కొందరు కారు ఆపడానికి ప్రయత్నించారు ఆగలేదు జాక్సన్.

కానీ మలుపు తిరిగాక అర్థమైంది - దారిలో ఒక ఎలక్ట్రిక్ స్తంభం పడిపోయింది. ఆగేలోగానే జాక్సన్ కారు ఆ స్తంభంపైకి ఎక్కింది.

అంతే!

అతని కారు విద్యుత్‌వాహకమైంది.

ఎలక్ట్రిక్ ఛెయిర్‌లో కూర్చున్నవాడిలా మాడిపోయాడు జాక్సన్.

* * *

చుట్టూ జనం హోరుతో తుఫాను సమయంలో నడిసముద్రంలో ఉన్నట్లు ఉంది.

చుట్టూ వరుసలుగా కొన్ని వేలమంది కూర్చుని ఉన్నారు. ఆ జనం మధ్యనుండే ఒకవైపు నుండి విల్లీఫోర్డ్ వచ్చాడు. మరొకవైపునుండి సింధూర్ వచ్చాడు. సింధూర్ ఎరుపురంగు కొస నుంచి బరిలోకి ప్రవేశించాడు.

ఆకలిగొన్న పులిలా విల్లీఫోర్డ్‌వైపు చూశాడు సింధూర్. క్రోధం అతని కళ్లలో పరవళ్లు తొక్కింది. మౌనంగా వచ్చి రిఫరీముందు నిలబడ్డాడు.

విల్లీఫోర్డ్ కూడా రిఫరీ వద్దకు వచ్చాడు. అతనికి సింధూర్‌ను చూస్తే హేళనగా ఉంది. తను చాలా తేలికగా అతన్ని ఓడించగలనన్న ధీమా అతనికి ఉంది.

శరీరఆకృతిలో కూడా ఇద్దరి మధ్యా తేడా ఉంది.

ఎదురుబొదురు నిలబడ్డ ప్రత్యర్థులిద్దరి గ్లౌస్‌లను రిఫరీ తడిమి చూశాడు. నియమనిబంధనలు మరోసారి గుర్తుచేశాడు. ఆ తర్వాత వెనక్కి జరిగి నిలుచున్నాడు.

బాక్సర్లిద్దరూ పొజిషన్‌లోకి వచ్చి నిలబడ్డారు. రిఫరీ సిగ్నలిచ్చాడు.

ఉల్కాపాతంలా కదిలాడు విల్లీఫోర్డ్. కదులుతూనే అతని కుడిచెయ్యి సింధూర్ ముఖంపైకి దూసుకువచ్చింది. మెరుపులా కాలి మునివేళ్లపై కొద్దిగా పైకి లేచి పక్కకు తిరిగి భుజం ఇచ్చాడు సింధూర్.

"ఫస్ట్ హిట్!"


ఫోర్డ్ అభిమానులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

సింధూర్ భుజం విరిగినట్లయింది. తేరుకునేలోగానే ముఖంపై పడింది ఒక లెఫ్ట్ హుక్‌షాట్! దాని వెనుకే దూసుకువచ్చింది ఒక మిడిల్‌పంచ్. నడుము పైభాగాన రెండు ముష్టిఘాతాలు తగిలాయి. వెనక్కు అడుగులు వేయడంతో ఒక మూలకు వెళ్లిపోయాడు సింధూర్.

[illegible] ఎత్తున్నాడు విల్లీఫోర్డ్.

రిఫరీ అడ్డు వెళ్లాడు. బాక్సింగ్‌లో ప్రత్యర్థిని తలతో ఢీకొనడంగానీ, భుజాలతో తొయ్యడంగానీ, కాళ్లతో తన్నడంగానీ, తప్పుకునే అవకాశం లేకుండా కొట్టడంగానీ చెయ్యకూడదు.

తిరిగి ప్రత్యర్థులిద్దరూ ఎదురెదురుగా వచ్చి నిలబడ్డారు.



ఈ దఫా కూడా విల్లీఫోర్డ్‌దే పైచేయిగా మారింది. ఆ రౌండు పూర్తయ్యేసరికి సింధూర్ ముఖం పూర్తిగా కమిలిపోయింది. దవడలు వాచి, కుడికన్ను ఉబ్బిపోయి ముఖం షేపే మారిపోయింది.

తన ప్లేస్‌కు వచ్చి కూర్చున్నాడు సింధూర్. నంబియార్ అతని నోట్లోని పరికరాన్ని బయటకు తీశాడు. నీళ్ళు పుక్కిలించి ఉమ్మివేశాక చెప్పాడు -

"సింధూ! మొదట నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకో! కేవలం కోపంతో అవతలి మనిషిని జయించలేవు. పద్ధతిగా ఫైట్ చెయ్యాలి. చైన్ సిస్టమ్‌లో చెయ్యి కదుపు. ఎక్కువగా అతనికి అవకాశం ఇవ్వొద్దు!"

మళ్లీ గంట మోగింది. నంబియార్ బరి వెలుపలకు వెళ్లాడు. రెండో రౌండుకు సిద్ధమయ్యారు బాక్సర్లు.

ఈసారికూడా విల్లీఫోర్డ్ ముందు కదిలాడు. క్రర దెబ్బ తప్పుకున్న నాగుపాములా రియాక్ట్ అయ్యాడు సింధూర్. తన పిడికిలి కేవలం గాలిని తాకిందని విల్లీఫోర్డ్ గమనించేలోగానే అతని కడుపుపైభాగాన రెండు మిడిల్‌పంచ్‌లు వెంటవెంటనే తగిలాయి. తేరుకునేలోగానే ముఖంపైకి వచ్చింది హేమర్‌షాట్!

అప్పుడు అర్థమైంది విల్లీఫోర్డ్‌కు సింధూర్ బలం. ఆ బలాన్ని మించికొట్టే విధానంలో ఒడుపు. సరిగ్గా తగలవలసినచోట తగులుతుంది దెబ్బ. తాను కూడా హుక్‌షాట్స్ అప్లయ్ చేయబోయాడు. అయితే సింధూర్ బ్లాకింగ్ స్టయిల్ పూర్తిగా మారిపోయింది. అతడు కొడదామనుకున్నచోట ఒక్క షాట్ కూడా తగలలేదు సింధూర్‌కు.

విల్లీఫోర్డ్ చెయ్యి మరోమారు కదిలేలోగా సింధూర్ ప్రళయకాళ ప్రభంజనంలా ఎటాక్ చేశాడు. పూర్తిబలం ఉపయోగించి విల్లీఫోర్డ్ కుడిదవడపై అప్పర్‌పంచ్ కొట్టాడు సింధూర్.

గిర్రున తిరిగి నేలకు కరుచుకుపోయాడు విల్లీఫోర్డ్!

ఒకటి...రెండు...మూడు ...

దూకే జలపాతం మధ్యలో ఆగిపోయినట్లు, గర్జించే అగ్నిపర్వతం ఆకస్మికంగా చల్లారిపోయినట్లు, అంతవరకు గోలగోలగా ఉన్న ప్రదేశం ఒక్కసారి నిశ్శబ్దమైపోయింది.

నాలుగు ....

అయిదు ...

క్షణం వెనుక క్షణం నెమ్మదిగా కదులుతోంది కాలం. చుట్టూ నిశ్శబ్దం.

లేచి నిలుచున్నాడు విల్లీఫోర్డ్. ఒక్కసారిగా అతని పరిస్థితి ఎటాకింగ్ నుండి డిఫెన్స్‌కు జారిపోయింది. జాగ్రత్తపడకపోతే తాను సింధూర్‌కు పట్టించాలనుకున్న గతే తనకు పడుతుందని గ్రహించాడు విల్లీఫోర్డ్.

అతడు పొజిషన్‌లోకి వచ్చేలోగా టైమ్ అయిపోయింది. రెండో రౌండు ముగిసింది.

ఈసారి సంభ్రమంగా దగ్గరకు వచ్చాడు నంబియార్. సింధూర్ ముఖాన్ని టవల్‌తో తుడిచి, నోట్లో నీళ్ల పోశాడు. బయటకు ఉమ్మివేశాడు సింధూర్. పెదవుల చివర రక్తం తుడిచాడు నంబియార్.

"వా టె స్పీడ్ సింధూర్! ఈసారి గట్టిగా కొట్టు! బలంకొద్దీ బాదు! జైలర్‌సాబ్ ఆత్మ శాంతించాలి!" చెప్పాడు నంబియార్. ఇనుము వేడిగా ఉన్నప్పుడే కొట్టాలి. నంబియార్ సరిగ్గా దెబ్బ కొట్టాడు. పళ్ల బిగిస్తూ లేచాడు సింధూర్.

మూడో రౌండ్ సిద్ధమయింది.

ఈసారి సింధూర్ కదిలేలోగా విల్లీఫోర్డ్ ఎటాక్ చేశాడు. అతని పిడికిలి సింధూర్ మొహాన్ని విసురుగా తాకింది. బ్లాక్ చేసుకోలేదు సింధూర్. తానూ ఎటాక్ చేశాడు.

సాధారణంగా అవతలి బాక్సర్ విసిరిన పంచ్ తట్టుకుని అప్పుడు ఎటాక్ చేస్తారు. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. ఇద్దరు బాక్సర్లూ ఎటాకింగ్‌లోనే ఉన్నారు. అప్పుడు మొదలైంది చూసేవాళ్లలో రక్తపోటు. తమ స్థలాలలో లేచి నిలబడి వెర్రిగా కేకలు వేయసాగారు.

అందరినీ మించి వినబడిందో కేక - "సింధూ! కిక్ హిమ్ అవుట్!"

నాదస్వరం విన్న కరినాగులా తలతిప్పి చూశాడు సింధూర్.

అక్కడ సంయుక్త నిలబడి చేతులు ఊపుతోంది.

విద్యుత్‌తరంగంలా మూవ్ అయ్యాడు సింధూర్. అప్పర్‌పంచ్, దాని వెనుక మిడిల్‌పంచ్, తిరిగి అప్పర్‌పంచ్!

ఫోర్డ్ రిసీవ్ చేసుకునేలోగానే లెఫ్ట్ హుక్‌షాట్, దాని వెనుకే మిడిల్‌పంచ్. క్షణాక్షణానికీ సింధూర్ ఆవేశం పెరిగిపోతోంది. ఏదో పైశాచికశక్తి ఆవహించినట్లు విజృంభించసాగాడు.

విపరీతమైన వేగంతో సింధూర్ ముష్టిఘాతం గదాదండంలా విల్లీఫోర్డ్ తలను తాకింది.

పెనుతుఫానుకు కంపించిపోతున్న అరటిచెట్టులా ఊగిపోయాడు విల్లీఫోర్డ్. చుట్టూ కట్టిన రోప్స్‌కు తగిలి బరి అవతలకు పడిపోయాడతను. తిరిగి లేచే సమస్య లేదని అందరకూ తెలిసిపోయింది.

నయాగరా జలపాతం హోరుని మరిపించింది హర్షధ్వానాల ధ్వని.

నంబియార్ పరుగున వచ్చి కౌగిలించుకున్నాడు.

అందరినీ దాటి సముద్రుడిని చేరే కృష్ణమ్మలా ఎగురుతూ వచ్చింది సంయుక్త.

"మనం గెలిచాం, సింధూ! మనం గెలిచాం!" ఆనందంగా చెప్పింది.

* * *

**ఉపసంహారం :**

ఆరోజు పోలీసులకు చాలా శవాలు దొరికాయి. విక్రమ్, జాక్సన్‌ల మరణంతో ఆ నగరంలో స్మగ్లింగ్ రాకెట్ కంప్లీట్‌గా స్మాష్ అయింది.

కాలయముడిని తిరిగి ఆలయంలో ప్రతిష్ఠింపజేశారు. సింధూర్, సంయుక్త పెళ్లి కూడా ఆ దేవాలయంలోనే జరిగింది. దత్తాత్రేయకు ప్రమోషన్ లభించింది.

అయితే పేపరు చూసిన బామ్మ మాత్రం చాలా బాధపడింది. జాక్సన్ తన కొడుకు గణేష్ అని, ఆమె ఎవరితోనూ ఎప్పుడూ చెప్పలేదు. పేపరులో పడ్డ కొడుకు ఫొటో చూసి రెండు కన్నీటిబొట్లు రాల్చింది. అంతే.

కానీ ఆ షాక్‌నుండి మాత్రం ఆమె బయటపడలేదు. ఎందుకంటే ఏ కొడుకు చేతుల్లో తను వెళ్లిపోవాలనుకుంటోందో ఆ కొడుకు తనకంటే ముందే వెళ్లిపోవడం ఏ తల్లి గుండెకైనా రంపపుకోతే.

**సమాప్తం** ■